KODANDARAMA LIBRARY
TELAPROLU.
147
IPLAI3CMI26
147



భారతి

చెన్నపట్టణము, మే ౧౯౨౪

సంపుటము ౧. రక్తాక్షి. సంవత్సరము వైశాఖమాసము సంఖ్య ౫.

వాఙ్మయపరిణామము

వేటూరి ప్రభాకరశాస్త్రి గారు

శా. భాషాదేవత సుస్వరూప మది విస్పష్టంబుగాఁ గానరా;
దీషజ్ఞానమ యెల్లవారికిని; మాకీనాఁడు బహ్వర్థముల్
భాషింపన్ వలసెన్; నిబంధముల నిర్బంధం బసంబద్ధమున్
ఘోషం బేర్చెడె; మార్పు తప్ప; దిట లగ్గుం గూర్పు మోయీశ్వరా!

పండితులదగ్గఱనుండి పామరులదాఁక, పుట్టిననాఁటనుండి గిట్టిననాఁటిదాఁక, ఎల్లరకును, ఎల్లప్పుడును లోకప్రవృత్తికి భాష పరమోపకారము; అత్యావశ్యకము. కాని, వారివారిచిత్తసంస్కారములలో ఆవశ్యకతలలో రుచులలో అర్హతలలో భిన్నలక్షణము లుండుటనుబట్టి వారివారి భాషలుకూడ భిన్నలక్షణములతోనే యుండును. పండితులభాష వేఱు; పామరులభాష వేఱు; బాలురభాష వేఱు; ప్రౌఢులభాష వేఱు. వారువారు వారి

వారిభాషలలోఁ దమతమ యవసరములను దీర్చుకొనుచుందురు. పండితునకు రామకథ భవభూత్యాదిప్రౌఢకవినాటకములచే దర్శనీయము కాఁగాఁ బామరునకుఁ దోలుబొమ్మలాటచే దర్శనీయమయ్యెను. పండితుఁడు తిక్కన భారతము చదివి భారతకథ తెలిసికోఁగాఁ బామరుఁడు "హరీహరీ నారాయణాది నారాయణా" మట్టుపదములు మొదలైనవి చదివి దానిని దెలిసికొనును. పండితుఁడు "వచ్చుచున్నా"నని "వస్తున్నా"ననియనఁగాఁ బామరుఁడు "వస్తుండాను" "వత్తుండాను" అని యనును. వారి రుచులు వేఱు; వీరి రుచులు వేఱుగదా! ఇట్లు భేదపరమావధులను జూపఁబూనినచో నొక్కొక్కని కొక్కొక్కతీరుభాష యున్నదన్నంతవఱకుఁ జూపవచ్చును. ఇందులో నెవ్వరుగాని సంఘమునుండి యెట్లు తొలఁగింపరానివారుగా నుందురో అట్లే వారిభాషయు నపరిహార్యమే యగును. కాని యింతవఱకుఁ గడచినకాలమం దట్లు జరుగలేదు. ఉన్నతసంఘములవారి యుత్కృష్టభాషయుఁ దత్ప్రయోజనములును, కొంతకొంత పరిరక్షింపఁబడినవిగాని, యధమసంఘములవారి యవనతభాషయు వారిభాషాప్రయోజనములును, పరిరక్షింపఁబడలేదు. అందఱకు సమానమయిన యర్హత సమ్మానము ప్రాచీనకాలమునం దెట్లేర్పడలేదో అట్లే వారివారిభాషలకును భాషాప్రయోజనములకును సమానమయిన సమ్మానము, అర్హత, కలుగదయ్యెను. ఇది సర్వలోక సర్వభాషాసామాన్యమయిన విషయమే.

ప్రస్తుతమగుటచే నిట మన తెనుఁగునాటి మాట తీసికొనుచున్నాను. ఇతరులచేఁ బ్రాజ్ఞులని సత్కరింపఁబడినవారు, ఇతరులను దమనిర్ణయముచొప్పున వినిపింపఁగల్గినవారు, ఎవరో కొంద ఱాయాకాలములయం దేవో కొన్ని ఛందోవ్యాకరణాదివిధుల నేర్పఱచి యావిధులచొప్పున గ్రంథరచనాదికము జరుగవలెనని నిబంధములు గల్పించుచు వచ్చిరి. అధమగతినున్న తక్కినలోకము వారినిర్ణయములను గొన్నిప్రయోజనములందుఁ గొంతకొంత పాటించుచు వారిని వెంటాడుచు వచ్చిరి. దేశకాలపాత్రములనుబట్టి యానిర్ణయములును మాఱుచు వచ్చినవి. మఱియు నిట్లింతకాలమువఱకు నాభాషాలక్షణనియామకులు తమకుఁ బరిచితమయిన జనసంఘమును బ్రయోజనములను మాత్రమే లక్ష్యముగాఁ జూచుకొని నిబంధములఁ జేయుచువచ్చిరి. కాని, యాభాష ప్రచారముగాంచిన సర్వమానవసంఘమును గూర్చియు, భాషవలన వారివారికిఁ గలుగవలసిన సర్వప్రయోజనములను గూర్చియుఁ, జర్చించి సర్వార్థసాధకమగునట్లు నిబంధముల నేర్పఱిచినవారు కారు. కావ్యాలంకారచూడామణికారునినుండి బాలవ్యాకరణకారునిదాఁకఁ గలపండితులు చేసిన నిబంధము లాంధ్రదేశమందలి పరిమితమానవసంఘమునకుఁ బరిమితభాషాప్రయోజనమునకు సంబంధించినవే. అనఁగా, నవి తిక్కనభారతాదిప్రౌఢచ్ఛందోఘటిత గ్రంథములను జదువఁగలపరిమితమానవసంఘమునకుఁ బరిమితభాషాప్రయోజనమైన కావ్యానందమునకు మాత్రమే కొంత చాలి

యున్నవి. ఇంతదాఁక గడచినకాలము తీరు వేఱు. నేఁటి కాలము తీరు వేఱు. పూర్వమువారు తలఁచియైన నెఱుఁగని యావశ్యకత లెన్నో యీనాఁటివారికిఁ గల్గుచున్నవి. పూర్వమువారు మానవులుగాఁగూడ గణింపనివా రెందఱో యిప్పుడు మహనీయులగుచున్నారు. ఇట్టిస్థితిలోఁ బ్రాచీనులనిబంధము లీకాలమునఁ బనికిఁజాలనివి, పనికిమాలినవి యగుచున్నవి. భాషావిషయముననే కాక సర్వవిషయములందు నిట్టిసంఘర్షమే సంఘటిల్లినది. నేఁ డొకయద్భుతశక్తి యఖిల ప్రపంచము నావహించినది. భారతదేశము నది బలముగా నలముకొన్నది. ప్రతిమానవునకు "నేను బరతంత్రుఁడనుగా నుండరాదు. స్వతంత్రుఁడను గావలెను" అను నాత్మాభిమానము పొడముచున్నది. ఒకనినిబంధమున కింకొకఁడు లోఁబడకున్నాఁడు. బ్రాహ్మణునియాధిక్యమును బ్రతిఘటించుటకు మాలవాఁడును, మహారాజు ప్రాభవమును బ్రతిఘటించుటకు దరిద్రుఁడును బ్రయత్నించుచున్నారు. ఈసంఘర్షమనివార్యముగానున్నది. నివారించుటకూడఁ గూడనిపనిగాఁదలఁపఁబడుచున్నది. దీర్ఘదర్శులు కొందఱు పెద్దలిందుకై చండాలాదుల యస్పృశ్యతాదులను దొలఁగింపవలెననియు, దరిద్రులు సంపన్నులగుటకు వలయుసాధనముల సమకూర్పవలెననియు సంస్కారములు సేయ సమకట్టుచున్నారు. భాషావిషయమునఁగూడ నట్టిదే జరుగుచున్నది. కొందఱుపండితులు, కొన్ని భాషాప్రయోజనములనే యుద్దేశించి చేసిన నిబంధములు నిలువరింపరానివనియు, భాషవలన నంతకంటె హెచ్చుప్రయోజనము లిప్పుడు పడయవలసిన యావశ్యకత యేర్పడుచున్నదనియు సర్వమానవసంఘమును భాషాప్రయోజనసర్వస్వమును సమముగాఁ బడయవలసియున్నదనియు, నందులకై వాడుకభాషను గ్రంథరచనము జరుగవలెననియు వాదించుచున్నారు. అట్లు గ్రంథరచనములు చేయుచున్నారు. నేనును నట్టిసంస్కారము నభిమానించినవారిలో నొకఁడను. కాని, దానిఁగూర్చి యిటీవల నా యభిప్రాయము మఱింత విపులముగా విరిసి దిక్కుదోఁచనిదిగా నున్నది.

ఇదివఱకు మేము కొందఱము సంకల్పించినసంస్కారములు సంకుచితభావములు గలవిగా నే నిప్పుడు తలఁచుచున్నాను. ఏలనఁగా: "వచ్చుచున్నాను" అను శబ్దరూపమువలెనే "వస్తున్నాను" అనురూపముకూడఁ బ్రాజ్ఞవ్యవహారమందుఁ గలదుగనుక ప్రయోగార్హమని యంగీకరింపఁదగునంటిమి. కాని ప్రస్తుతకాలపరిణామమునఁ జూడఁగాఁ బ్రాజ్ఞసంఘమిది యని వేఱుపఱుచుటకిఁక వీలుకలుగనట్లున్నది. సర్వమానవసంఘమందును విద్యావిజ్ఞానములు విపులముగా వెలయుచున్నవి. అహమికనిండారుచున్నది. బ్రాహ్మణాదులవ్యవహారమందుఁ గల 'వస్తున్నాఁడు' ప్రయోగార్హమయినప్పుడు చండాలాదుల 'వస్తుండాడు' మొదలగురూపములు ప్రయోగార్హములేలకావు? బ్రాహ్మణులయాధిక్యమును జండాలురువెన్నాడకున్నప్పుడు వారిభాషాప్రయోగరీతినిమాత్ర మేల వెంటాడుదురు?

'మా సంఘవ్యవహారమున నున్న రూపము నేమేము మా గ్రంథములం దుపయోగించుకొందు' మందురేని "వస్తున్నారు" మాత్రమే ప్రయోగార్హమని తలఁచువారేమి బదులు చెప్పఁగల్గుదురు? ఇట్టిరూపములే ప్రయోగార్హములని విధించుటకు వీరి కేమియధికారమున్నది? నాకు నేనయి యింతవఱకుమాత్రమే సంస్కార మంగీకరింపఁ దగునని నిబంధింపఁబూనితినేని ఆనిబంధమునకు లోఁగువారెవరు? ఇట్టిచిక్కు భాషావిషయముననేకాక, సర్వ విషయములందును గూడ సంఘటిల్లినది. సాంఘిక రాజకీయ విషయములందుఁ గొన్నిసంస్కారములు మహాత్ములకుఁ గూడఁ గొఱుకఁబడనివిగా నున్నవి. ఈ చిక్కు యొక్క పరమావధి యేమనగా: ఒక్కొక్క మనుష్యుఁడును 'నాభాషను నేనువ్రాయుదును. ఇంకొకరినిబంధము నాకు విధాయకముగాదు' అన్నంతవఱకుఁ బోవచ్చును. కాని, ఇట్టి సంఘర్షమునఁ జిదికిపోయెడిచితనము లేవో బ్రదుకఁగల్గెడి భావము లేవో వీనిపరిణామ మెట్టిదగునో నా యల్పబుద్ధి కగోచరము గాకున్నది. నేఁడు భాషాసంస్కారము నపేక్షించి చర్చించువారిలోఁగూడ నైకకంఠ్యము లేదు. "చూచినాడు, చూచాడు, చూసినాడు, చూశినాడు, చూశాడు, చూసేడు" అని యిన్నిరూపములును వ్రాయువారున్నారు. ఇందుఁ గొన్నియే పరిగ్రాహ్యములని వ్యవస్థాపించి యాఁచిపట్టుట కధికారులు లేరు. సంస్కారమే పనికిరాదని యడ్డుపెట్టుట కంతకంటె నధికారులు లేరు. ఆసంస్కార మనివార్యముగా జరుగుచునేయున్నది. అయ్యో! ఎంతభయంకరమైనచిక్కు? ఇట్టిచిక్కొక్క భాషావిషయమందేకాక సర్వవిషయములయందు సంప్రాప్తమయినదిగదా! మానవమాత్రుఁడు ప్రాభవముచేఁగాని ప్రజ్ఞచేఁగాని యిఁకమీఁదికాలమున లోకమున నేవిషయముగాని యనుశాసింపఁజాలఁడేమోయని నా సంశయము. భగవంతుఁ డొకఁడుండెనేని లోకమును బరమానందోద్దేశమునకుఁ జేర్చుటే తదుద్దేశమేని, యాయన కల్యాణమార్గమేదో లోకమునకుఁ గల్పింపఁగలఁడు. అదియేదో అందువఱకును మన ప్రయత్నములు గ్రుడ్డియెద్దు చేనఁబడినలాగున సాగుచుండవలసినవే కాఁబోలును! అట్టి శుభసమయము లోకమునకు లభించు టెప్పుడో!

ఆంధ్రకవిత్వచరిత్రము

భోగరాజు నారాయణమూర్తి గారు, (విజయనగరసంస్థానాస్థానకవి)

విన్నపము

ఆంధ్రకవిత్వచరిత్ర మొక్కసంపుటములో ముగింపఁదగినది కాదు. † ఆంగ్లభాషలో నొక్కొకయుగమునందలి కవితాచరిత్ర యొక్కొక సంపుటముగా వ్రాయఁబడెను. అట్టులే యాంధ్రమునందుఁగూడ నాంధ్రకవితాచరిత్రమును వ్రాయవలెనని నా ప్రయత్నము. కవితా సాంప్రదాయములును, అందుఁ బ్రత్యేకించి యాంధ్రకవిత్వప్రజాడలును, దృఢపరచినవ్యక్తి పరిసర విశేషములును, నిరూపింపవలసినభారము కవితాచరిత్రకారునియం దున్నది. అట్టి మహాకార్యమును గొంతవఱకైనఁ గావించుతలంపున నీ భారతియందుఁ బ్రకటింపఁబడువ్యాసములు వ్రాయఁబడినవి.

ఈవ్యాసములపై రాఁగల విమర్శలతో నా యభిప్రాయములను సమన్వయించుకొని ప్రత్యేకగ్రంథరూపమునఁ బ్రకటింపవలె నని నాతలంపు. సహృదయులగు పాఠకులు భారతిలోఁగాని నాకుఁ బ్రత్యేకముగాఁగాని తమ యభిప్రాయములను దెలుపఁగోరుచున్నాను.

కవి - కవిత్వము

"శ్లో. యానేవ శబ్దాన్ వయ మాలపామో, యానేవ చార్థాన్ వయ ముల్లిఖామః;
తైరేవ విన్యాసవిశేషభవ్యైః, సమ్మోహయన్తే కవయో జగన్తి." అప్పయదీక్షితులు

కవిత్వచరిత్రమును వ్రాయుటకుఁ బూర్వము కవియన నెట్టివాఁడో, కవిత్వమన నెట్టిదియో విద్వత్కవులు వీని నెట్లు నిర్వచించిరో మొదట మనము చర్చింపవలసియున్నది. శబ్దశాస్త్రముప్రకారము కవిత్వము ధర్మవాచకము, కవి ధర్మివాచకము. శూరునకు శౌర్యమును, మునికి మౌనమును, సుజనునకు సౌజన్యమునుబోలెఁ గవికిఁ గవిత్వము ధర్మమైయున్నది. ఇచ్చట ధర్మమనఁగా "న్యాయాయత్తమైన వేదోక్తవిధి" గాదు. వ్యక్తిస్వభావమని యర్థము. దీనింబట్టి శబ్దార్థముల చందమునఁ గవికిని గవిత్వమునకును నవినాభావసంబంధము గల దని తేలుచున్నది. శబ్దములేకయే యర్థ ముండనియట్లు కవి లేకయే కవిత్వ ముండదు. అర్థములేకయే శబ్దముండనియట్లు కవిత్వము లేకయే కవియు నుండఁడు.

కవికవితాపరస్పర సంబంధమును గూర్చి యీ వివరణము సామాన్యమైనది. ప్రత్యేక

† Age series. Edited by Prof. Herford, M. A.

దృష్టితో నీవిషయములను బరిశీలించినప్పుడు మఱికొంత చర్చ కవకాశము కనఁబడుచున్నది. మానవజీవిత మెడతెగని యాందోళనములచే సదా నిండియుండును.

మానవస్వభావము.

అందుకుఁ దోడు మానవుని స్వభావము సైతము చంచలమైనది సాధారణముగ నెన్నిసౌఖ్యములతోనైనఁ దృప్తి నెందదు. కష్టముల సహించు ప్రయత్న మరుదు. మఱియు దురాశాయత్తమైనది. ఇంద్రియములకు బంటు. కామక్రోధాదిశత్రుషట్కము చేతికీలుబొమ్మ. ఇట్టిమానవస్వభావమునకుఁ గవి దూరస్థుఁడా? సాధారణముగాఁ గాఁడు కదా!

కవితాస్వభావము.

స్వాంతము సారవంతమై తగినంత శాంతము నోరిమియుఁ గలిగియుండవలయునఁట! కష్టసుఖములయందలి సమత్వముచే తాళ్లు అప్పలవంటి యైహికాందోళనములు తుడుచఁబడ మిక్కిలి స్నిగ్ధముగా నుండవలయునఁట! అట్టి నిర్మలహృదయక్షేత్రము నుండియే గాని కవిత తానై నిరాఘాటముగాఁ బ్రవహింపదఁట! కవిత్వ స్వభావ మిట్టిది.

ఇట్లు పరస్పరభిన్నములైన యీ రెండు స్వభావములనుబట్టి, యొకానొక మానవుఁడు కవియై యుండవచ్చునుగాని, వానియందలి కవిత్వముమాత్ర మవస్థావిశేషమునుబట్టి, తదీయహృదయక్షేత్రమునుండి నిరాఘాటముగఁ బైకివచ్చుట కవకాశము లేకపోవచ్చు నని చెప్పవలసి వచ్చుచున్నది. ఇందుచేతనే కాఁబోలు మానవస్వభావజ్ఞుండును గవితాస్వభావజ్ఞుండును నగు పెద్దనార్యుఁడు తనకుఁ బ్రబంధరచనాప్రోత్సాహకుఁడగు ప్రభువును గావ్యనిర్మాణసౌకర్యముల నిట్లు ప్రార్థించుచున్నాఁడు:

"చ. నిరుపహతిస్థలంబు రమణీప్రియదూతిక తెచ్చియిచ్చు
కప్పురవిడె మాత్మకింపయినభోజన ముయ్యెలమంచ
మొప్పుతప్పరయురసజ్ఞు లూహ తెలియంగలలేఖక
పాఠకోత్తముల్, దొరకినఁగాక యూరక కృతుల్
రచియింపు మనంగ శక్యమే?"

హృదయశాంతికై యైహికములగు కొన్ని తాత్కాలికాందోళనముల నెకప్పుడు తొలంగించుకొనవచ్చుఁగాక! కాని దైవికము లగు మహావిపత్తులు తటస్థించినప్పుడుమాత్రము కవియైనమానవుఁడు, సహించి నిలువఁగలవాఁడు. సాధారణముగాఁ గలుగఁబోఁడు.

జాన్ కీట్సు

పదునెనిమిదవశతాబ్దాంతమున జనించి, పందొమ్మిదవ శతాబ్దారంభమునఁ గల కవులలో నొకఁడైన "జాన్ కీట్సు" అను నొక యాంగ్లేయకవిజీవితము మన కీ సందర్భమునఁ దార్కాణముగాఁ గొనఁదగినది. ఇతఁడు పుట్టుకతోడనే నిఱుపేద. సాహిత్య మందమా గ్రీకుభాషలోఁగాని లేటినుభాషలోఁగాని లేశమును బ్రవేశములేనివాఁడు. ఇందుకుఁదోడు వీని సమకాలికు లాంగ్లకవితాచరిత్రమున సుప్రసిద్ధులైన "షెల్లి- వర్డ్సువర్తు- లేహంటు- హేజిలెటు-" మొదలగువారు. ఇట్టి స్థితిగతులలో కీట్సు తన కీశ్వరదత్తమైన యనుపమానమగు కవితాశక్తిని బ్రకటింప నారంభించెను. సాహితీసమర్థుఁడు గాసివానిపద్యములను (Odes) జూచి గ్రీకు లేటిను భాషా

విద్వాంసులు మేలని శిరఃకంపనము గావించుచుండిరి. బాల్యమునందే వానికవిత ప్రకృతి సౌందర్యలక్ష్మిని (The principle of beauty in all things) వరించినది. స్వభావము చెడకుండ సౌందర్యలక్ష్మిని జితించుటయందు మిక్కిలి విఖ్యాతి గాంచినది. మఱియు భాషాసౌలభ్యము, చక్కని శయ్య, మృదుమధురోచితపదగుంఫనము, శ్రవణసౌఖ్యము, భావనాశక్తి, మొదలగు విశేషములు వానికవితకు ముఖ్యాంగములు. తన హృదయస్థమగు భావమును, దద్భావాంతర్గతమగు ధ్వనియును రసవిశిష్టముగ స్పష్టపఱచుటయందును, ఒకానొక వస్తువునుగాని విషయమునుగాని కంటికిఁ గట్టినట్లు చిత్రించుటయందును, కీట్సు నతిక్రమించిన యాంగ్లకవి లేఁడఁట! తత్సమానుఁ డనఁదగినవాఁ డొక్క టెనిసను దప్ప మఱియొకఁడు గానరాఁడఁట!

కీట్సు దుర్బలచిత్తుఁడు

ఇట్లతిబాల్యమునందే సర్వాంగసౌందర్యముగల తనకవితాసుందరి లోకము నాకర్షించుచుండఁ బాపము కీట్సు తా నొకసుందరిచే నాకర్షింపఁబడి వ్యర్థమైన మనోవిచారమునందుఁ దగులుకొనెను. నానాఁటికి నమ్మోహాందోళనము మితి నతిక్రమించినది. పవనచలితమగు కేతనపటాంచలమునకును, పారావారతరంగములకును నొకప్పుడైన స్థైర్యము గలిగినఁ గలుగవచ్చును గాని కాముకునిచిత్తమునకు మాత్రము గలుగనేరదు. తన ప్రియురాలియందలి మోహాతిశయమునఁ గలిగిన దీర్ఘవిచారమున నహర్నిశలు మునిఁగిమునిఁగి తుద కతఁడు వ్యాధిగ్రస్తుఁ డయ్యెను. అందుకుఁ దోడు వానికి సహజమైనక్షయవ్యాధియుఁ బ్రబలమైనది. ఇట్టి వ్యాధిపీడచే శుష్కించి శుష్కించి పాపము కీట్సు తన యిరువదియైదవయేఁటనే కాలధర్మము నొందెనఁట!

కీట్సు మహాకవి యకాలమరణమునకుఁ గారణములైన క్షయరోగము దైవకల్పితము; మనోవ్యాధి స్వయంకల్పితము. మిక్కిలి స్వల్పమైన తనజీవితకాలములో నతఁడు గావించిన కావ్యరచన యుత్కృష్టకావ్యరచనకుఁ దార్కాణము కాకపోలేదు. కాని యాతఁ డాయుష్మంతుఁడై యుండియుండినయెడల నీశ్వరదత్తమగు వానియందలి యద్భుతకవితాశక్తి యంతయుఁ బ్రకటింపఁబడి యాంగ్లేయ భారతీయ కవిశిఖామణులచే నింతకంటె నెక్కుడుగఁ గొనియాడఁబడఁదగినదియై యుండి యుండును. కాని పాప మతఁడు మిక్కిలి దుర్బలహృదయుఁడు. లోకవృత్తమునందు వానిచిత్తము పరిణతి చెందలేదు. ఐహికాందోళనములను దొలఁగఁజేసికొను మనోబలము తనకు లేనట్లు తానే యొప్పుకొనుచున్నాఁడు.

† "O that something fortunate" he cries in the closing months of his life "had ever happened to me or my brothers!—then I might hope—but despair is forced upon me as a habit."

ఇంతియెగాక తనయవస్థనుబట్టి తనకకాలమరణము సంభవించు నని కీట్సు గ్రహించియుండకపోలేదు. గ్రహించి, యప్పటికిఁ దాను గావించిన కావ్యరచనతోఁ దృప్తి

† "The English poets" Edited by T. H. Ward, M. A., Vol. IV., P. 436.

చెందక, తా నాయుష్మంతుఁడై యుండినయెడల ప్రకృతి సౌందర్యలక్ష్మిని జేపట్టిన తన కవితాశక్తిని సంపూర్ణముగఁ బ్రకటించి కవి లోకమునఁ దాను నిరంతరసంస్మరణీయుఁడుగాఁ గాఁజాలియుందు నని యతఁడు పశ్చాత్తాపపడుచుండెనఁట!

† "In his last days, Keats wrote 'If I should die I have left no immortal work behind me—nothing to make my friends proved of my memory; but I have loved the principle of beauty in all things, and if I had had time I would have made myself remembered.'

విషయలోలుఁడును దుర్బలచిత్తుఁడు నగు కవియందలి కవితాశక్తికిఁ గొంత వినాశము తప్పదని చెప్పటకంటె నిచ్చట కీట్సుజీవితచరిత్రముతో మనకు మఱియొక ప్రయోజనము లేదు. విషయలౌల్యము, ఐహికసుఖైకానురక్తి, అసంతృప్తి, కష్టసుఖములయందు సమత్వాభావము, ఎడతెగనితాపత్రయము, మొదలగు దుర్గుణములకు లోఁబడక, స్వతంత్రుఁడై సంతృప్తుఁడై సమచిత్తుఁడై తన యుత్కృష్టకవిత్వమునకు వినాశము గలుగనీక పవిత్రతయు, మఱింత పెంపును గలిగించుకవి సాధారణముగ నేభాషాకవులలోనైన మిక్కిలి యరుదుగా నుండును. ప్రాయికముగాఁ గవిప్రపంచమున కీట్సు లనేకు లుందురు. పోతనామాత్యు లెచ్చటనోగాని కానరారు!

పోతన పరమభాగవతోత్తముఁడు. సర్వసంగ పరిత్యాగము గావించిన యోగిగాని సన్న్యాసిగాని కాఁడు. దారాపుత్రాదులతో గృహస్థాశ్రమమునందే యుండి యోగులకంటెను సన్న్యాసులకంటెను నెక్కుడు పరిణతచిత్తుఁడైనవాఁడు. కష్టము లనేకము లనుభవించెను. ఆయనుభవమతనికి లోకానుభవజ్ఞానమునం దుపయోగపడెనేగాని, తత్కవితాశక్తినిగాని, శరీరశక్తినిగాని, మనశ్శక్తినిగాని క్షీణింపఁజేయలేదు. జగన్నాటకరంగమునఁ దాను నొకపాత్ర యయ్యు, నతఁడు తనపాత్రధారణోద్యోగమును జాలించి ప్రేక్షకుఁడై దూరముగఁ గూర్చుండెను. మఱియు నమ్మహాకవి దరిద్రుఁడు కాఁడు. శమదమమ్ము లాతని కంగరక్షకులు; ఇంద్రియము లాతనికనుసన్నల మెలఁగు సేవకులు; కామక్రోధాదులు వానికిఁ గప్పము సెల్లించు పరాజితశత్రులు; సమత్వము వానియధివసించు సింహపీఠిక. ఇట్టి మహారాజచిహ్నములతోఁ గవితారాజ్యమును బాలించి కవిరాజగుపోతరాజు తుదకుఁ గైవల్యసామ్రాజ్యమును బొందఁగలిగెను!!!

ఒక్కపోతనామాత్యుఁడే కాఁడు. లోకమున నొకానొకమహాకార్యమును గావింప జనించు మహాపురుషులెల్లరు నిట్టిలక్షణములు గలవారే. తాము గావింప నెంచిన మహాకార్యమునందు దృఢనిశ్చయులై యిహముతో సంబంధించిన యితరవ్యాపారములయందువారంటియు నంటనియట్లు లుందురు. మానవవిధి నిర్వహించుటకై వారేదేనొకానొక కార్యభారమును బూనుకొనవచ్చును. కాని యయ్యది వారి కుపాంగము. నిశ్చితమహాకార్యమే వారి జీవితమునకు ముఖ్యాంగము.

† "The English poets" Edited by T. H. Ward, M. A., Vol. IV. P. 436.

కవిజీవితకార్యము కావ్యరచన

మిల్టను మహాకవిజీవితమును బరిశీలింపుఁడు! అతఁడు కీట్సువలెఁగాక పోతనవలెఁ బరిణతహృదయుఁడు. పామరులకు స్వర్గమార్గముఁ జూపినమార్గదర్శి. తనకవితామృతమును వర్షించి యాంగ్లభాషా ప్రపంచమున యశఃకల్పతరువ్రను గల్పాంతమువఱకుఁ బెంపొందించుట యమ్మహాకవి ముఖ్యోద్దేశము. అట్టి దృఢనిశ్చయముతో మిల్టను కావ్యరచనకుం గడంగెను. కాని ప్రారంభించిన కొలఁది కాలములోనే వానికావ్యరచనకు విఘ్నము చేకూరినది. ప్రజలకును బ్రభుత్వనకును నంతఃకలహములు జనించుటచేత, మిల్టను ప్రజాపక్షమునఁ జేరి ప్రభుత్వనకు విరోధముగాఁ బనిచేయవలసివచ్చెను. అందుచే నతఁడు తన జీవితకార్య మగు (Life work) కావ్యరచనను గొంతకాలము విడిచి, ప్రజాపక్షమునఁ బనిసేయు నాయకులలోఁ జేరుకొనెను. తనకావ్యరచన కడ్డము గలిగించిన యేతత్తాత్కాలిక కార్యభార మెంతోకాల ముండదని యాతఁడు భావించెను గాఁబోలు! ప్రారంభించినకార్యము ఫలించువఱకు నుత్తము లెన్నఁడుఁ బరిత్యజింపరుకదా? అందుచే మిల్టను దాను బ్రవేశించిన రాజకీయవ్యవహారములలోఁ గృతకృత్యుఁడు కావలెనని పనిచేయుటలో నించుమించుగ నిరువదిసంవత్సరములు గడచిపోయెను. అప్పటికైన నాకార్య మాతఁ డనుకొనినంత జయప్రదముగాఁ దుదముట్టలేదు. తుట్టతుదకుఁ బ్రజాప్రతిపక్షుఁడే ప్రభువుగా నేర్పడుటచేతఁ బ్రజాపక్షమున నాతఁడు గావించిన యుద్యమము వ్యర్థమైనది.

ఒకానొక కార్యమును గూర్చి యిరువది సంవత్సరము లఖండముగఁ గావించిన ప్రయత్నము నిష్ఫలమై పోయినయెడల, సామాన్యమానవుఁ డాత్మశక్తియందు విశ్వాసము చెడి, నిరుత్సాహచిత్తుఁడై తనజీవితమునందు మఱియెట్టి స్వల్పకార్యమునైనను సాధింపలేక, జీవితశేషమును ననామకుఁడయియే గడపియుం

కవి చిత్తదార్ఢ్యము

డును. కాని మిల్టనుమాత్ర మట్టిదుర్బలచిత్తుఁడు గాఁడు. వాని కాత్మశక్తి మెండు. అందాతనికిఁ బూర్ణవిశ్వాసము గలదు. గతించిన యపజయముగాని, ప్రారంభించిన ముదుసలితనముగాని వానిభవిష్యత్కావ్యరచనాప్రయత్నమునకు నిరుత్సాహమును బుట్టింపఁజాలక పోయినవి. రాజకీయ వ్యవహారములు విడిచిన తోడనే యతఁడు తనకావ్యరచన ప్రారంభించెను. క్రొత్తగా వచ్చినరాజు ప్రజాపక్షమునఁ బనిచేసిననాయకుల ననేకుల ననేకవిధముల శిక్షించుచుండుట యెఱింగియు, వాని చిత్తము భయముగాని చాంచల్యముగాని పొంది కావ్యరచనాపరత్వమునుండి తప్పిపోలేదు. ఆదినములలో వానికిఁ గొన్ని ఋణబాధలు సైతము నుండెడివఁట! మహాయోగనిమగ్నుఁడై పరబ్రహ్మమునందుఁ దన్మయత్వముచెందిన యోగీశ్వరునివలె నతఁడు బాహ్యప్రపంచమునందు లేశమును దృష్టియేలేక, కవితానందపరవశుఁడై తదేకధ్యానముతో మహాదీక్షతో, 'Paradise lost and paradise regained' అను రెండుభాగములు గల మహాకావ్యమును రచించి, యాంగ్లకవిపుంగవులలో, నాచంద్ర

తారార్కమైన యశస్సంపద సంపాదింపఁ గల్గెను. జితేంద్రియుఁడును జీవన్ముక్తుఁడును ననుటకెం కెట్టివాఁడు కావలయును?

కవికవితాసంబంధపర్యవసానము

నిజమైనకవి సర్వజ్ఞుఁడు. సాధారణము గ నేభాషాకవులలోనైనఁ బోతన మిల్టనుల వలెఁ జిత్తపరిణామముగలకవులు మిక్కిలి యరుదుగా నుందురు. పరిపక్వ హృదయుఁడు గాని కవికవిత్వము పామరత్వసంపర్కమున వన్నె చెడకపోదు. ఇట్టి కారణములచేఁ గవి యగువానియందలి యీశ్వరదత్తమగు కవిత త్తదవస్థా విశేషములంబట్టి సంపూర్ణముగ వికసింపకపోవచ్చునని చెప్పుట కవకాశము గలుగుచున్నది.

వస్తుసౌందర్యము: కవిత్వము

కవికిని గవిత్వమునకును గల సంబంధమునుగూర్చి చర్చనీయాంశ మింకొకటిగలదు. పరమాణువు మొదలు బ్రహ్మాండమునం దంతటం గల జంగమస్థావరరూపకములగు సమస్త వస్తు విశేషములలోఁ గవి దేనినైన వర్ణింపవచ్చును. నిజమైనకవి రచించినరచన యందుఁ గవిత్వముండక తప్పదు. అందుచేఁ గవివర్ణించిన ప్రతివస్తువునందునుగూడఁ గవిత్వముండుట, కవియొక్క శక్తి విశేషమా? బ్రహ్మయొక్క సృష్టివిశేషమా? అడవియందనామకముగాఁ బెరుగు తెల్లుగడ్డియు, సముద్రపుటొడ్డున నలలయలజడిని బేరుకొనిన నురుఁగును నెంతటి ప్రయోజనములేని వస్తువులు! మహాత్ములయశస్సు వర్ణించు సందర్భమునఁ గవి వీనిని సాధనములుగా గ్రహించుచుండుటచేత, నీరెండల్ప వస్తువులకును నత్యౌన్నత్యము ప్రాప్తించినది. మఱియు నెట్టి విలువయు లేని యీరెండువస్తువులను యశోవర్ణనమున కుపమానములైన వజ్రములు, ముత్యములు, కప్పురము, మొదలగు మహావస్తువులలోఁ జేర్పఁబడుచున్నవి. సృష్టియందలి వస్తుసౌందర్యము కవికిఁ దప్ప మఱియొకనికిఁ గానరాదు. ఆసౌందర్యము కవిత్వమును నాకర్షించును. కవిత్వ మాసౌందర్యమును నాకర్షించును. మఱియు నాసౌందర్యమే కవిత్వమనియుఁ జెప్పవొప్పును. అయ్యది తృణము మొదలు మహామేరువు వఱకుం గల ప్రతివస్తువునందును నిండియున్నది. కవిమనో నేత్రమునకు మాత్రమే దృష్టమగుచున్నది. అందుచే నట్టియదృష్టములేని యితరుని కంటికి తెల్లుగడ్డి తెల్లుగడ్డియే; సముద్రపునురుఁగు సముద్రపు నురుఁగే.

సృష్టియందలి ప్రతివస్తువును గవితాత్మకమగు సౌందర్యముచే నిండియున్నప్పుడు, ఒకానొక వస్తువుకడకు నలువురు కవు లొక్కమారే పోవుట తటస్థించునేనిఁ దద్వస్తుసంస్థితంబగు కవితాసౌందర్య మానలువురుకవుల నొక్కమారే యాకర్షించుచునుగదా! అప్పటున

కవితాస్వరూపము

నన్నలువురు రచించురచనలునుగూడ నొక్క ప్రతియే యగునా? యనుప్రశ్న వచ్చుచున్నది. కాని సౌందర్యమే కవిత్వమైనపుడు, తత్సౌందర్యమ్మునకుం బలెఁ గవిత్వమునకుఁ గూడ నిదమిత్థమను నాకారనిర్ణయ ముండదు. నలుపు, తెలుపు, పసుపు, మొదలగువానిలో

నేరంగుగలవస్తువునందైనను సౌందర్య ముండవచ్చును. ఆసౌందర్యము తద్వస్త్వాకారవిశేషమునుబట్టి ప్రకాశించుచుండును. ఒక్కదీపమే పలురంగుల గాజుకుప్పెలయందుఁ బలువిధములగు కాంతుల నీనుచున్నది. కవితాప్రకాశముగూడ నట్టిదియే.

కవులు: భిన్నతత్త్వములు

వస్తుసౌందర్యము కవిహృదయమునందుఁ బడి యందుండి వెడలునపుడు వానిహృదయతత్త్వమునుబట్టి ప్రకాశించుచుండును. ఒక కవి శృంగారపురుషుఁడు. మఱియొకకవి మహాభక్తుఁడు. ఈయిరువురుకవుల కవితారచనలును బరస్పరభిన్నములై వారివారిమనస్తత్త్వముల కనుకూలముగనే యొప్పుచుండును గాని, సాధారణముగాఁ గలయునేరవు. కవిత విచిత్రమైన యొకయద్దము వంటిది. అందుఁ జూచినయెడల నెన్నిశతాబ్దముల క్రిందటనుండిన కవియైనను మనకుఁ గన్పడుచుండును.

హృదయ తత్త్వప్రకాశము

మహాకవియైన ధూర్జటి కవితారచన నించుక పరిశీలింతము. అతఁడు శివభక్తాగ్రేసరుఁడు గదా? తత్కృతి దర్పణమునందుఁ జూచినప్పు డాతఁడు మూర్తీభవించిన శైవభక్తివలె మనకుఁ దోఁచుచున్నాఁడు. వాని చిత్తము శ్రీకాళహస్తీశ్వరునియందు సంపూర్ణతన్మయత్వము చెందుటచేతఁ బ్రపంచమునఁ బ్రతివస్తువును శివలింగాకారముతోడనే వానికిఁ గన్పడుచుండెను. చూడుఁడు! కవి గావించిన చంద్రోదయవర్ణన మెంతవింతగ నున్నదో!

"మ. ఉదయగ్రావము పానవట్టు, మభిషేకోదప్రవాహంబు వార్ధి, దరధ్వాంతము ధూపధూమము, జ్వలద్దీపప్రభారాశి కౌముది, తారానివహంబు లర్పితసుమంబుల్ గాఁ దమోదూరసౌఖ్యదమై శీతగభస్తిబింబ శివలింగం బొప్పెఁ బ్రాచీదిశన్."

ఇంతియేగాక మఱియొకసందర్భమునఁ గవియంధకారము నిట్లు వర్ణించుచున్నాఁడు.

"క. పంకేరుహాప్తబింబము
గ్రుంకఁగఁ దిమిరం బజాండగోళము నిండెన్
శంకాతమఃపరంపర
శంకరచిద్రహితమానసంబును బోలెన్."

ఇంకొకచోటఁ గవి కొకకమలాకరము నాకారము పరబ్రహ్మమువలెఁ గానవచ్చిన దఁట!

"గీ. హంస సంసదభీష్ట విహారహేతు
వై బహూదకహృద్యమై యప్రతర్క్య
మగుచు, నద్వంద్వమై పంకజాకరంబు
పోలిచె బ్రహ్మంబు తెఱఁగునఁ బూర్ణ మగుచు."

ధూర్జటి యెంతటిశైవభక్తిప్రపూర్ణుఁడైనను విష్ణునామశ్రవణాభావుండైన వీరశైవుఁడని చెప్పుటకుమాత్రము వీలులేదు. కేవల వైష్ణవమునుగాని, కేవలశైవమును గాని యభేదప్రతిపత్తిగల మహాత్ములు పామరత్వమనియే యూహింతురు. ధూర్జటి కట్టి పామరత్వము లేదని వానిహృదయ తత్త్వమును బ్రకటించు నీక్రింది పద్యమువలనఁ దెలియుచున్నది.

"మ. సకలాపూర్ణుఁడు నీలవర్ణుఁడనుటల్ సత్యంబుగాఁ
దెల్పుపో, లికఁ జెంజీకటి నిండఁ దారకలు వెల్సెన్
నిర్జరాధీశ్వరా, దిశ లర్పించినపువ్వులట్లు భవుఁ డద్దే
వుండు భేదంబు గా, కిఁ దెల్లంబుగ నల్పు దెల్ప
గ ధరన్ వింఁచెన్ శశాంకాకృతుల్."

తన్మయత్వ ప్రతిబింబము

పోతనామాత్యుని మతము విష్ణుగుణ వర్ణనము. 'ఏసీగుణములు కర్ణేంద్రియంబుల సోక దేహతాపంబులు దీరిపోవు' అని యతఁడు రుక్మిణిచేఁ బలికించిన వాక్యమే వానిజీవితమునకు ముఖ్యసూత్రము. ఆసూత్రము ననుసరించియే యతఁడు భాగవతమంతయు రచించెను. వాని చిత్తము భగవద్గుణ వర్ణనమునందుఁ దన్మయత్వము నొందుటచేత నందుండి వెలువడిన కవితాప్రవాహమునందాతన్మయత్వ మెట్లు ప్రతిబింబించుచున్నదో చిత్తగింపుఁడు!

యశోద కృష్ణుని మందలించుట

"క. పట్టినఁ బట్టువడని నినుఁ
బట్టెద నని చలము గొనినఁ బట్టుట బెట్టే?
బట్టునడవంద్రు పట్టీ!
పట్టుకొన న్నారుఁ గాక పరులకు వశమే!

క. ఎక్కడ నైనను దిరిగెద
వొక్కయెడం గుణము గలిగియుండవు, నియమం
బెక్కడిది నీకు? మఱచినఁ
జక్కఁగఁ బోయెదవు పెక్కు జాడలఁ బుత్రా!

సీ. తోయంబు లివి యని తొలఁగక చొచ్చెదు
తలఁచెదు గట్టెనఁ దరల నెత్త,
మంటితో నాటలు మానవు కోరాడె
దున్నతస్తంభంబు లూఁపఁబోయె
దన్యుల నల్పంబు లడుగంగఁ బోరెదు
రాచవేటలఁ జాల రవ్వ దెచ్చె
దలయవు నీళ్లకు నడ్డంబుఁ గట్టెదు
ముసలిపై హరివృత్తి మొనయఁ జూచె
దంబరంబు మొలకు నడుగవు తిరిగెద
వింకఁ గల్కిచేత లేలపుత్ర!
నిన్ను వంప ద్రోల్ప నే నేరనయితి నీ
విట్లు క్రిందుమీఁదు నరయ కున్కి."

ఇది వ్యంగ్యప్రధాన (Suggestiveness) మైన కవిత. అన్నివిధములైన కవిత్వములలో వ్యంగ్యకవిత్వ మత్యుత్తమమని లాక్షణికులు శాసించుచున్నారు. యశోద దుడుకుఁదనము నుండి తనకొడుకును మందలించుటయే యిచ్చటి కథాభాగము. దీనిని రచించుటలోఁ గవిహృదయమునఁ బుంజీభవించియున్న భగవద్గుణములు వానికవితా ప్రవాహములో మునిఁగి వెలుపలికిఁ గొట్టుకొని వచ్చినవి. రుక్మిణి నపహరించిన కృష్ణుని, రుక్మిచేఁ దూలనాడింపవలసినపట్టునందుఁగూడ కవి తనకు సహజమైన భగవద్గుణవర్ణనాపక్షపాతమును విడిచిపెట్టలేదు.

"సీ. మాసరివాఁడవా మాపాపఁ గొనిపోవ
నేపాటిగలవాఁడ వేది వంశ
మెందు జన్మించితి వెచ్చటఁ బెరిఁగితి
వెయ్యది నడవడి యెవ్వఁ డెఱుఁగు
మానహీనుఁడ వీవు మర్యాద లెఱుఁగవు
మాయ గైకొనిగాని మలయ రావు
నిజరూపమున శత్రునివహంబుపైఁ బోవు
వసుధేశుఁడవు గావు వావి లేదు
కొమ్మ నిమ్ము నీవు గుణరహితుండవు
విడువు విడువవేని విలయకాల
శిఖిశిఖాసమాన శితశిలీముఖముల
గర్వ మెల్లఁ గొందుఁ గలహమందు"

ఇట్లు కవిహృదయ తత్త్వము తద్ద్వారచితంబగు కవిత్వమ్మునం దందందుఁ బ్రతిబింబించుచుండును!

కవి-కవిత్వము

II

భోగరాజు నారాయణమూర్తి గారు

కవితయందుఁ గవిహృదయ మెట్లు ప్రతిబింబించునో మనము కొంత చర్చించితిమి కాని యట్టిహృదయప్రతిబింబము మాత్రమే కవిత్వమని చెప్పుటకు వీలు లేదు. ఒకానొక వస్తువిశేషమునుగాని యవస్థావిశేషమును గాని (situation) వర్ణించునప్పుడు పైని వివరించినట్లు కవి యొకప్పుడు తనమనస్తత్త్వమును భావనాశక్తిచేఁ బ్రతిబింబింపఁ జేయవచ్చును. ఒకప్పుడు స్వభావము చెడకుండ వర్ణ్యమును దనరచనాచాతుర్యమునఁ జిత్రకారునివలెఁ జిత్రించి మనకన్నులకు వ్రేలాడఁగట్టవచ్చును.

కల్పనాశక్తి

ఒకప్పుడు తనకల్పనాశక్తి ప్రకటింపవచ్చును. కవి తనకవిత్వపటుత్వ మిన్నివిధములుగాఁ జూపుట కవకాశమున్నది. వీనిలోఁ గల్పనాశక్తిని మాత్రము కవి రసవిశిష్టములైన భాగములయం దుపయోగింపఁడు. రసపోషణమునకు భావనాశక్తివలెఁ గల్పనాశక్తి తోడుపడలేదు. అందుచే నయ్యది కవికావ్యమునందుఁ బ్రాయికముగా రసానంతరమునందే కాని రసాంతరమునందుఁ గానరాదు. కావ్యరసార్ణవమగ్నుఁడై కవి పాత్రలయందైక్యము నొంది తన్నుఁ దా మఱచిపోవును. కావ్యసృష్టియందలి సుఖదుఃఖాద్యవస్థలన్నియు ననుభవమునకుఁ దెచ్చుకొని తాను నవ్వి నవ్వించుచుండును. ఏడ్చి యేడ్పించుచుండును.

ఆంధ్రకవితాపితామహుఁడు, భావనాశక్తి ప్రవరుఁడు శుద్ధశ్రోత్రియుఁడు వరూధినిమహాప్రౌఢ. పెద్దన యియ్యిద్దర నొక్కయెడఁ జేర్చెను. ఇది కేవలశృంగారరసప్రకరణము గాదు. భక్తిశృంగారములను బోతనవలె శాంతశృంగారములను బెద్దన కడు నేర్పుతో జోడించెను. మిహికాహార్యప్రాంతమున నభోవాహినీలహరీ శీతల గంధవాహపరిఖేలన్ మంజరీసౌరభగ్రహణోందిందిరతుందిలంబగు నొక్క కాంతారాంతరమునందుఁ బువ్వుఁదీవెలును ద్రాక్షతీవెలును నల్లుకొనిన నెలరాళ్లపండళ్లుగల గరుడపచ్చలసుందరమందిరము ముంగరి తీయమామిడిగున్న క్రింద నొప్పు తిన్నెపైఁ గూర్చుండి యింపు దళుకొత్త వీణవాయించుచుండిన వరూథిని, మకరాంకశశాంక మనోజ్ఞమూర్తియు నలేఖ్యతనూవిలాసుండు నగు ప్రవరునిం జూచినది. చూచి పూచినసంపెంగపోలుపు మధుకరాంగనలకుం బలె, వానిచక్కఁదనం బన్యకామినులకు భోగ్యంబని యెఱింగక యాతనిం గామించినది. కామించి యింతలు కన్నులుంపఁ దెరువెవ్వరి వేఁడెద వనియు, కైతవకుసుమశరాసన యని సంబోధించియు, తా నేకాంతమునందున్న జవరాలనియు, లోనికి రమ్మనియు, నాతిథ్యము గొమ్మనియు, ననేకవిధముల నర్మ

గర్భముగాఁ బలుకుచుఁ దనమనోవికారమును వానియెడ వెల్లడించినది.

ఇంక, ప్రవరుఁడో వేలిమియు సురార్చనయు విప్రసపర్యయుఁ జిక్కుటయుఁ, దనకుభుక్తికి వేళ యతిక్రమించుటయు, వృద్ధులైనజననీజనకు లాఁకట సొలుచుఁ దనరాకకై యెదురు చూచుచుండుటయుఁ దలంచుకొనుచుఁ, దానిలు సేరకున్న సమస్తధర్మంబులుఁ దూలు నను చింతతోఁ దద్గంధర్వాంగన యనన్యసామాన్యలావణ్యాతిశయమునకుఁ గాని, తదీయశృంగారచేష్టలకుఁ గాని, నర్మగర్భముగాఁ బలికిన పలుకులకుఁ గాని లేశము కలంగఁ డయ్యె.

పాత్రైక్యత

ఈ ప్రకరణమునందు నాయకీనాయకుల వాక్యోపవాక్యములయందు నత్యుక్తులు లేవు. ఆకాశమునంటుకల్పనలు లేవు. ఇందలికవితాశక్తియంతయు రసోత్కర్షకు ముఖ్యోపకరణమగుభావనాశక్తియందే మిళితమై యున్నది. ఆభావనాశక్తి క్రమక్రమముగాఁ బరిణామావస్థకు వచ్చినంతనే కవి నాయకీనాయకులయందు సంపూర్ణతన్మయత్వము నొందుచున్నాఁడు. కవి తానేవరూథినియగుటచే సముచితవాచాభినయాంగాభినయాదులతోడను, నర్మగర్భోక్తులతోడను, నిష్ఠురోక్తులతోడను, మదిగరఁగించుననునయాలాపములతోడను, ప్రవరుని యెడమోహోత్కర్షావిష్కరణము నంత స్వభావసిద్ధముగాఁ గావింపఁ గలిగెను! మఱియుఁ గవి తానే ప్రవరుండగుటచే, శుద్ధశ్రోత్రియత్వము ఏకపత్నీవ్రతపరత్వము, ఇంద్రియపటుత్వము, నిత్యకర్మానుష్ఠానాసక్తి, సురార్చనావిప్రసపర్యానురక్తి, మాతాపితృభక్తి, నిష్కళంకవైరాగ్యదీక్ష, మొదలగు నుత్తమలక్షణముల నౌచిత్యము చెడకుండ నింతగాఁ బ్రకటింపఁ గలిగెను!

రసము పరిణతి చెందువఱకును గవి యిట్లు పాత్రలయందే తన్మయత్వము చెంది యుండును. రసమునకుఁ బరిణామావస్థ తటస్థించిన పిమ్మట నారసము మఱి పోషింపఁబడదు. పోషించుటకుఁ గవియును బ్రయత్నింపఁడు.

ప్రవరసాంగత్యమునకై వరూథిని తన చాకచక్యమంతయుఁ బ్రకటించినది. కాని కార్యము లేకపోయినది. అందుచే నింకఁ గేవలశృంగారచేష్టలును వర్ణనలును గొఱగావని నిశ్చయించినది. నిశ్చయించి కుయుక్తులలోనికి దిగినది. యజ్ఞకోటులం బావనుఁడౌటకు ఫలము మాకవ్వఁగిళ్ల సుఖంచుటేకదా యని బోధించినది. వెన్నవలెం గరంగునలివేణులఁ గౌఁగిటఁ జేర్చు భాగ్యము లెన్నిభవంబులం గలుగునని హెచ్చరించినది. సశరీరస్వర్గసుఖ మనుభవింపుమని ప్రోత్సహించినది. "ఆనందో బ్రహ్మ" యనుశ్రుతివాక్యమును బ్రమాణము చూపినది.

ఇంకఁ బ్రవరుండు నీవన్నయర్థం బెల్లఁ గాముకునకు మాత్రమే నిజముగాని యకాముఁ డిది గణింపఁడని తృణీకరించెను. ఇంద్రియవశగతిచే బ్రాహ్మణుఁడు బ్రహ్మానందాధిరాజ్యపదవీచ్యుతుఁడై చెడునని దృఢీకరించెను. మోక్షలక్ష్మీపథ్యాగమసూత్రపంక్తికి మీమాంసాంప్రదాయార్థము లిట్టివియేనా యని "యానం

దో బ్రహ్మ" యనుసూత్రమున కామె యర్థము నుఖండించెను. ఇట్టితుచ్ఛసుఖములు మీసాలపైఁ దేనియలగుటచే నరకములు దర్భలు నగ్నులును నాకుఁ బ్రియంబు లగున ట్లన్యంబులు గావని వ్యక్తపరచెను.

రసపరిణామము

వరూధిని చేయఁ దగిన దింకే మున్నది.? ప్రవరుఁడు నిరాకరించుకొలఁది నామె మోహ ముద్రేకింపసాగెను. ఆమె మోహ ముద్రేకించుకొలఁది వానివైరాగ్యము బలపడఁ జొచ్చెను. శృంగార శాంతరసముల కిప్పుడు పరిణామావస్థ తటస్థించినది. రతిసంరంభ మతిక్రమించి నంతనే వరూధిని బలాత్కృతిని వానిపైఁ బడి, ప్రాంచద్భూషణబాహుమూలరుచితోఁ బాలిండ్లు పొంగారఁ బైయంచుల్ మోవఁగఁ గౌఁగిలించి యధరం బాసించినది. శృంగారరసమున కింతకంటె మఱిపరిణతి యుండదు. ఆబ్రాహ్మణుండును హా శ్రీహరీ! యంచు నోరమోమిడి, తదీయాంసద్వయం బంటి పొమ్మంచుఁ ద్రోసెను. శాంతరసమునకుఁగూడ నింతకంటెఁ బరిణతి యుండదు. ఇట్లు ఈరెండురసములును బరిపక్వదశకు వచ్చినంతనే కవి పాత్రలనుండి వేరగుచున్నాడు. వేఱు, 'కలంచునే సతులమాయల్ ధీరచిత్తంబులన్' అని నవ్వుకొనుచున్నాఁడు!!

పిమ్మటఁ బ్రవరుండు సంపూర్ణవిజయముతో నగ్నిభగవానుం బ్రసన్నుం గావించుకొని తత్సహాయమున నిలు సేరఁగలిగెను. ఆదైవప్రసన్నతయే వానిశాంతరససర్వస్వమునకు ఫలసిద్ధి! కవిభావవీథియం దిపు డొక్క వరూధినిమాత్రమే యున్నది. మతిచెడి తత్పర్వతప్రాంతకాంతారములలోఁ బ్రవరాన్వేషణార్థ మున్మాదినివలెఁ దిరుగుచున్నది. కవి కామెయం దిప్పు డత్యంతకరుణారసము జనించినది. వరూధినీహృదయవేదన కవి తనయనుభవమునకుఁ దెచ్చుకొనుటచేతనే వరూధినీవిలాపమునందుఁ గరుణారసవృష్టి యుట్టిపడుచున్నది. ప్రవరునికై యతికరుణముగా విలపించి విలపించి, తుద కక్కాంతామణి కుసుమితలతాంతనిశాంతశశికాంత వేదికాంతరమున మేను వాల్చినది. ఇంతతోఁ గరుణారసమును ముగించినది.

కల్పనాశిల్పము

ఇంకఁ గవి భావనాప్రపంచమునం దెవ్వరును లేరు. శాంతశృంగారములయందుఁ గొంతసేపును గరుణారసమునందుఁ గొంతసేపును మునిఁగిమునిఁగి కవి యిప్పుడు రసార్ణవము నుండి పారమును జేరుకొనెను. వాని కిప్పుడు సంపూర్ణవిశ్రాంతి కలిగినది. అందుచేఁ దన యనల్పకల్పనా శిల్పమును (Meta-physical Poetry) బ్రదర్శించుటకుఁ బ్రారంభించెను. తత్ప్రదర్శనమునకు నాందిపద్య మిది.

వ. తరుణి ననన్యకాంత నతి
దారుణపుష్పశిలీముఖవ్యథా
భరవివశాంగి నంగభవు
బారికి నగ్గముచేసి, క్రూరుఁడై
యరిగె మహీసురాధముఁ డ
హంకృతితో నని రోషభీషణ
స్ఫురణ వహించె నో యన న
భోమణి దాల్చెఁ గషాయదీధితిన్.

కరుణారసవృష్టి యిప్పుడే యాఁగినందున నవ్వానచినుకు లిందులోఁ గొంచెము. తోఁటకి నవిగాని యీతరువాతి పద్యముల కట్టి సంపర్కమే యుండదు.

క. తరణి యిదె గ్రుంకుచున్నా
డరుదెమ్మని చంద్రుఁ బిల్వ నరిగెడురజనీ
తరుణీమణి దూతిక లన
నరిగెం దూర్పునకు నీడ లతిదీర్ఘములై.

క. అంతటఁ బ్రాచి నిశాపతి
యంతికగతుఁ జౌట విని ముఖాలంబితమః
కుంతలములు దీర్పఁగఁ గొను
దంతపు దువ్వెన యనంగ ధవళిమ దోఁచెన్.

చ. మరున కొసంగఁ గాలము త
మశ్ఛటకాటకగా నవోదయ
స్ఫురదరుణ ప్రభాపథిక
శోణితసిక్తసితోడు భక్తమున్
హరిహయదిఙ్నభస్థలము
నం బలి చల్లి పటాంకమున్ వసూ
త్కరభరితంబునై వెలుఁగఁ
గాంచి సుధానిధి నెత్తె నత్తటిన్.

ఇట్టి కల్పనాశిల్పమునకును గథాకథనమునకును బరస్పర సంబంధముండవలయు నను నియమము లేదు. ఒకప్పుడీ రెండును గలయవచ్చును. కలయకపోవచ్చును, ఈకల్పనాశిల్పమునందుఁ గవి, తననిరంకుశత్వమును వెల్లడించుచుండును. నూతన సృష్టికౌశలమును బ్రకాశింపఁ జేయుచుండును. ధూర్జటి యొక్క తామరకొలనెంతచిత్రముగ వర్ణించెనో చిత్తగింపుఁడు.

చ. దళములలో రథాంగనిన
దంబు పరాగము రాజహంసస
కులము శిలీముఖభ్రమణ
ఘోషము నవ్యకబంధము ల్సము
జ్జ్వలవరపుండరీకములుఁ
జాలఁగఁ గల్గి మహాహవస్థితిన్
బోలుపు నహించు నక్కొలని
సొంతకు నొయ్యనఁ జేరి యచ్చటన్

కవి నిరంకుశుఁడు

సరోవరమునకును సమరరంగమునకును జతుర్దశభువనములయం దెచ్చటను సామ్యము లేదు. ఏవిధమైనసంబంధముగాని, యాకృతియం దైనను బోలికగాని, సృష్టియందుఁ గానరాదు. అట్టియెడ సరోవరాకారమును సంగరరంగాకారముగా సమన్వయించుట యొక వింతసృష్టికదా? ఈసృష్టి కావ్యప్రపంచము నందుఁ గవియే గావింపఁగలఁడు. తదితరులకీయధికారము లేదు. అట్టినిర్మాణశక్తియుఁ గలుగదు. ఒకప్పు డెవఁడైన నక్కొలనిం గని యిది యుద్ధరంగమని పలికినయెడ, విన్నవారు వానికి మతిభ్రాంతి కలిగినదని యున్మాదవైద్యశాలకుఁ బంపివేసెదరు. సకలవిషయములయందుఁ గవియొకఁడే నిరంకుశుఁడు. ఆతనిదృష్టి గగనమధ్యవ్యాప్తమై నాట్యమాడుచుండును.

'The poet's eye in a fine frenzy rolling doth glance from earth to heaven and heaven to earth' (Shakspeare)

కవి బ్రహ్మ

ఈశ్వరసృష్టియందలి నిర్జీవపదార్థములను దనకవితాప్రపంచమునఁ జేర్చి కవి వానికిఁ బ్రాణప్రతిష్ఠ గావించుచుండు నపరబ్రహ్మ. తత్ప్రపంచమున వాహినీరత్నాకరులు కైరవశీతకరులు - పద్మినీ ప్రభాకరులు - కాముకీ

కాముకులై వింతవింతసోయగములు వహించుచుందురు. లోహకారుఁడు కనకద్రావకంబునందు వైచి లోహపదార్థములకు మాత్రమే మెఱుఁగు పెట్టఁగలఁడు. కావ్యకారుఁడు కవితారూపకమగు నపూర్వకనకద్రావకమున లోహ లోహేతర సకలపదార్థములకును నన్నె పెట్టుచుండును. మఱియు లోహకారుని మెఱుఁగు కృత్రిమము, నస్థిరము; కావ్యకారుని మెఱుఁ గకలంకము, నాచంద్రార్కము!

కవితాప్రతిబింబితసామాన్య విషయములు.

కేవలదృష్టికి సామాన్యముగాఁ దోఁచు విషయములును వస్తువులును గవితాదర్పణమునం దెంతయు మనోహరములై ఘనతరములై తోఁచుచుండును. నిగమశర్మకు వాని యక్క గావించిన ప్రీతిపూర్వకోపచారములు రామకృష్ణునికవితయం దెంత మనోజ్ఞములై యున్నవో చూడుఁడు!

క. ఇంతులు నంతలు నగు తన
సంతానము చంప వెంట సంపడి సేయన్
బ్రాంతమున నిలిచి తమ్మని
కుంతలబంధనము విడిచి కుశలాశయయై.

గీ. ఎలయుసీత్కారములతోడ నీళ్లు గ్రక్క
యంటుసంటులు పరికించి యంట్లఁ గోడిచె
గోరుముక్కల దిగదుడ్వి తూరుపెత్తి
నెఱులు గలిగిన చేల నన్నింటిఁ దిగిచె.

క. మెడమన్ను నలఁచి యలకలు
ముడిగొని, నిజపాణిపద్మములు గరగరగాఁ
గడిగికొని, తనకు మఱఁదలు
విడె మొసఁగుచుఁ బసిఁడి పసిఁడి పీవన వీవన్.

వినవలసినవియుఁ గనవలసినవియుఁ గాని యూహనులు కవితాప్రపంచమునఁ గావింపఁ బడుటచేత వాని కింతటిమనోజ్ఞత గలిగినది. వీని

కవిత ఛాయాగ్రహణకళ

వలనఁ బాత్రలు మనకంటియెదుట మెలఁగుచున్నట్టులే మనకుఁ దోఁచుచుండును. ఇది యిట్లుండ హనుమంతుఁడు సముద్రమును దాఁటినప్పుడు మొల్ల తానా ప్రాంతముననే యుండి చూచినది కాఁబోలు! తత్సముద్రోల్లంఘన మెంతయు యథార్థస్వరూపమునఁ జిత్రించినది.

చ. మొగము బిగించి, పాదముల
మొత్తముగా నట నూఁది త్రొక్కినీ
టుగ మొగమెత్తి, భీకరక
ఠోరరవంబున నార్చి, బాహుల
ల్మగణితలీల నూచి వల
యంబుగ వాలము ద్రిప్పి, వ్రేగునన్
నగము నగమ్ముగ గ్రుంకఁ గపి
నాథుఁడు నింగికి దాఁటె రివ్వునన్.

ఇందలి ఛాయాగ్రహణకళాకౌశల్యము (Photographic art) ప్రశంసింపఁదగినది. కవిత్వము సకలకళావిజ్ఞానసర్వస్వము గదా? రంగులకు మాఱుగాఁ బదముల నుపయోగించుచుఁ జిత్రకారునివలె హనుమంతుని మొల్ల యత్యుల్లాసజనకముగఁ జిత్రించినది. కవిత్వమన్న నిట్టులే యుండవలెనని మెకాలే దొరగారి సంకల్పము.

"We mean the art of employing words in such a manner as to produce an illusion on the imagination, the art of doing by means of words what the painter does by means of colours"

ఆంగ్లకవుల భిన్నమతములు

సౌందర్యమును జిత్రించుటయే కవిత్వమని ఎడ్గార్-ఎలన్-పో. అను నొకయమెరికా కవి చెప్పుచున్నాఁడు. It is 'The rhythmic

Creation of beauty' అనఁగా లయతో మేళవించిన శ్రావ్యమగు సంగీతము వినునప్పుడు హృదయమునకుఁ గలుగునానందమువంటి యానందము ఔచిత్యము చెడనిశబ్దములతో సౌందర్యమును జిత్రించుకవిత్వమువలనఁ గలు

జాన్సను

గవలయునని వానియభిప్రాయము. కవిత్వము ఛందోబద్ధమైనరచన యనియు, భావనాశక్తిచే సహేతుక మొనర్చి సత్యమును నానంద దాయకముగాఁ జెప్పు కళావిశేషమనియు నూతనసృష్టియే తత్ప్రయోజన మనియు, జాన్సను కవి నిర్వచనము.

"Poetry," says Johnson "is metrical composition' It is 'the art of uniting pleasure with truth by calling imagination to the help of reason' and its 'essence' is 'invention."

కోల్రిడ్జి

కోల్రిడ్జి కవితామతము దీని కెంతయు భిన్నమైనది. సత్యము శాస్త్రోద్దేశమే కాని కవిత్వోద్దేశము కాదనియుఁ గేవలహృదయానందము మాత్రమే కవితాప్రయోజనమనియు నాతనితలంపు.

" In Coleridge's view, poetry is the anti-thesis of science, having for its immediate object pleasure not truth."

కాని సత్యరహితమైనయానంద మశాశ్వతము. మఱియుఁ గృత్రిమము. గారడివాఁ డిసుకయందు మామిడిటెంకలం జొనిపి, గంపలో మాటుపఱచి కొన్ని నిముసములకుఁ జిన్నమామిడిమొక్కలం దోఁపించును. ప్రేక్షకు లయ్యది సత్యరహితమైన కృత్రిమసృష్టి యని యెఱింగి వానిహస్తలాఘవమున కానందించెదరు. ఆయానందము తాత్కాలికము.

మనము ప్రత్యక్షముగ నాటి పెంచి ఫలోన్ముఖమునకుఁ దెచ్చిన రసాలములవలనఁ గలుగునానందము యథార్థమైనది. శాశ్వతమైనది. సత్యసమ్మేళనము లేనియానందము సుఖప్రదము కాదని యెఱింగియే 'లేహాంటు' తనకవిత్వనిర్వచనమునందుఁ గవితారచనకు సత్యము నొకవస్తువుగా (subject) నిర్ణయించెను.

'The utterance of a passion for truth, beauty and power, embodying and illustrating its conceptions by imagination and fancy, and modulating its language on the principle of variety in unity'

సత్యమునందును సౌందర్యమునందును బ్రతిభయందును గల యుత్సాహము కవిత్వమునకు వస్తువట! భావములను భావనాశక్తిచే వ్యక్తపరచుటకుఁ బ్రయత్నించుట కవితామార్గమట! భావసమన్వయమున కనుకూలమైనశైలి (style) సమన్వయము కవితాభాషయట!

కావ్యరచనయం దొకానొకరసము నుత్కర్షించుటకు భావములును, తద్భావములను బ్రకటించుటకుఁ బదగుంఫనమును సాధనము లగుచున్నవి. ఈరసభావశబ్దములు మూఁడును గాఢమైనపరస్పరానుకూల్యమును బొందినప్పుడే వాస్తవమైనకవితాస్వరూపమేర్పడఁ గలదు. అందుచే 'లేహాంటు' భావముతో సమానమైనగౌరవము శబ్దమునకు

సైతము నొసంగి, కవితారచన కుచితమైన భాషయును నిర్వచించెను. రసములును భావ

హెజిలెటు

నాశక్తియు నేశబ్దములయందుఁ బ్రకటింపఁబడునో యాశబ్దజాలమే కవిత్వమని చెప్పుచు సీమతమును 'హెజలెట్' మహాంతద్రూపపఱచెను.

'The language of imagination and passions'

మేథ్యూ ఆర్నాల్డు

మనుష్యులు మాటాడుకొనుభాషలోఁ బవిత్రతయు, హృదయరంజకత్వమును గుణములుగాఁ గల భాషయే కవిత్వమని మేథ్యూ ఆర్నాల్డు సంకల్పము.

It is simply the most delightful and perfect form of utterance that, human words can reach.'

* రమణీయార్థ ప్రతిపాదకశబ్ద మెట్లు కావ్యమగునో అట్లే రమణీయార్థ ప్రతిపాదక రూపము చిత్రమగును. రమణీయార్థ ప్రతిపాదకత్వము రెండింటికిని సామాన్యమే. అయినను రమణీయార్థముమాత్రము కావ్యమగును. తత్ప్రతిపాదకమైనశబ్దము కావ్యమున కక్కఱలేదని చెప్పుటకు వీలు లేదు. కావుననే దండి మొదలైనవారలు శబ్దార్థములు రెండును గావ్యమందురు. దానినే పండితరాయజగన్నాథులు రమణీయార్థ ప్రతిపాదకమైనశబ్దము కావ్య మన్నారు. కావ్యము వలయునన్న శబ్దముతప్పదు. అట్లే చిత్రము కావలయునన్న రమణీయార్థ ప్రతిపాదకరూపము తప్పదు. చిత్రమందు రూపసామ్య మక్కఱలేదు. రమ్యార్థమే కావలె ననియు జెప్పుట యసంభవమైనకోరిక గోరుట. నాదౌచిత్యమును విడిచి సంగీతానందము లేదు. రూపౌచిత్యమును విడిచి చిత్రవిద్య లేదు. శబ్దౌచిత్యమును విడిచి కావ్యము లేదు.

గీర్వాణలాక్షణికులు

కావ్యలక్షణములనుగూర్చి ప్రసంగించిన సంస్కృతాలంకారికులలో ననేకు లర్థముతోఁ బాటుశబ్దమునుగూడ నిట్లుగౌరవించుచున్నారు.

'అదోషౌ సగుణౌ సాలంకారౌ చ శబ్దార్థౌ కావ్యమ్'
హేమచంద్రుఁడు.

'అదోషౌ సగుణౌ సాలంకారౌ శబ్దార్థౌ కావ్యమితి కావ్య సామాన్యలక్షణమ్' ప్రతాపరుద్రీయము.

"సాధుశబ్దార్థసందర్భం గుణాలంకారభూషితమ్,
స్ఫుటరీతిరసోపేతం కావ్యం కుర్వీత కీర్తయే"
వాగ్భటుఁడు.

'కావ్యశబ్దోఽయం గుణాలంకార సంస్కృతయో శ్శబ్దార్థయో ర్వర్తతే'—వామనుఁడు.

'సగుణాలంకృతీ కావ్యం పదార్థౌ దోషవర్జితౌ'
సాహిత్యరత్నాకరము.

'రమణీయార్థ ప్రతిపాదకశబ్దః కావ్యం'
జగన్నాథపండితుఁడు.

అలంకారములు

అర్థముతోఁ బాటు శబ్దమును గ్రహించుటయే కాక యీలాక్షణికులు గావ్యలక్షణములయందు నలంకారమును విధిగాఁ జేర్చుచు వచ్చిరి. అలంకారములు రసోత్కర్షావిష్కరణమునకు సాధనములనియు, శరీరమునకు నంగదాద్యలంకారములవలెఁ గావ్యమునకు నుపమాద్యలంకారములును శోభాతిశయము నొసఁగూర్చునవి యనియు లాక్షణికులు

* కీ. శే. కొ. లక్ష్మణరావు పంతులు గారు, ఆం. ప. సా. అనుబంధము.

చెప్పుచున్నారు. కావ్యలక్షణములలో నలంకారము ముఖ్యలక్షణముగా లాక్షణికులు విధించుచుండ, ఒకానొక కావ్యమునందు శ్రీకారము మొదలు సంపూర్ణమువఱకును బ్రతిపద్యమునందుఁ గాని ప్రతిశ్లోకమునందుఁ గాని యలంకార ముండితీరవలె ననునిర్బంధము లేక, అనలంకృతమైన చోటఁ గావ్యత్వమునకు హానికలుగదని 'తదదోషౌ శబ్దార్థౌ సగుణా వనలంకృతీ పునః క్వాపి' అను వాక్యమువలనఁ గావ్యప్రకాశకారుసమ్మత మేమో యని స్ఫురించుచున్నది. అలంకారములను గూర్చి మతభేదము లనేకము లున్నవి. నేఁటికవితాతత్త్వజ్ఞులలోఁ గొందఱ యభిప్రాయము లీక్రిందఁ బొందుపఱచుటకంటె నీవిషయమును గూర్చి వేఱొకవిధమైనచర్చ యవసరము లేదు.

*"మొదటినుండి తుదవఱకు మధురాన్నభోజనము చేసినవాని కిరుచి యెట్లు కలుగునో య ట్లీయలంకారపూర్ణమగు కావ్యమును జదివిన నరుచి కలుగుననుట సాహసము కాదు. మఱియు నలంకారాంగీకరణ మప్రయత్నసాధ్యముగాదు. విశేషప్రయత్నసాధ్యములగునియమములతో రచింపఁబడిన కావ్యము హృద్యముగా నుండదు.

'రసాక్షిప్తతయా యస్య
బంధశ్శక్యక్రియో భవేత్,
అపృథగ్యత్ననిర్వర్త్య
స్సోలంకారో ధ్వనౌ మతః' ధ్వన్యాలోకము.

'కవితా వనితా చైవ
స్వయమేవాగతా వరా,
బలాదాకృష్యమాణా చేత్
సరసా విరసా భవేత్.'

ఉత్తమకావ్యము తోఁటలోనుండుపుష్పమువలె సహజపరిమళము గలది. కాని శిల్పి చేసినకృత్రిమకుసుమమువలె నిర్గంధము గాదు. నవీనకవు లలంకారములకై తక్కువప్రయత్నించి యున్నట్లయిన వారిప్రబంధములు హెచ్చుగ సంతోషము నిచ్చునని తలంచెదను అప్రయత్నసంచితాలంకారములు గల తిక్కనాదుల కవిత్వము లెంతబాగుగ నున్నవో నేను జెప్ప నవసరము లేదు."

♦ "నిజముగా నలంకారముల ధర్మము రసోపస్కరణమే యైనచో, వాని నెట్లెంతవఱకు ప్రయోగింపవచ్చునో కూడదో కవియే నియమింపవలయును గాని మనము నియమింపఁజాలము. మఱియుఁ గవికి రసమే యుపాస్యదేవత యగునేని యతఁ డలంకారశాస్త్రము నెంతమఱచిన నంత మేలు. అలంకారములు రసాధీనములుగాని రస మలంకారాధీనము గాదు. కావునఁ గవి కలంకారశాస్త్రపరిచయము యోగికి సంసారవాసనవంటిది.

† "కావ్యరచన ముందు సాగినది. కవి 'యిస్తారవ్యవచ్ఛిన్నమైన' పదావళిని గానము చేసెను. ప్రకృతివిలాసానుభవముచేఁ గవికి మహత్తరమైన రసానందభోగము గలిగినది. అందు లీనుఁడై ప్రసన్నహృదయమునందుఁ గందళించినభావములను బైకి జల్లెను. ఈభావప్రపంచము మానవలోకము నావహించిన

* శ్రీ కిడాంబి రామానుజాచార్యులు గారు. ఎం. ఏ.

♦ శ్రీ రాళ్లపల్లి-అనంతకృష్ణశర్మగారు. No I. Vol. II. P. 15-16.

† గ్రంథాలయసర్వస్వము. I. Vol. No. III. P. 258.

కొలఁది అభిరుచికిఁ బ్రచారము కలిగినది. ఆకర్షింపఁబడినకొలఁది జనులు పరవశులైరి. తరువాత స్థాయి కుదుర్చుకొనిరి. అనంతరము కావ్యప్రపంచము నార్ద్రదృష్టితోఁ బరిశోధింపసాగిరి. మొట్టమొదట తమ్మాకర్షించినది సౌందర్యమని కనిపెట్టిరి. రసోపలబ్ధి తత్ప్రసాదమని తనిసిరి. ఎచ్చటెచ్చటఁ దమ కానంద మెక్కుడయినదో అచ్చటచ్చట నెల్ల సొగసు లున్నవని గుర్తించిరి. ఈసొగసులే పిదప నలంకారము లైనవి. అంతేకాని ముందు అలంకారములు సిద్ధము చేసి, అవి ధరించుటకు యుక్తమయిన కావ్యకన్యను సృజింపలేదు. కావ్యము లనలంకృతములైనను ఉత్తమస్థానము నవరోహించుట కాటంకము లేదనుట కీనిదర్శన మొక్కటియే చాలును. కావ్యమునందలంకారము లవశ్యపరిపోష్యములనుట ఉదాత్తవిమర్శనాలక్షణము గాదు. ఏలయన? మమ్మటాదులు తనివితీఱ పొగడి యుదాహరించిన యుత్తమశ్లోకము లన్నియును అనలంకృతములుగానే యున్నవి. ఇంత యేల, ఉదాత్తమగు వ్యంగ్యవైభవము విలసిల్లిన స్థలములయందు నియమప్రయుక్తములగు అలంకారములు నిలుచుటకైన నవకాశము గానవచ్చుట లేదు.”

సర్వమత సమన్వయము.

అనేక భాషలయందు వందలకొలఁదిఁ గవులు వందలకొలఁది విధములఁ గవిత్వతత్త్వమును నిర్వచింపుచువచ్చిరి. ఆయా నిర్వచనము లన్నియు నాయాకవులయొక్క రుచివిశేషముల ననుసరించియే కావింపఁబడినవని చెప్పవచ్చును. ప్రకృతిని ప్రేమించుకవి ప్రకృతిసౌందర్యమే కవిత్వమనుచున్నాఁడు. రసము నుపాసించుకవి ‘వాక్యం రసాత్మకం కావ్య’మనుచు అందు వీరశృంగారరసములనుమాత్రమే మన్నించుకవి ‘వీరశృంగారయో రేకః ప్రధానం యత్ర వర్ణ్యతే’ అనుచున్నాఁడు. ఒక్క కరుణారసమునుమాత్రమే కరుణించుకవి ‘ఏకో రసః కరుణ ఏవ’ అనుచున్నాఁడు. ఈ మతభేదము లన్నియుఁ గవులకే కాని కవిత్వమునకు లేవు. ఏలయన నాయామతముల కనురూపములగు గుణవిశేషము లన్నియుఁ గవిత్వమునం దున్నవి. ఆగుణవిశేషములలోఁ గొన్ని కొన్ని కొందఱకుఁ గొందఱకు స్ఫురించినవి. రుచించినవి. సగుణమని కొందఱచేతను నిర్గుణమని కొందఱచేతను, శైవమని కొందఱచేతను, వైష్ణవమని కొందఱచేతను, పెక్కుమతముల సచ్చిదానందమయమగు పరబ్రహ్మమారాధింపఁబడుచున్నదికదా? నిశ్చలమహానందస్వరూపమగు కవిత్వము గూడ నట్టిదియే!!

వేసఁగి

శంకరదీక్షితులు

వేగలకుఁ బగ లెల్లను, వేగలేక,
దోమలకు, నల్లులకు, గాలి లేమి, మేను
తెల్లవారెడువఱకును దిండియయ్యె,
మండు వేసఁగి తాపంబు మాన్పు వరుణ!
సంధు లూటలఁ గీలి నిచ్చలును, జెమ్మ
గిల్లుచున్నవి, తనువులు గుల్లబారె,
మేను లిటులయ్యె జలమయమృణ్మయములు
మండు వేసఁగి తాపంబు మాన్పు వరుణ!
కానికైన మారనియసమాన మైన
స్థూలకాయంపు బాధ శత్రునకు నైన
వలదు, వలదని, జనులు మ్రొక్కు లిడుచుండ
మండు వేసఁగి తాపంబు మాన్పు వరుణ!
ఉడుకుచే, నున్న లేకున్న నొక్కటె, యని
ఇంట్ల నింటివాండ్రను జూడ కెల్లరకును,
రాత్రులందు సంసార వైరాగ్య మబ్బె,
మండు వేసఁగి తాపంబు మాన్పు వరుణ!
ఉడుకు బాపు నుపాయంబు లున్న నేమి,
తాళఁ జాలక నీపేరు దలఁచి, తలఁచి
తనుకు లాడుచు నున్నాఁడు, ధనికు లింట్ల
మండు వేసఁగి తాపంబు మాన్పు వరుణ!
పొట్టకూటికి కూలికై పోయి, యెండ
మలమలని మాడుచున్న పేదలను జూడు!
విధవలైన, నీకు వారిపై వెగటదేల?
మండు వేసఁగి తాపంబు మాన్పు వరుణ!
పేదలైనను, ధనికులు, పెద్దవారు,
బుడుత లబలలు, సబలలుఁ భోగి జోగు
లెట్టివారైన, నేమి, నీదృష్టి కొకటె!
మండు వేసఁగి తాపంబు మాన్పు వరుణ!
మొదలు నిక్కించి, పై నేగు మేఘములకు
జీవు లెల్ల, నీటికి నమస్కృతు లొనర్ప
దుష్టుఁడవె కాకపోయిన దోడుపడవె?
మండు వేసఁగి తాపంబు మాన్పు వరుణ?
వర్ష మీయని మబ్బులవైపు, తృష్ణఁ
జూచు ప్రజలను మోసగించుటయె కాదె?
శేషజలలేశమును, నీవు జేదుకొనుట;
మండు వేసవి తాపంబు మాన్పు వరుణ!
దుష్టుఁడవటంచు నిన్నంత దూరమందు,
ప్రకృతి యుంచిన నేమి, స్వభావదార్ష్ట్య
మింతఁగాఁ జూపు నిన్ను గర్హింప రెవరు?
మండు వేసగి తాపంబు మాన్పు వరుణ?
స్వేచ్ఛ విహరించు గాడుపే, సిగ్గు లేక,
దాసుఁడై నీకుఁ, దోడ్పడఁ దలఁచు నపుడు
ప్రజల కిం కేల సుఖము, జీవములు నిలుచు,
మండు వేసఁగి తాపంబు మాన్పు వరుణ!
విసుఁగు లేక త్రాగెడునీరు వెడలఁ గ్రక్కు
నట్టిమముఁ జూచి యైన నీపొట్టనిండఁ
బీల్చి యున్న నీటిని దిగవిడిచి వేగ,
మండు వేసఁగి తాపంబు మాన్పు వరుణ!
నో రెఱుంగని పశువు లూరూర నీరుఁ
దిండియును లేక, అల్లాడుచుండ, జీవ
వధక! నీవు చేరితివి సత్పక్షమునందు
మండు వేసఁగి తాపంబు మాన్పు వరుణ!

వైదిక వాఙ్మయము

కనుపర్తి మార్కండేయశర్మగారు

సర్వజ్ఞుఁడును సర్వశక్తిపరిపూర్ణుఁడును, అచింత్యాప్రమేయమహిమాన్వితుఁడును అగుపరమేశ్వరునియొక్క నిశ్శ్వాసభూతమగు వేదసముద్రముయొక్క పార మిట్టిదని చెప్పుటకు సర్వజ్ఞుఁడగు పరమేశ్వరుఁడుతక్క తక్కినవార లెవ్వరును సమర్థులు కాఁజాలరని ఆస్తికులగు మహర్షిపుంగవుల నిశ్చితాభిప్రాయము. భరతఖండమను సుప్రసిద్ధప్రాచీననామముగల యీహిందూదేశమునందు అనేక మతములు వెలయుచున్నవి. వానిని ఆస్తిక మతములు నాస్తికమతములు అని రెండుగా విభజించవచ్చును. అనఁగా వేదములను, ఆవేదములను తపఃప్రభావముచేత నెఱింగిన వారలు తదంతర్గతార్థరహస్యములను స్మరించుటచేత స్మృతులనఁబడిన ధర్మశాస్త్రములను, తదనుకూలాచరణము గల మహర్షుల సదాచారమును అనుసరించి చరించువారలు ఆస్తికులనియు, తద్విరుద్ధముగ నాచరించు వారలు నాస్తికులనియు మన్వాదిశాస్త్రజ్ఞుల సిద్ధాంతము. కావున ఆవేదములను గూర్చి యొకింత ఇచట వ్రాయఁబడుచున్నది.

౧. ఋగ్వేదము, ౨. యజుర్వేదము, 3. సామవేదము, ౪. అథర్వవేదము, అని వేదములు నాల్గువిధములు.

ఒక్కొక వేదమునందు, సంహితా, బ్రాహ్మణ, ఆరణ్యకభాగములను మూఁడుభాగములుండును. తఱుచుగా ఆరణ్యకభాగమునందే ఉపనిషత్తులు చేరఁదగియుండును. ఒక్కొక చోట సంహితయందును, బ్రాహ్మణమునందునుకూడ ఉపనిషత్తు లుండుటగలదు. ఈ సంహితా, బ్రాహ్మణ, ఆరణ్యక, ఉపనిషత్తులను చతుర్విధభాగసమన్విత మగు వేదచతుష్టయము పరమేశ్వరునియొక్క నిశ్శ్వాసరూపము. అనఁగా ఋషులచేతఁగాని తత్తుల్యబుద్ధిగల మహాకవిచేతగాని భారతాదిగ్రంథములవలె రచింపఁబడి యుండలేదు. కాని ఈ వేదరాశినంతయు జితేంద్రియులును, బ్రహ్మచర్యవ్రతపరాయణులును అగుమహర్షులు చిరకాలము తపస్సుచేసి ఆతపోబలమువలన వేదమంత్రములను కనిపెట్టి లోకమునందు వ్యాపింపఁజేసిరి. మహర్షులనేకులచేత కనిపెట్టఁబడి శిష్యప్రశిష్యక్రమమునఁ బఠనపాఠన ప్రచారమునందినమంత్రరాశిని కొందఱు మహర్షులు సూక్తములుగాఁ జేర్చిరి. కొందఱు మహర్షులు ఆ సూక్తములను కాండలుగను అధ్యాయములుగను, వర్గలుగను జేర్చిరి.

మంత్రములఁ గనిపెట్టినవారిని మంత్రద్రష్టలనియు, సూక్తములనుగాఁ జేర్చినవారిని

సూత్రద్రష్టలు, లేక సూత్రద్రష్టలనియు, కాండ
ములను సేకరించినవారిని కాండర్షులనియు, వ్యవహరించుచున్నారు.

ప్రపంచమంతయు, యజ్ఞస్వరూపమనియు, ప్రపంచాంతర్గతవిషయము లన్నియు యజ్ఞమునకుఁ జేరినవేయనియు, అట్టియజ్ఞమునుగూర్చి బోధించుటయే వేదములయొక్క ముఖ్యాభిప్రాయమనియు, వేదాంగకర్త లచ్చటచ్చట వివరించియున్నారు. రానురాను తపస్సామర్థ్యము క్షీణించుచుండుటచేత వేదార్థమును దెలిసికొనుసామర్థ్యమున్నైతము క్షీణించుచున్నదనియు, ఆవేదార్థమును దెలిసికొనుటకుగాను శిక్షా, వ్యాకరణ, ఛందో, నిరుక్త, జ్యోతిష, కల్పములనుషడంగములను మహర్షులు స్వయముగా నిర్మించిరి. ఈషడంగములు మహర్షులచేత బుద్ధిపూర్వకముగ నూహించి రచింపఁబడినను వీనికి బీజభూతములును సూత్రప్రాయములును అగువిషయము వేదవాఙ్మయమగు బ్రాహ్మణభాగమునందుఁగలదు. దానినే గ్రహించి భాష్యప్రాయముగఁ దమతమ వేదాంగగ్రంథముల మహర్షులు రచించిరి.

శాఖాభేదములు

వేదములు నాలుగు అని ఇదివఱకు చెప్పియున్నాఁడను.

ఋగ్వేదమునకు ౨౧, యజుర్వేదమునకు ౧౦౧, సామవేదమునకు ౧౦౦౦, అథర్వవేదమునకు ౯, శాఖలు గలవు. శాఖలనఁగా వేదముయొక్క భాగములుగావు. ఆయాయాచార్యుల అధ్యాపనసంప్రదాయముచేత రూఢము లయిన గ్రంథసముదాయముగాని భాగవతాది గ్రంథములకు గల ౧౨ స్కంధములవంటి విభాగముమాత్రము గాదు.

౧. ఋగ్వేదము

ఋక్కులనఁగా ఈమంత్రమునకు ఇన్ని పాదములు, పాదమునకు ఇన్నియక్షరములు అనునియమము గలమంత్రములు. ఇట్టిఋక్కులుగల సముదాయము ఋగ్వేదమని చెప్పఁబడును. ఈ ఋగ్వేదమునందు:—౧౦ మండలములు, ౧౦౨౮ సూక్తములు, ౧౦౫౮౦ ఋక్కులు, ౧౫౩౮౨౬ పదములు, ౪౩౨౦౦౦ అక్షరములు గలవు. మఱొకవిభాగముగూడ గలదుగాని ప్రకృతమున నిచట ఒకవిధమయిన విభాగమునుమాత్రమే వ్రాసినాఁడను.

బ్రాహ్మణములు:— ఈఋగ్వేదమునకు ఐతరేయబ్రాహ్మణము, శాంఖ్యాయన బ్రాహ్మణము అని రెండుబ్రాహ్మణములు గలవు. ఈ యైతరేయబ్రాహ్మణమునందు ౮ పంచికలు, ఒక్కొక పంచికకు ౫ అధ్యాయముల చొప్పున ౪౦ అధ్యాయములు గలవు. ఇతరాపుత్రుఁడగు మహిదాసాచార్యుఁడు ఈబ్రాహ్మణభాగమునకుఁ బ్రవక్త. ప్రవక్తయనఁగా శిష్యులకు అధ్యాపకుఁడు. శాంఖ్యాయనబ్రాహ్మణమునకే కౌషీతకీబ్రాహ్మణమనియు నామాంతరము. ఇందు ౩౦ అధ్యాయములు గలవు.

ఆరణ్యకగ్రంథములు:—ఐతరేయారణ్యకమనియు, శాంఖ్యాయనారణ్యకమనియు ఋగ్వేదీయారణ్యకగ్రంథములు రెండు గలవు. శాంఖ్యాయనమునకు నామాంతరము కౌషీతకి యని ఇదివఱకే చెప్పియున్నాఁడను. ఐతరేయకౌషీతక్యుపనిషత్తులు ఈయారణ్యకగ్రంథములకుఁ జేరినవియే.

ఋగ్వేదీయోపనిషత్తులు ౧౦:— ఐతరేయము, కౌషీతకి, నాదబిందువు, ఆత్మబోధ, నిర్వాణము, ముద్గలము, అక్షమాలి, త్రిపుర, సౌభాగ్యము, బహ్వృచము అనునవి.

౨ యజుర్వేదము

యజుర్వేదము, కృష్ణయజుర్వేదమనియు. శుక్లయజుర్వేదమనియు ద్వివిధముగానున్నది.

కృష్ణయజుర్వేదము

దీనికే తైత్తిరీయసంహితయని నామాంతరము ఈ తైత్తిరీయసంహిత ౭ కాండలు, లేక అష్టకములు, ౪౪ ప్రశ్నలు లేక ప్రపాఠకములు, ౬౫౧ అనువాకములు, ౨౧౯౮ పఞ్చాశత్తులు, (పనసలు) ౧౯౨౯౦ పదములు, ౨౫౩౮౬౮ అక్షరములు గలిగియున్నది.

తైత్తిరీయబ్రాహ్మణము కాండత్రయాత్మకమయి ౧౨ ప్రపాఠకములుగా విభజింపఁబడియున్నది. ౧౦, ౧౧, ౧౨ ప్రపాఠకములు కఠశాఖకుఁ జేరినవి.

కృష్ణయజుర్వేదమునందు, సంహితయందు బ్రాహ్మణభాగము, బ్రాహ్మణభాగమునందు, మంత్రములును, ఇట్లే ఆరణ్యకభాగమునందు మంత్రములు బ్రాహ్మణభాగము కలసియున్నవి.

ఈ తైత్తిరీయబ్రాహ్మణమునకే పరాయతమనియు నామాంతరము. పరాయాతమనునది సాధురూపము.

ఆరణ్యకగ్రంథము:— ఇది ప్రశ్నలను పేర ౧౦ విభాగములు కలిగియున్నది. ౭,౮,౯, ౧౦ ప్రశ్నములకుఁ దైత్తిరీయోపనిషత్తని పేరు. ౧౦ వ ప్రశ్నమునుమాత్రము నారాయణీయోపనిషత్తనియుఁ జెప్పెదరు. ఈనారాయణీయోపనిషత్తు ఆంధ్రపాఠమనియు ద్రావిడపాఠమనియు ద్వివిధముగఁ గలదు. ఆంధ్రపాఠము ౮౦ అనువాకములుగను, ద్రావిడపాఠము ౬౪ అనువాకములుగను, గలదు. అనఁగా ద్రావిడపాఠమునందుకంటె ఎక్కువ మంత్రములు ఆంధ్రపాఠమునఁ గలవు. ఒక్క శ్రీవైష్ణవులుతప్పస్మార్తులగు ఆంధ్ర ద్రావిడమహారాష్ట్ర కర్ణాటాదిస్మార్తబ్రాహ్మణులందఱు ఆంధ్రపాఠమునే పఠింపుచున్నారు. ద్రావిడదేశమగు తిరునెల్వేలి రామేశ్వరము మున్నగుతావులఁగల ద్రావిడులగు వేదపాఠకులను వేదపారాయణార్థము పిలువఁగా వారు ఆంధ్రపాఠానుసారము స్వస్తివాచనము చెప్పఁబ్రారంభించిరి. మీరు ఆంధ్రులుకాగే, ద్రావిడులుగదా; ద్రావిడపాఠప్రకార మేల చెప్పుటలేదు; ఆంధపాఠప్రకారము చెప్పెదరేల? యని ప్రశ్నింపగా "పూర్వకాలమున మాదేశమునందు ఘనపాఠులగువారలు లేరు. వేదాధ్యయనార్థము ఆంధ్రులగు ఘనపాఠులఁ బిలిపించి వేదాధ్యయన మొనర్చితిమి. తత్సంప్రదాయానుసారము మేము ఆంధ్రపాఠమునే అధ్యయన మొనర్చితిమి. మాశిష్యులకున్నూ అట్లే చెప్పుచున్నారము. ఇది నిన్న మొన్న వచ్చిన సంప్రదాయముకాదు. ఎన్నియో శతాబ్దములయిన"దని చెప్పిరి. సాధారణముగ ద్రావిడులు ఇతరులయుత్కర్షను దాము స్వయముగ నంగీకరింపరు. సమీపమునందున్న ఆంధ్రుల శ్రేష్ఠత్వమును అసలే నోటితోఁ

జెప్పిరి. ఇట్టి ద్రావిడబ్రాహ్మణసోదరులు తాము వేదవిద్యను ఆంధ్రబ్రాహ్మణులనుండి గ్రహించితిమనియు, తాము ద్రావిడబ్రాహ్మణు లయినను ఆంధ్రబ్రాహ్మణులనుండి అధ్యాపన మొనర్చితిమనియు, కావున ఆంధ్రపాఠమే తమసంప్రదాయమనియుఁ జెప్పఁదగినంత వేద విద్యాగౌరవమును ఏయాంధ్రబ్రాహ్మణశిఖామణులు పొందిరో అట్టి ఆంధ్రబ్రాహ్మణులలో నేఁటికాలమునందు సంప్రాప్తమగుచున్న వేద విద్యాక్షీణతకు వగచుచున్నాఁడను.

కృష్ణయజుర్వేదీయోపనిషత్తులు ౩౨:— కఠవల్లీ, తైత్తిరీయక, బ్రహ్మ, కైవల్య, శ్వేతాశ్వతర, గర్భ, నారాయణ, అమృతబిందు, అమృతనాద, కాలాగ్నిరుద్ర, క్షురికా, సర్వసార, శుకరహస్య, తేజోబిందు, ధ్యానబిందు, బ్రహ్మవిద్యా, యోగతత్త్వ, దక్షిణామూర్తి, స్కంద, శారీరక, యోగశిఖా, ఏకాక్షర, అక్షి, అవధూత, కఠరుద్ర, హృదయ, యోగకుండలిని, పంచబ్రహ్మ, ప్రాణాగ్నిహోత్ర, వరాహ, కలిసంతరణ, సరస్వతీ రహస్యములను ౩౨ ఉపనిషత్తులు.

కృష్ణయజుర్వేదమునకుసంబంధించిన ఇతర సంహితలు:— ౧. కాఠకసంహిత, ౨. మైత్రాయణీసంహిత, ౩. కపిష్ఠలకఠసంహిత; ఇవి కృష్ణయజుర్వేదమునకు చేరినవియే. కాఠకశాఖీయులు మధ్యదేశమునందును, మైత్రాయణీశాఖీయులు బరోడాదేశమునందును, కపిష్ఠలకఠశాఖీయులు కాశ్మీర, పంజాబుదేశములందును గలరు.

శుక్లయజుర్వేదము

ఈ వేదమునకు వాజసనేయసంహితయనియు నామాంతరము గలదు. వాజసనియను మహర్షి యాజ్ఞవల్క్యమహర్షి యొక్కతండ్రి. వాజసని యొక్కపుత్త్రుఁడు వాజసనేయుఁడు. అతనిచేత ప్రచారమునకుఁ దేఁబడిన సంహిత గావున వాజసనేయసంహిత యనిపేరు.

శుక్లయజుర్వేదశాఖలు ౧౭ లో కాణ్వశాఖ, మాధ్యందిన శాఖయను రెండుశాఖలుమాత్రమిప్పుడు ప్రచారములో నున్నవి. ఆంధ్రదేశమునందు గల ప్రథమశాఖీయబ్రాహ్మణులందఱు ప్రాయికముగఁ గాణ్వశాఖీయులు. మహారాష్ట్ర, వంగ, గౌడ, ఘూర్జరాదిదేశములందుగల శుక్లయజుర్వేదబ్రాహ్మణులు మాధ్యందినీయశాఖీయులు. మైత్రాయణీయశాఖ కృష్ణయజుర్వేదమునకుఁ జేరినది గాదనియు శుక్లయజుర్వేదమునకుఁ జేరినదనియుఁ గొందఱి తలంపు.

బ్రాహ్మణములు;— ఈ శుక్లయజుర్వేదమునకు శతపథబ్రాహ్మణమనుపేర విపులమయిన బ్రాహ్మణగ్రంథము గలదు. కాణ్వమాధ్యందినశాఖలకు రెంటికిని ఎక్కువగా భేదమెటుల లేదో అట్లే ఈకాణ్వమాధ్యందిన శాఖలకు సంబంధించిన శతపథబ్రాహ్మణమునకున్నూ ఎక్కువగా భేదములేదు కాని కాణ్వశాఖీయులు ౧౭, కాండలుగను, ౧౦౪ అధ్యాయములుగను, ౪౪౬ బ్రాహ్మణములుగను, ౯౨౬౬. కండికలుగను;

మాధ్యందిన శాఖీయులు, ౧౪ కాండలుగను, ౧౦౦ అధ్యాయములుగను, (లేక

౬౮ ప్రపాఠకములుగను), ౪౩౮ బ్రాహ్మణములుగను ౭౬౨౪ కండికలుగను, విభజించిరి.

సుప్రసిద్ధమగు బృహదారణ్యకోపనిషత్తు శతపథబ్రాహ్మణాంతర్గతమే.

శుక్లయజుర్వేదీయోపనిషత్తులు ౧౯;— ఈశావాస్య, బృహదారణ్యక, జాబాల, హంస, పరమహంస, సుబాల, మంత్రికా, నిరాలంబ, త్రిశిఖబ్రాహ్మణ, మండలబ్రాహ్మణ, అద్వయతారక, పైంగల, భిక్షు, తురీయాతీత, అధ్యాత్మ, తారసార, యాజ్ఞవల్క్య, శాట్యాయని, ముక్తికము లనునవి.

సామవేదము

సామవేదమునకు ౧౦౦౦ శాఖలుగలవని చరణవ్యూహాది గ్రంథములందుఁ గలదు గాని ఇపుడు మాత్రము ౧. రాణాయనిశాఖ, ౨. కౌథుమశాఖ, 3. జైమినీయశాఖ, యని మూఁడుశాఖలు మాత్రము నిలిచియున్నవి.

మన దేశమందును మహారాష్ట్ర దేశమందును గలసామవేదీయులు రాణాయనిశాఖకుఁ జెందినవారలు.

గుజరాతు దేశమునందుఁ గౌథుమశాఖీయులున్నారు.

కేరళ కర్ణాట దేశములందు జైమినిశాఖీయు లున్నారు.

ఆర్చికమనియు, ఉత్తరార్చికమనియు నీ సంహిత రెండుభాగములుగా విభజింపఁబడియున్నది. ప్రథమభాగమునందు ౬ ప్రపాఠకములు గలవు. ఒక్కొక్క ప్రపాఠకమున ౧౦ దశకములుగలవు. ద్వితీయభాగమునందు ౯ ప్రపాఠకములు గలవు.

ఇదిగాక, ౧. గ్రామగేయగానము ౧౭ ప్రపాఠకములు, ౨. అరణ్యగానము ౬ ప్రపాఠకములు, 3. ఊహగానము ౨౩ ప్రపాఠకములు, ౪. ఊహ్యగానము ౬ ప్రపాఠకములు అని సామవేదమునకుఁ జేరినవిగాన భాగములు నాలుగు గలవు.

సామవేదమునందుఁ బ్రథమభాగమున ౫౮౫ మంత్రములును, ద్వితీయభాగమున ౧౨౨౫ మంత్రములును గలవు.

సామవేదీయ బ్రాహ్మణములు:—తాండ్యబ్రాహ్మణము షడ్వింశబ్రాహ్మణము వంశబ్రాహ్మణము, అద్భుతబ్రాహ్మణము అని నాల్గువిధములు.

ఆరణ్యకము:—సామవేదము యొక్క ఆరణ్యకభాగము ఇతరవేదములయొక్క ఆరణ్యకభాగమువలెఁగాక "ఆరణ్యకసంహిత" యను పేరఁ బఱగుచున్నది.

సామవేదీయోపనిషత్తులు ౧౬:— కేన, ఛాందోగ్య, ఆరుణి, మైత్రాయణి, మైత్రేయి, వజ్రసూచికా, యోగచూడామణి, వాసుదేవ, మహత్, సన్న్యాస, అవ్యక్త, కుండికా, సావిత్రి, రుద్రాక్ష, జాబాల, దర్శన, జాబాలి యను లనునవి.

అథర్వవేదము

ఈవేదమునకు ౯ శాఖలుగలవని చరణవ్యూహాది గ్రంథములందుఁ గలదు గాని ఒకశాఖ మాత్రమే యిప్పుడు లభించుచున్నది. ఇప్పుడు లభించెడి యీ అథర్వవేదశాఖ ౨౦ కాండలు గలిగియున్నది.

బ్రాహ్మణము:—గోపథ బ్రాహ్మణము అథర్వవేదమునకుఁ జేరినది. పూర్వఖండము

నందు ౫ ప్రపాఠకములును, ఉత్తరఖండము నందు ౬ ప్రపాఠకములును గలవు.

ఆరణ్యకము:—అథర్వవేదమునకు ఆరణ్యకమను పేరుతోఁ బ్రత్యేకగ్రంథము లేదు.

అథర్వవేదీయోపనిషత్తులు ౩౧ :—ప్రశ్న, ముండక, మాండూక్య, అథర్వశిరః, అథర్వశిఖా, బృహజ్జాబాల, నృసింహతాపినీ, నారదపరివ్రాజక, సీతా, శరభ, మహానారాయణ, రామరహస్య, రామతాపినీ, శాండిల్య, పరమహంసపరివ్రాజక, అన్నపూర్ణా, సూర్య, ఆత్మ, పాశుపత, పరబ్రహ్మ, త్రిపురాతపన, దేవీ, భావనా, భస్మజాబాల, గణపతి, మహావాక్య, గోపాలతపన, కృష్ణ, హయగ్రీవ, దత్తాత్రేయ, గారుడము లనునవి.

పదక్రమపాఠాదికము

ఋగ్యజుస్సామాథర్వవేదములయర్థనిర్ణయార్థము శిక్షాదిషడంగము లేర్పడినవని యిదివఱకుఁ జెప్పియుంటిని. స్వరాక్షరపదవ్యత్యాస మిసుమంతయైనను, దానివలన వేదార్థము విపరీతమయి యజమానునకుఁ గీడుకలుగునని ప్రత్యక్షముగ వేదమునందే చెప్పియుండుటచేత అట్టివైపరీత్యము కలుగకుండుటకయి పద, క్రమ, జటా, ఘనసంహితలు కూడ ప్రతివేదమునకు మహర్షు లేర్పఱిచిరి.

తత్కర్తలు:—ఋగ్వేదమునకు: పదపాఠమును శాకల్యుఁడును, క్రమపాఠమును బాభ్రవ్యుఁడును;

యజుర్వేదమునకు:— పదపాఠమును ఆత్రేయుఁడును, క్రమపాఠమును హయగ్రీవుఁడును;

సామవేదమునకు:—పదపాఠమును గార్గ్యుఁడును, క్రమపాఠమును గాలవ్యుఁడును;

అథర్వవేదమునకు :—పదపాఠమును క్రమపాఠమును బ్రహ్మదత్తుఁడును రచించిరి.

జ్ఞాపిక:—విషయ మపారమగుటచేతను, ఎంత సంగ్రహించి వ్రాసినను గ్రంథము ఇప్పటికే విస్తారమగుటచేతను ఆవశ్యకములగు విషయము లెన్నియో వదలవలసివచ్చినది.

నండూరి వెంకటసుబ్బారావు బి. యే., గారి

'యెఱ్ఱి నా యెం కి'

పాకుర్తలూరి లక్ష్మీనారాయణ గారు

భారతి ౧-వ సంపుటము. ౪-వ సంచిక.

"యెంక జల్మములోన-యెవరమో" నంటె
సిగ్గొచ్చి నవ్వింది-సిలక-నాయెంకి.
"ముందు మన కీజల్మ-ముందోలె" యంటె
తెల్ల తెల బోయింది-పిల్ల-నాయెంకి.
"యెన్నాళ్లు మనకీలె యీసుకము" లంటె;
కంట నీరెట్టింది జంట-నాయెంకి."

భాషాభిమానులారా! కవితల్లజులారా!

లోకము స్వాతంత్ర్యవాయుపూరితమై యొప్పారుచున్నది. స్వీయభావంబులే పరమప్రామాణ్యము లగుచున్నవి. ఈపరిణామ మాంధ్రకవితామతల్లికిని సంభవించినది. ఆయమ యెత్తువారిచేతిబిడ్డ యయ్యె. ఇక్కాలంబున కవనమల్లలేని వారరుదు. ఏదియో కొంచెము భావమున్నఁ జాలును. ఛందోనియమంబులఁగాని పదస్వాస్థ్యమునుగాని భాషాసాహిత్యమును గాని పూర్వకవిప్రయోగంబులం గాని సరకుసేయ నక్కరలేదు. అలంకారములఁ దలఁపఁబనిలేదు. నిజముగ నక్కరలేదా?. కావలెనని శాసించువారు లేరు. ఏపలుకులు పలికిన 'వేమన చెప్పినదే వేద' మన్న తెలంగున నెవ్వరేకీతి చెప్పినఁ జాలమంది తాటస్థ్యమును వహించుచున్నారు. కొందఱు సుప్రసిద్ధవిమర్శకులదృష్టి కూడ నీ విషయముపై మరలకుండుట కేమి కతము?

ఇట్టి కవికల్పనలు ప్రస్తుతాంధ్ర సారస్వతమునందు పెక్కులఁ గాన్పించుచున్నవి. చిత్రచిత్రరీతులఁ గవితావధూటి నాట్యము సేయుచున్నది. ఛందస్సు సున్న. ఉన్నచో స్వాంతము.

"యెఱ్ఱినాయెంకి" యందలి భావము నెవ్వరికిని వివరింపఁబనిలేదు. కొదువవిషయంబులం దీయది కవన మనిపించుకొనఁజాలదు. ఈఖండకావ్యకర్తగారే యిట్టివానిచే నిదివరకే భారతి నలంకరించిరి. కవిగారు యెఱ్ఱినాయెంకిని, యెంకి భారతిని, విడువఁజాలకున్నారు కాఁబోలు! ఇట్టి కవితలు వాఙ్మయమున కనర్థకములు గావా! తారాశశాంకవిజయాది యాంధ్రశృంగారప్రబంధములు మచ్చునకైన లేకుండ మంటఁబెట్టవలె నన్న విమర్శకులీ వెఱ్ఱిశృంగారరసప్రధానఖండకావ్యంబులం దలఁపరేలొకో? ఈరసప్రదర్శనమునకుఁ జిత్రపటముల సహాయముకూడ కావలెనా? ముందువెనుకల నక్షరసంకేతములు గల విద్వాంసులును సాహితీవిశారదులు నిట్టి కవనంబులు భాషాయోషామణికలంకారంబులని రచియించుచున్నారా? అబ్బబ్బా! కొన్నికవనంబులు వమనంబులఁ దెచ్చుచున్నవిగదా?

కాలక్రమంబునఁ బత్రికాసంఖ్య అభివృద్ధి నొందుచున్నందులకును వాఙ్మయము దశదిశల వ్యాపించుచున్నందులకును సంతసించువారిలో నే నొకఁడను. ఆయభివృద్ధి యొక్కొక్కయెడఁ గ్రమవిరుద్ధముగ నున్నదని సందియమునఁ గుందుచున్నాఁడ; ఏదైన నభివృద్ధియే యని నేనెంచఁజాల. ఈనావ్రాఁతలకు పెద్దలు కినియక సక్రమపద్ధతి నవలంబించి చిన్నలకు మార్గదర్శకులై యాంధ్రకవితామతల్లికి వన్నెవెట్టఁ బ్రార్థించుచున్నాను.

ప్రాచీనార్యస్త్రీలు: భారతీయ నాగరికతయందు వారిస్థానము

దిగవల్లి వేంకటశివరావు గారు, బి. ఏ., బి. ఎల్.

వేలకొలది వత్సరములకుఁ బూర్వము, మన నాగరికత మహోన్నతదశయందుండిన కాలమున, ఆర్యావర్తమునఁ బురాణయుగమున స్త్రీలు చాల గౌరవమందుచుండిరి. ఆ కాలపు విధ్యుక్తధర్మములందును, ఆచార వ్యవహారములందును స్త్రీలు పాల్గొనుచుండిరి. యజ్ఞాదికములలో, క్రతువులలో వీరు నుచిత రీతిని పాల్గొనుచుండిరి. విద్యలందుఁ గళలందు వీరికిఁ బ్రావీణ్య ముండెను. ఆస్తియందు వీరికి దాయభాగపుహక్కు లుండినవి. మనము మహమ్మదీయాచారమునఁ జూచుగవిసెన లేకున్నను పాశ్చాత్యరీతిని స్త్రీపురుషభేదము గమనింపని యాచారమును లేదు. యుక్తసమయములందు స్త్రీలు పరులకుఁ గనఁబడుట తప్పుగఁ దలంపఁబడ లేదు. వేదములును బ్రాహ్మణములును ఆర్యుల యాచారవ్యవహారములను బాగుగఁ బ్రదర్శించుచున్నవి.

బృహదారణ్యకోపనిషత్తున, యాజ్ఞవల్క్యుఁడు వనముల కరుగునప్పుడు భార్యతోడి సంభాషణము కలదు.

యాజ్ఞ: మైత్రేయీ! నే నీగృహము విడిచి పోవుచున్నాను. దాయభాగమున నీకును గాత్యాయనికి నేదో విధమగు పరిష్కారము చేసిన మంచిదికదా!

మై: నాథా! ఈప్రపంచమున సమస్తసంపదలు నాకు లభించినను ముక్తి కలుగునా?

యా: కలుగదు. లోకమునందలి ధనవంతుల జీవితమువలెనే నీజీవితము నగును. ధనమువలన ముక్తి చేకూరదు.

మై: ముక్తిలేనిధనము నాకేల? ముక్తిసాధనమును బోధింపుఁడని నాప్రార్థన.

యా: ప్రియురాలా! నీవు చాల మంచి మాటాడితివి. రమ్ము కూర్చుండుము. నీకు బోధించెదను

అని యామె కుపనిషద్ధర్మములను గూర్చి పరమాత్మనుగూర్చి యుపదేశించెను. ఆమెయు విద్వాంసురాలగుటవలన వానిని బాగుగ గ్రహించి లోకమునందలి సంపదలన్నిటికన్నను విలువగఁ జూచికొనినది. ఈ గ్రంథమునందే, విదేహరాజగు జనకుని కొలువుకూటమున జరిగినసంగతి యొకటి వర్ణింపఁబడినది. ఆ ప్రభుఁ డశ్వమేధమునకు వచ్చిన బ్రాహ్మణులనెల్ల సత్కరించి కురుపాంచాలద్విజులం దెవ్వరు ఘనులో యని తెలియఁగోరి, సభయందు వేయిగోవులను, పదివేల బంగరునాణెముల నుంచి, "ఓసద్బ్రాహ్మణులారా! మీలో విద్యాధికుఁడైన యాతఁడు వీనిని గ్రహింపవలె నని పలుకఁగా, నచ్చటివారిలో ముందు

నకు వచ్చి తీసికొన నెవ్వరును సాహసింపలేక యుండ యాజ్ఞవల్క్యుఁడు తనశిష్యుని జూచి వానిని బుచ్చుకొమ్మనెను. అంతట నచ్చటి వారెల్లరు నాతనితో వాదమునకు వచ్చిరి. శాస్త్రపరీక్ష జరిగెను అశ్వహోత్రి, జరత్కారార్థభాగుఁడు, భుజ్యులాహ్యాయనుఁడు, ఉషస్థచాక్రాయనుఁడు. కహోలాల కౌషితకేయుఁడు, ఆరుణి, ఉద్దాలకుఁడు మున్నగుమహావిద్వాంసుల ప్రశ్నములకు యాజ్ఞవల్క్యుఁడు ప్రత్యుత్తరము లిచ్చెను. వారు నిరుత్తరులైరి. అంత, నానభయందు విద్యలందును ఆచారవ్యవహారజ్ఞానమునను ఎవరికిని దీసిపోవని స్త్రీరత్నము గార్గి వాచాహ్నవి లేచి నిలువఁబడినది. యాజ్ఞవల్క్యునివంకకు దిరిగినది.

"యాజ్ఞవల్క్య మహాశయా! తెమ్ము విదేహకాశీరాజపుత్ర మహావీరులవలె యుద్ధసన్నద్ధుఁడవు కమ్ము. ధనుస్సు లంఘించి రెండస్త్రములను సిద్ధపఱుపుము. నే నడుగఁబోవు రెండు ప్రశ్నములకును బత్యుత్తర మిమ్ము"* అనినది!! యాజ్ఞవల్క్యుఁడు ఆమెతో వాదించినాడు !!!

ఈ రెండుదాహరణములును మనప్రాచీనార్యస్త్రీల యౌన్నత్యమును దెలుపుచున్నవి. ఆకాలమున శ్రుతిస్మృతి సదాచారములందు స్త్రీలు పురుషులతోపాటు సహభాగినులై యుండిరి. ఆకాలపుస్త్రీలకు బాల్యవివాహములు లేవు. యుక్తవయస్సు వచ్చిన తరువాతనే పెండ్లి జరుగుచుండెను. వివాహమంత్రములెల్ల దీనిని ఋజువుచేయుచున్నవి. పాణిగ్రహణకాలమున సంస్కృతమున వధూవరులకుఁ జెప్పఁబడుచున్న బుద్ధులు, భార్యాభర్తలు చేయువాగ్దానములు నేఁటి బొమ్మపెండిలులకు వర్తింపవు. పూర్వము స్త్రీలకుఁ బునర్వివాహము చేయునాచారము నుండినది. మాఱుమనువునకుఁ బోవుస్త్రీ పాటింపవలసిననియమములును గ్రంథములందు కనఁబడుచున్నవి. ఒకవర్ణపు విగతభర్తృక, ఇతరొకవర్ణపుఁబురుషుని వివాహమాడినట్లును తెలియుచున్నది. ఒకస్త్రీకి బదుండ్రు పూర్వపు భర్త లుండినను, ఆమె యొకబ్రాహ్మణుని పెండ్లియాడనేని, ఇతఁడే, ఆమెకు సరియగు భర్త యగునని అధర్వవేదమున నున్నట్లును తెలియుచున్నది. అందువలన నాకాలమున నిప్పటివలె ఆచారవ్యవహారములు వర్ణాశ్రమధర్మములు నుక్కుపంజరమునందువలె బిగియింపఁబడి యుండలేదని స్పష్టపడుచున్నది. ఇప్పటివలెనే ఆకాలమునను, ఒక పురుషుఁడు పెక్కురుస్త్రీలను పెండ్లాడవచ్చును కాని ఒక స్త్రీకి పెక్కురుభర్త లుండరాదని శతపథబ్రాహ్మణమునఁ గలదు.

II

భరతఖండమున నాకాలమునఁ బాతివ్రత్య మొకగొప్పసుగుణము. అది లేనిస్త్రీలరుదు. వ్యభిచారము మహాదోషముగఁ బాపముగఁ బరిగణింపఁబడుచుండెను. యజ్ఞములందు, పుణ్యసమయములందు స్త్రీలుచేసినపాపములు బయల్పరుపఁబడుచుండినటులఁ దెలియుచున్నది. శతపథబ్రాహ్మణము యజ్ఞము చేయునాయనభార్య చేసినపాప మొప్పుకొనుటావశ్యకమని నుడువుచున్నది.

* Early Hindu Civilization by R. C. Dutt.

భరతఖండమున పురాణయుగము ఆర్య నాగరకత వర్ధిల్లిన కాలము. రామాయణపు స్త్రీలు, ఆర్యనాగరకత మహోన్నతస్థితియం దుండినకాలపుభారతీయస్త్రీలనిచెప్పవచ్చును. "రామాయణము ఆదర్శప్రాయమగు సంఘమును జిత్రించుచున్నదని చెప్పినవారు సత్యమునే పలికిరి. అయిన నిందువలన నిది కేవలము కవికల్పన మని యెంచుట పొరబాటు. నిజమగు సంఘము నాదర్శప్రాయమగుట తటస్థించునను సంగతి మఱవరాదు." అని అరవిందఘోషుగారు వ్రాసినారు. ఇది రామాయణపుస్త్రీలను గూర్చియు నిజమే. మంచివారైనను, చెడ్డవారైనను, రామాయణపుస్త్రీలు మానవాదర్శలను సహజముగఁ బ్రదర్శించుచున్నారు.

రామాయణమున అంతఃపురకాంతలలో శ్రీరాముని తల్లులు, సీతాదేవియు ముఖ్యులు. పురస్త్రీలు, మునిపత్నులు, నింక నితరస్త్రీలును గలరు. వీరుగాక, మానవస్త్రీలుకాని వారుగ వర్ణింపఁబడిన వనవాసినులగు వానర కాంతలును, లంకాద్వీపవాసిను లగు రాక్షస స్త్రీలును, కనఁబడుచున్నారు.

అయోధ్యానగరము సుందరమగుపురము. అచ్చట

"జననియు జనకుడు బంధువులఁ
దనయులు దనయలును గృహిణి దానును నతిభక్తి
దనివిగ నిండక యుండెడి
మనికి యొకండైన లేదు మందునకైనన్."*

అయోధ్యానగరవాసు లెల్లరు సత్స్వభావులే. అందఱును ధర్మశీలనిరతులే.

"సాగయించు చక్కఁదనముం
జిగిబిగులును లేని వారు క్షితిపతిభక్తిన్
దగులనివారలు లేరట
మగలందును మగువలందు మాటకునైనన్"!

అచ్చట నాల్గుకులములవారును దమ తమ వృత్తులందుఁ బరమవ్రతులై మెలఁగుచుండిరి.

దశరథమహారాజుభార్యలు జలజాక్షుని సతులఁబోలు చంద్రనిభాస్యలు, రాచనగరున సుఖముగ విభవము లందుచుండిరి. రాజు అశ్వమేధము చేసినప్పుడు వీరును దీక్షాయుతలై యుండిరి. ఆక్రతువునందుఁ గౌసల్యాదేవికి బ్రధానస్థాన ముండినది.

శ్రీరామునిగృహమునఁ బరిచారికలెల్ల పరమనారులే. వీ రెల్ల రుత్తమకులసంజాతలుగ, వర్ణింపఁబడినారు. నలుగిడునట్టివారు, అలంకరించునట్టివారు, వింజామరలు వేయువారు,ఇతరములగుపనులుచేయువారును బరమనారులుగనే పేర్కొనఁబడినారు. మంథర యొక కుబ్జమాత్రము సాధారణస్త్రీ. కైకేయిపుట్టినింటనుండి చేరినస్త్రీ. రామునిపట్టాభిషేకము వలనఁ గైకేయికిఁ గలుగఁబోవు హీనదశకన్నఁ దనకుఁ గలుగఁబోవుస్థితికే మంథర పరితపించుచున్నట్టు లామె పల్కులవలననే తెలియుచున్నది.

ఆకాలమునాఁటిస్త్రీ లెల్లరును నాగరకులుగ విద్యావతులుగ, కనఁబడుచున్నారు. ఇహపరసుఖములకుఁ గావలసినజ్ఞానము వారికుండెను. అయోధ్యలో నేమి, అడవులలో నేమి అప్పటిజీవనము కాపురములు బాగు

* ఇందలి పద్యములు ఆంధ్రవాల్మీకిరామాయణములోనివి.

గనే యుండెను. అతిథిసత్కారము, మర్యాద, పనిపాటులు, స్త్రీలు బాగుగఁ జేసెడువారు. వారికి మంచిజ్ఞానము, వైరాగ్యము నుండెను. వేదాంతము, శాస్త్రములును దెలియును. సీతాదేవికి సంస్కృతమున బాగుగఁ బాండిత్య ముండినట్లు లామెసంభాషణమువలన నెఱుఁగ వచ్చును. ఆమె కనేకశాస్త్రములు వచ్చును. ఆయుధముల యుపయోగము, అస్త్రముల ప్రయోగము, ఉపసంహారమును వచ్చును. కైకేయి తనమగనితో రణరంగమునుండి సారథ్య మొనరించినట్లును స్పష్టపడుచున్నది. వాలిభార్య తారకు నౌత్పాతికశాస్త్రము తెలియును.

ఆకాలపుస్త్రీలకుఁ గళలందుఁ బ్రావీణ్యముం డెను సంగీతసాహిత్యములందు నిపుణత యుం డెను. కుశనాభునిపుత్రికలఁ జూడుఁడు. భూష లకెంపుల తళతళలతోఁ జేతుల వీణె లూని పాడుచు విహరించుచున్నా రీనాగరికయువ తులు!

"చేతుల వీణె లూని తమిచేఁతలఁ జేతము లుల్లసిల్ల వ
న్నాతటిదుత్కరంబు లనఁ జారుశరీరములొప్పుచుండఁగే
శీతలతత్పరత్వమున లీలల బాళిని బాడుచు న్వనీ
జ్యాతలమందు నెల్గిరి ఘనాంతరతారలవంచమొందఁగన్"

ఆకాలపు స్త్రీలలోఁ గొంచెము 'ఘోషా' పద్ధతి యుండెను. అంతఃపురస్త్రీలు వెలికి రాఁగూడదనునియమమయోధ్యాపురినే కాదు, లంకాపురియందుఁగూడ నుండెను. రావణుని భార్యలు ముసుఁగులు లేకనే ఆతఁడు మరణించి పడియున్న ప్రదేశమునకు వచ్చినప్పుడు మండోదరీవిలాపమువలన నిది తెలిసికొనుచు న్నాము. తాను పాదచారిణియై వచ్చుటే యాశ్చర్య మనియు నామె చెప్పుచున్నది.

అయినను, స్త్రీలు పురుషులతో విహరించుపద్ధతి మానవులందును రాక్షసులందు నుండినది. స్త్రీలు పురుషులతో విమానము లందును విహరించుచుండిరి. విమానమున శ్రీరామునితో సీతాదేవి యయోధ్య కేఁగిన చో రాక్షసేశ్వరునితో మండోదరి కుబేరవన ములందు విహరించినది. ఇట్టిసమయములందు స్త్రీలు కనఁబడఁగూడదను నియమము లేదు. ఈసంగతి శ్రీరాముఁడే చెప్పుచున్నాఁడు.

"సమరంబుల వ్యసనములన్
డమరముల స్వయంవరంబులన్ బెండ్లియెడన్
సుమతీ! యజ్ఞములందుం
గమలాక్షులదర్శనం బకార్యం బగునే!"

అని విభీషణునితోఁ బలికినాఁడు.మఱియు;

"చెలువలఁ గావఁగ చేలములు, ప్రహరులు
ఆలయజాలములును తెలియును"

చాలవనియు "శీలమే సంరక్షక" మని యు శ్రీరాముని యభిప్రాయము.

భారతీయయువతుల కాదర్శప్రాయయగు ననసూయను సీతాదేవి దర్శించినది. అత్రిమ హాముని యాశ్రమము మిక్కిలి సుందరమైనది. దానికి అనసూయాదేవిగుణసౌందర్యమువన్నె వెట్టినది. ఆమెవలన సీతాదేవి అనేకవిషయ ములు నేర్చికొనినది ఆసందర్భమున సీతాదేవి సావిత్రి సతినిగూర్చియు రోహిణీదేవిని గూర్చి యుఁ బ్రశంసించినది. వీరప్పటికే మన ఆర్యా వర్తమున ఉత్తమాదర్శప్రాయలుగ నుండిరి. సీతాదేవి యితరఋషిపత్నుల ననేకులను దర్శించినది. వారినిరాడంబరజీవనము,పతిభక్తి,

ఆశ్రమమృగములందలి ప్రేమము, అతిథిసత్కారము ప్రశంసనీయములు.

రామాయణమునందు నితరపురాణములందువలెనే దేవవేశ్యలగు రంభమున్నగువారినిగూర్చియు నప్సరసలనుగూర్చియు వినుచున్నాము. రంభ విశ్వామిత్రునితపముఁ జెఱుపఁబోయి శపింపఁబడుటయు, ఋశ్యశృంగుని వేశ్యలు వంచించుటయుఁ జదువుచున్నాము. కులస్త్రీయగు నహల్య చేసినపాపము దానిఫలితమును దెలిసికొనుచున్నాము. అందువలన స్త్రీలలో నుత్కృష్టముకాని జీవనము నుండెనని గ్రహింపఁగలుగుచున్నాము.

స్త్రీలలో యోగినులు, విరాగులు నుండిరా యని యోజింప నేకభక్తురాలు రామాయణమునఁ గనబడుచున్నది. కేవలము భక్తిచేతనే ముక్తినంది జన్మసాఫల్యము పొందినశబరి మాతంగాశ్రమమున ప్రతివస్తువును భగవంతునిగనే తలంచి పూజించినది. రామునిగూర్చి వినినది. చూచినది. తరించినది.

అమానుషస్త్రీలుగ వర్ణింపఁబడినవారిలో వానరస్త్రీలు ముఖ్యులు. అయినను వీరియందు మానుషేతరగుణములు కనఁబడుట లేదు. సుగ్రీవునిగూర్చి కిష్కింధనుగూర్చి మనము చదువునప్పుడు, వాలిభార్య తారను చూచుచున్నాము. ఈమె చాల నందకత్తె; గుణవంతురాలు. వాలి కామెయందుఁ బ్రేమము గౌరవము నుండినవి. వాలి యామెను "మేధోదార, శీలకళాధార" మున్నగు ఉత్తమ విశేషణములచే సంబోధించుచున్నాఁడు. తార చాల తెలివి కలట్టిది. శ్రీరామునిమహిమ నొక్క త్రుటిలో గ్రహించినది. వాలి కెన్నోబుద్ధులు చెప్పినది. కాని లాభములేకపోయినది. తుద కామె దుఃఖించుచు వెనుదిరిగిపోయినది. వాలికై పరితపించి ప్రాయోపవేశము చేయుటకుఁగూడఁ బ్రయత్నించినది. తారయొక్క సుగుణములను గ్రహించి యామెను శ్రీరాముఁడే స్వయముగ వచ్చి యూఱడించినాఁడు. తారయు తక్కినవానరస్త్రీలును సీతాదేవి యనురాగమునకుఁ బాత్రలై ధన్యలైరి. ఆమె యయోధ్యానగరమునకుఁ బోవునప్పుడు వారి నిగూడ రమ్మని యాహ్వానించెను. వీరెల్లరు సంతసించి ఉత్సాహముతోఁ బేరంటమునకుఁ బోవుమనస్త్రీలవలెనే పయనమైరి.

రామాయణపు స్త్రీలలో రాక్షసవనితలను గూర్చి మనలోఁ గొందఱికి మంచి యభిప్రాయములేదు. రావణుని పదితలలును కుంభకర్ణునివికృతాకారమును మనమనసు విఱచినవి. వారెల్లరు గుణములవలన వికృతులును రాక్షసులు నైరి. కాని రూపమునఁ గాదని భగవద్గీతవలన నెఱుఁగవచ్చును. ఇది బాగుగ జ్ఞాపకముంచుకొనినచో వాల్మీకిముని లంకాద్వీపవాసులనుగూర్చి వ్రాసినవ్రాఁతలను బాగుగ గ్రహింపఁ గలుగుదుము. వాల్మీకి ఆర్యుఁడు. ఆర్యుల యభిప్రాయములనే చాటుచున్నాఁడు.

(సశేషము)

ప్రాచీనార్యస్త్రీలు: భారతీయనాగరికతయందు వారి స్థానము

దిగవల్లి వేంకట శివరావు గారు, బి. ఏ., బి. ఎల్.

(గత సంచికా శేషము)

హనుమంతుఁడు లంకఁజొచ్చినాఁడు. అచ్చటి స్త్రీలను జూచినాఁడు. వారిలో 'సువర్ణ వర్ణ'లున్నారు. ముగ్ధమొగములవారున్నారు. చందనమనోహరలేపములను బూయువారిని ముచ్చటలాడువారిని ఇంక ననేకశృంగారావస్థయం దున్నవారిని మన యాంజనేయుఁడు చూచినాఁడు. రాక్షసకేళీగృహాళిసీమను నిద్రారతలను జూచినాఁడు. అందు శశినిభముఖు లగు బాలికలుగూడ కనఁబడినారు. రావణుని నగరున రాచకొమరితలు ననేకు లుండిరి. రత్నకిరీటములను ధరించినవారు, ముక్తాహారమణిమయాలంకారములను ధరించినవారు ననేకు లుండిరి. అచ్చటివారెల్లరు నందకత్తెలే. రావణునిపట్టమహిషి మండోదరి చాలచక్కనిస్త్రీ. హనుమంతుఁడు రావణాసురుని యంతఃపురమునఁ గలకాంతల నెల్లఁ జూచినాఁడు. సీతాదేవికొఱ కచ్చట నుండిన నాగకన్యకలందు నాకకన్యకలందు గంధర్వకన్యకలందును వెదకినాఁడు! తరువాత ఆంజనేయుఁడు రాక్షసపానశాలను జొచ్చినాఁడు. అచ్చట నోడళ్లపై బట్ట లెఱుఁగక వివిధావస్థలందు నైమఱచి పడియున్న స్త్రీలను జూచినాఁడు. అచ్చటి రాక్షసమదవతులు నందమైనవారే. నిజముగ వీరే రాక్షసులని తలంపవచ్చును. అట్టిరాక్షసస్త్రీ లేదేశమందు నేకాలమందు లేరు.

యుద్ధకాండలో హతపతులను హతసుతులను హతబాంధవులను గూర్చి దుఃఖించు రాక్షసాంగనలు కనఁబడుచున్నారు. "దిక్కుమాలి మనము దేవురించుచుండఁగ రావణుఁ డింకను రామువలన రాఁగలముప్పుఁ దెలియలేకున్నవాఁడు. ఇంకను వరము లున్నవికదా యని గర్వించుచున్నాఁడు. యుద్ధములందుత్పాతములెన్నో కనఁబడుచున్నవి. సీత అసురకులమును మ్రింగుటకే వచ్చినది. విభీషణుని మాటలు రావణుఁ డేల వినఁ" డని విలపించుచున్నారు. వికృతాకారలు అజ్ఞలు దుర్వర్తనలు మధుపానమత్తలు నగు అనాగరక రాక్షసు లిట్లు వితర్కింతురా? పాపము! ఈ రాక్షసాంగనలు దుఃఖములపాలయిరి. రావణుఁడు గతించినాఁడు. అతనిభార్యలును "నీవు కాముకుఁడవుకావు. సర్వకార్యములందును స్వతంత్రుఁడవు కావు. మహావీరుఁడవు. అట్టినీకు వినాశముకలుగుట దైవవిధి కాక వేఱేమి కారణ"మని తలంచుకొనుచు దుఃఖించిరి. రాక్షసస్త్రీలయందు యుక్తాయుక్తవివేచన, సద్గుణములును, తెలివితేటలునుగలవు. వీరిలో రాక్షసపురుషుల కున్న యహంకారము కానరాదు.

వారిదుష్టస్వభావము అసహిష్ణుత మొదటు దనము నున్నట్లు తోఁపదు. ప్రత్యేకముగ క్రూరస్వభావలుగ ఘోరాకారలుగ వర్ణింపఁబడిన తాటక లంకిణి మున్నగువారు రావణుని దాసీజనులు తప్ప, తక్కినస్త్రీలు సాధారణమానవస్వభావములనే కనఁబఱచుచున్నారు. మంచినాగరకతను కలిగియున్నారు.

రావణుని పట్టమహిషి మండోదరి. మహారాజపుత్రి కుండవలసిన సౌందర్యము, సద్గుణము లీమె కున్నవి రావణునికిఁ బ్రియురాలు. అతనితో మేరుపర్వతము మున్నగు నగాగ్రములను జైత్రరథోద్యానమునను విహరించినది. అసురమయుఁడను మహాశిల్పికొమరిత. ఘనుఁడగు నింద్రజిత్తునకుఁ దల్లి. ఎంతో తెలివికలయట్టిది. రాక్షసవనితయైనను, దైవభక్తి, అవతారమాహాత్మ్యము నెఱిఁగినది. శ్రీరామునిగూర్చి మహావిష్ణువునుగూర్చి వేదాంతమునుగూర్చి యెఱిఁగినది. మంచివిద్యావంతురాలు. రావణున కెన్నియో బుద్ధులు గఱపినది కాని లాభము లేకపోయినది. ఆమె విలాపమున నెన్నోవిశేషసంగతులు తెలియుచున్నవి. తనభర్త ఉత్తమశాస్త్రశ్రుతిచయవేత్త, సురనరసతీవిశేషాహర్త, సద్ధర్మమార్గవిధిమర్యాదాభేత్త, పుణ్యజనావిచ్ఛేత్త, యని చెప్పుచు దుఃఖించుచున్నది. పాపము; "పరమపాతివ్రత్యధన్యశీలలగు ధర్మపరల భవ్యవృద్ధశుశ్రూషణావిరతచిత్తల నెందఱినో, పతిహీనురాండ్రఁ జేయుటవలన వారిశాపమే తన భర్తకు తగిలిన" దనుచున్నది. శూరుఁడైనను తనభర్త చేసిననారీచౌర్యము నీచమని పలుకుచున్నది. ఆమె "నీవు మంచియో చెడుగో చేసి నీగతికి నీవు పోయితివి. నే నన్నో, నీ వియోగముచేత నిట్లు దుఃఖించుచు బ్రదికియున్నా"నని భర్తనుగూర్చి విలపించుచున్నది. ఆమె భర్తవియోగము సహింపనేరక మూర్ఛపోయినది. ఇట్టి మండోదరి మనతలంపులో నొకఘోరరాక్షసి.

రావణుఁడు తన్నుఁ బరిగ్రహింపనిసీతాదేవిపై నాగ్రహపడినప్పుడు ధాన్యమాలిని యతని సడ్డగించి కౌఁగిలించుకొని "ఈమానవస్త్రీకై యేల యాసించెదవు? కామములేని కామినులను గామించుటవలన చెడుగు కలుగును గావున నామెను విడిచి నన్నుఁ గూడు" మని ధైర్యముగఁ బలుకఁగ నతఁడు నవ్వుకొనుచు నాప్రయత్నము మానెను! ధాన్యమాలినిపలుకులు కొంచెము నీచముగనే కనఁబడును గాని స్వైరిణి, సాహసవతియు నగు కాంత అట్టి యుక్తి తోఁచిన నట్లాచరించుటకు వెనుదీయునా?

సీతాదేవిని రావణుఁ డెన్నోహింసలు పెట్టినాఁడు. ఆమెచుట్టును క్రూరాకారలను కామరూపిణులను కావలియుంచినాఁడు. అయినను రావణాదిష్టలై రక్షించు కాంతలలో సరమ యుత్తమురాలు; దృఢవ్రత; సదయశీల. మాయారామశిరమును జూచి, వంచితయై దుఃఖించు సీతాదేవికి ఈ కరుణాళువు నిజ మెఱిఁగించి రామునియుద్ధసన్నాహముఁ దెలిపి యూఱడించెను. త్రిజట మఱియొకయుత్తమస్త్రీ. ఇట్టిరాక్షసస్త్రీ లింక నెందఱో కలరు. రాక్షసకృత్యములు మానవులు చేసినను

రాక్షసకృత్యములే. సీతను జూచి వచ్చుటకుఁ బోయినహనుమంతుఁడు లంకను గాల్చి వచ్చినాఁడు. అతఁడు చేసినదౌర్జన్యమును జూచి రాక్షసులు వెఱఁగంది ఏమిది యని సీతాదేవి నడుగ నది వారిమాయగనే తలంచి "మీమాటుమాయంపుఁ బనులు మీకే యెఱుంగఁ జెల్లు" ననినది! రామరావణయుద్ధ మైనతరువాత సీతాదేవిని బాధించినరాక్షసస్త్రీలఁ జంపెదనని హనుమంతుఁ డన రాజాశ్రయమున నుండి అతనియాజ్ఞానువర్తులగు దాసీజనులను జంపఁగూడదని సీతాదేవియే వారించినది.

రామాయణపుస్త్రీలు ఆర్యులనాగరకతయొక్క ఆదర్శములను వెల్లడించుచున్నారు. వాల్మీకిఋషి చిత్రించినస్త్రీలు సాత్త్వికస్వభావలు ఆచార్యవహారములను జక్కఁగ నిర్వహించువారు. విధ్యుక్తధర్మములను బాటించువారు. సాధ్వీమణులు. భారతజాతీయతయొక్క వేషభాషలు వీరియందుఁ జూడవచ్చును. ఆర్యస్త్రీల ముగ్ధభావము సుగుణపరంపరలు వీరియందుఁ జూడనగును. హైందవస్త్రీలలోపములును వీరియందుఁ గనఁబడుచునే యున్నవి. వీరివేదకాలమునాఁటి యాదర్శములును నిష్కళంకమగు పూర్వాచారములును వీరియాదర్శము లగు సావిత్రి రోహిణి మున్నగు మహాపతివ్రతలచరిత్రములఁ గనఁబడుచున్నవి. ఎనిమిదివిధములగు వివాహములు ద్వాదశవిధపుత్రులు నీకాలమునఁ గానరారు.

వాల్మీకి స్త్రీలను వర్ణించుపట్ల చక్కని భాష నుపయోగించినాఁడు. మృదుపదములు అలంకారములు నాతనిసంగీతమును సీతాదేవి దుఃఖమున కనఁబడుచున్నవి. రామాయణపుస్త్రీలసౌందర్యము సద్గుణములు సచ్చారిత్రములు మనకు వాల్మీకిదయవలన లభించినవి. మహాభారతమున స్త్రీలనుగూర్చిన ప్రశంస యింతవిపులముగ లేకపోవుట యొకచిత్రము. వాల్మీకి మానుషేతరస్త్రీలను వర్ణించినపట్లను చక్కఁగాఁ జిత్రించినాఁడు. తారయు మండోదరియు వాల్మీకి చిత్రలేఖనమునఁ గొఱంతలేనిసుందరపాత్రములుగనే కనఁబడుచున్నారు. రామాయణకాలపుసంఘమున నున్నతస్థానమునే యలంకరించుచున్నారు. కామక్రోధములు శూర్పణఖయం దెంతసహజముగఁ జిత్రించినాఁడో మాత్సర్యము మందరయందు నంతసహజముగ వర్ణించినాఁడు. భిన్నములగు నాచారవ్యవహారములఁ జూచి యేవగించుకొని దిగ్భ్రమఁ జెంది దస్యులను దూషించిన ఆర్యులఋషి వాల్మీకిమహాముని. రాక్షసులదుర్గుణములు ఘోరరూపములు నార్యులవ్రాఁతలందు భూతఅద్దమునందువలెఁ బ్రకాశించి స్థూలభావము నందినవి. మనకు వివిధములగు నభిప్రాయములు కలుగుటకును గారణ మైనవి. అయినను మొత్తముమీఁద మనలనుగూర్చి వ్రాసినపాశ్చాత్యులవ్రాఁతలకన్న నివి బాగుగ నున్నవనియే చెప్పవచ్చును. మహాభారతకాలమునాఁటికి రామాయణకాలమునాఁటి ఆర్యుల శ్రుతిస్మృతి సదాచారములు కలఁతఁ జెందినవి. కొంతమార్పుకూడఁ జెందినవి. రామాయణమే పురాణ మైనది. సావిత్రిచరిత్ర నలచరిత్ర శకుంతలచరిత్ర మున్నగు నుపా

ఖ్యానములనుబట్టి యప్పటి కవియు సత్యకాలపుగాథలై పోయినట్లు భావింపవచ్చును. ధర్మరాజుపరిపాలనకాలముననే కలియుగపు చిహ్నములు కనఁబడినవి. మహాభారతముతో భారతీయుల క్షీణదశ ప్రారంభమైనదని చెప్పవచ్చును.

భారతమునాఁటిస్త్రీలును ఆర్యులప్రాచీనాచారముల నుత్తమాదర్శములుగనే తలంచిరి. కాని కాలమునుబట్టి కొన్నిమార్పులు కలుగక తప్పినవికావు. వివాహములందొక మార్పు కలిగినది. శుక్రునికొమరిత దేవయాన రాజగుయయాతిని బెండ్లాడినది. అందపక్రమములు లేకుండ శుక్రుఁడు వరమిచ్చినాఁడు! శకుంతల అప్సరసకును మునికిని గలిగినకన్య. కణ్వునిపెంపుడుకొమరిత. రాజగుదుష్యంతుఁడామెను బెండ్లాడినాఁడు. సత్యవతి పడవనడుపువానితనయ. మహారాజగు శంతనుఁడామెను వివాహముచేసికొనెను. భీముఁడు రాక్షసస్త్రీయగు హిడింబను జేపట్టినాఁడు. అర్జునుఁడు నాగకన్యను బెండ్లాడినాఁడు. యాదవులును పాండవులును వియ్యమందిరి. వైదర్భరాజపుత్త్రి లోపాముద్రను అగస్త్యుఁడు వివాహము చేసికొనినాఁడు రోమపాదుని కొమరితను ఋష్యశృంగుఁడు పరిణయమైనాఁడు!

ఒకకులమువా రింకొకకులమునఁ బెండ్లాడుటయేకాక వివిధములగు వివాహములును జరుపునాచారము వచ్చెను. గాంధర్వము మున్నగు నెనిమిదివిధములగు వివాహములు సంఘమునఁ గనఁబడుచున్నవి. ఆనుశాసనిక పర్వమునందు భీష్ముఁడు వీనితెఱంగు ధర్మజున కెఱింగించినాఁడు. మఱియు నిట్టివివాహములు చేసికొనుట యెవ్వరెవరికి యుక్తమగునో తెలిపినాఁడు ఒకవర్ణమువా రింకొకవర్ణమువారిని బెండ్లియాడిన "యొక్క-యొక దూష్యంబుగాక చెల్లు"నని చెప్పి బ్రాహ్మణునకు నాలుగుజాతులనాతులను బ్రసూతులైనసుతులకు దాయభాగనిర్ణయమునుగూడఁ జేసి చెప్పినాఁడు. ఇట్టిసందర్భమున హవ్యకవ్యములు, మజ్జనభోజనములు బ్రాహ్మణియే చేయవలయు నని చెప్పినాఁడు. అటుతరువాత బహువిధములగు కొమరుల తెఱఁగు చెప్పి అన్నికర్మములకును ఔరసుఁడే ముఖ్యుఁడనియుఁ బౌత్త్రుఁడునితనిబోలు ననియుఁ జెప్పినాఁడు. భారతయుద్ధము ముగిసెనది. ఈయుద్ధముతరువాత ఐరోపామహాసంగ్రామానంతరమువలెనే విగతభర్తృకలు పునర్వివాహము చేసికొనఁగ, తండ్రి చనిపోయిన తరువాతఁ బుట్టినవారు పౌరులుగ నిర్ణయింపఁబడినట్లులె మన దేశమునను నూతననియమము లెన్ని వచ్చినవో చెప్పుట దుర్లభము. రామాయణమున భార్యలు భర్తలకొఱకు, అగ్నిప్రవేశము చేసినట్లు కానరాదు. కాని పరిశుద్ధురాల నని తెల్పుటకు సీతాదేవి అగ్నిప్రవేశము చేసినది. మహాభారతమునందు శ్రీకృష్ణునిభార్యలు ఆయననిర్యాణానంతరము సహగమనము చేసినట్లు మౌసలపర్వమునఁ జెప్పఁబడుట చూడ నీకాలమున కామాచారము విరివిగ నున్నట్లు స్పష్టపడుచున్నది.

ఆనుశాసనికపర్వమున ఉమామహేశ్వరసంవాదమునఁ బార్వతీదేవి శివునకు బోధించినట్లుగ పతివ్రతాధర్మములు వివరింపఁబడినవి.

ఇవి విధ్యుక్తధర్మములే. పతివ్రత భర్తృమతమూఁది యాచరింపఁదగిన దేవతాపితృసమర్చనములు, అతిథిపూజలు, పతివ్రతల కనర్హములగు భార్యల యధర్మములు, అధర్మాంగనకుఁ గల యాసురి, పైశాచి, రాక్షసియను పేరులు మొదలయిన విషయములు చెప్పఁబడినవి.

కలియుగపుదుర్దినములు వచ్చినవి. ద్వారకానగరమున మహోత్పాతములు పుట్టినట్లు మౌసలపర్వమున "......తిరుగులజ్జ, విడిచి యభిలాషములవెంట విభులపంపు, సేయ కున్మార్గములఁ దమచిత్తములకు, వచ్చినట్లు వర్తింతురు వనిత లధిప!" యనియు చదువుచున్నాము.

సవతులజీవనము పట్టుదలయు కద్రువవినతలకథయందు అనుశాసనికపర్వమునఁ జూచుచున్నాము. కద్రువ వినతను వంచించి దాస్యముచేయించుకొనుటయు గరుత్మంతుఁడామెకు దాస్యవిముక్తి చేయుటయుఁ జెప్పఁబడినది. ఈయసూయ సహజముగఁ బుట్టిన సవతియోర్వలేమి.

ఆకాలమునాఁటిస్త్రీలకు ననేకవిద్యలందును గళలందును బాండిత్య ముండినది. ఉత్తరకు కళలయందువేడ్కచూపి, నయముతోడ నర్తనంబుల శిక్షింపుమని విరాటుఁడు బృహన్నలను గురువుగ నియమించినాఁడు. ఉత్తరకొక ప్రత్యేకనర్తనశాలకూడ ఉండెను. సత్యభామకు ధనుర్వేదము వచ్చునని యామెచారిత్రమువలననె తెలియఁగలము. భారతములోని స్త్రీలెల్లరు విద్యావతులుగనే కనఁబడుచున్నారు. దమయంతి, సావిత్రి, దేవయానలు నాగరకస్త్రీలు; విద్యావతులు. శకుంతల తనభర్తతో నడిపిన సంభాషణమువలన నామె ధర్మశాస్త్రము తెలిఁగినవిద్వాంసురాలని స్పష్టపడుచున్నది. ద్రౌపదీవివాహము దమయంతిస్వయంవరమును స్త్రీలకుఁగల స్వాతంత్ర్యమును దెలుపుచున్నవి. సావిత్రి తన జనకునితో వాదించి చిత్రాశ్వుని పెండ్లాడుటయు దీనికిఁ దార్కాణమె.

ఆకాలమున స్త్రీలకు శాస్త్రములందు విద్యలందుఁ గళలందుమాత్రమే కాక మంత్రములందుఁగూడఁ బ్రావీణ్యముండెను. ఉపాసనమంత్రశక్తియు వీరి కుండినట్లు సావిత్రి కుంతి మున్నగువారి చరిత్రములవలన గ్రహింపఁగలము.

భారతపుస్త్రీలు తమపతులతోఁ బడిన కష్టములు వర్ణనాతీతములు. కుంతి పాండురాజుతో, ద్రౌపది పాండవులతో, దమయంతి నలునితో అడవులందుఁ గాలముఁ గడపిరి. సైరంధ్రులుగఁ బనిచేసిరి. వీరిపతిభక్తి, అతిథిసత్కారము నప్రతిమానములు. వీరు సాధారణస్త్రీలవలె గృహచ్ఛిద్రము లనుభవించి సంసారముల నీఁదినారు. సావిత్రిభక్తి, దమయంతి యోర్పు, శకుంతల తెలివి యాదర్శప్రాయములు. భరతఖండమున జరిగిన ఘోరసంగ్రామమునఁ బతులను సుతులను బోఁగొట్టుకొని స్త్రీలు దుఃఖభాజనలైరి. యాదవస్త్రీలను దుడుకు బోయలుకూడఁ బరాభవించిరి.

ముద్దు కృష్ణుడు

మంగిపూడి వేంకటశర్మ గారు

పిలిచితేను పలుకవేమె గొల్లభామా—నాతో
నిలిచి మాటలాడవేమె గొల్లభామా.

నిలుచుటకు వల్లగాదు కృష్ణమూర్తి—నన్ను
పలకరించకోయి యిపుడు కృష్ణమూర్తి.

మంచిమాటచెప్పుతానె గొల్లభామా—స్నేహ
మెంచి యాలకించిపోవె గొల్లభామా.

మంతనాల వేళగాదు కృష్ణమూర్తి—మాట
మంతికిపుడు వీలులేదు కృష్ణమూర్తి.

తత్తర మింతేలనీకు గొల్లభామా—మాట
కుత్తర మియ్యవె నాకు గొల్లభామా.

అత్తవారి యింటికాడ కృష్ణమూర్తి—నేను
కొత్తకోడలైతినోయి కృష్ణమూర్తి.

కొత్తకోడలైతె నేమి గొల్లభామా—నన్ను
కొత్తగాను చూడవలెనె గొల్లభామా.

అత్త విచ్చుకత్తిసుమ్మ కృష్ణమూర్తి—నన్ను
ఒత్తిడిబెట్టును సుమ్మ కృష్ణమూర్తి.

అత్తయేమి చేయగలదె గొల్లభామా—మన
చిత్తములు ఒక్కటైతే గొల్లభామా.

మామ మంచివాడుగాడు కృష్ణమూర్తి—గరిడీ
సాములుచేసినవాడు కృష్ణమూర్తి.

మామ యేమిచేయగలడె గొల్లభామా—మన
మనసులు రెండేకమైతే గొల్లభామా.

ఆడబిడ్డ చాడీకోరు కృష్ణమూర్తి—మన
జాడగడితే చెడ్డపోరు కృష్ణమూర్తి.

ఆడబిడ్డ యేమిచేయు గొల్లభామా—మన
ఆత్మలందు ప్రేమలుంటె గొల్లభామా.

మగడు మానవంతుడోయి కృష్ణమూర్తి—శంక
తగిలితే మన్నింపడోయి కృష్ణమూర్తి.

మగడు యేమిచేయగలడె గొల్లభామా—మన
మక్కువలు నిక్కమైతే గొల్లభామా.

కత్తిరిలో పోకనైతి కృష్ణమూర్తి—మనసు
తత్తరించు నేమిగతి కృష్ణమూర్తి.

అన్యులెవరు చూడకుండ గొల్లభామ—ఒక్క
చిన్నిముద్దు బెట్టిపోవె గొల్లభామా.

ఇట్టిట్టు చెల్లునోయి కృష్ణమూర్తి—ముద్దు
బెట్టినాను పోగదోయి కృష్ణమూర్తి.

దాటిపోయినావె గడుసు గొల్లభామా—నష్టి
తోటిపుచ్చుకొనె ముద్దు గొల్లభామా.

ముండకోపనిషత్తు

మలకపల్లి శేషగిరిరావుగారు, శతావధాని

ప్రథమముండకము - ప్రథమఖండము

శ్రీశుఁ డవ్యయుఁ డాద్యుండు సృష్టికర్త
విశ్వపరిపాలనక్రియా విదుఁడు దేవ
తాగ్రగణ్యుండు దనసృష్టియందు జ్యేష్ఠుఁ
డౌ నథర్వున కాత్మవిద్యను వచించె.

అట్టి బ్రహ్మవిద్య నథర్వుఁ డంగిరునకు
నంగిరుఁడు సత్యవాహున కాతఁ డాంగి
రసున కెఱిఁగించి రిట్టుల క్రమముగాను.

సన్నుతగృహస్థుఁ డైనట్టి శౌనకుండు
ప్రకటశాస్త్రోక్తముగ నాంగిరసున కేఁగి
"యనఘ! యేపదార్థముచేత జనుని కెల్లఁ
దెలివి గల్గెడి; నది యానతీయఁగదవె."
అనిన విని శౌనకున కిట్టు లనియె నాంగి
రసుఁడు పరమార్థమును గన బ్రహ్మవిదులు
ద్వివిధవిద్యలు గలవని తెలిపియుండి
రవియె పరవిద్య యపరవిద్యయు ననంగ.

అలచతుర్వేదషట్శాస్త్రములను గలుగు
విపులమైన ధర్మాధర్మ విధులఁ దెలుపు
నట్టి దపరంబు పర మెట్టి దనిన వినుము
తెలియఁ జేసెద నిపుడు సుధీవరేణ్య!

గోత్రహీనంబు దృష్టి కగోచరంబు
వర్ణరహితంబు, నభవ మవ్యాకృతంబు
స్వప్రకాశ మనంతంబు శాశ్వతంబు
నగుపరబ్రహ్మమును దెల్పు నదియె పరము

అణువు స్థూలంబు సూక్ష్మ మన్యంబు లేక
ధ్రువముఁ బోలి తటస్థభావమున వెలయు
నీశ్వరునిచేత నశ్రాంత మీజగత్తు
సతతసంపూర్ణ మహితసంగతి వహించె.

సాలెపురువెల్లు దారంబు లోలిఁ గూర్చు
భూమి నెట్టుల నోషధుల్ పుట్టుచుండు
నట్టిరీతులఁ బరమాత్మ నధిగమించి
జనన మొందుచు నుండె నో మునివరేణ్య!

ఆపరబ్రహ్మమునను నవ్యాకృతంబు
ప్రాణము మనంబు సత్యంబు పంచభూత
ములును లోకములును గర్మములును జీవ
రాసులును సంభవించెను గ్రమముగాను.

సర్వవేత్త యెవండో శాశ్వతుఁ డెవండో
జ్ఞానమయుఁ డెవ్వఁడో తపస్తత్త్వ మెవఁడో
యట్టిపరమాత్మవలన బ్రహ్మమును మఱియు
నామమును రూపమును దదన్నమును గలిగె.

ప్రథమముండకము - ద్వితీయఖండము

సత్యమై శాశ్వతంబై ప్రశస్తమగుచు
మును వసిష్ఠాదిసకల సన్మునులచేతఁ
జేయఁబడినట్టి కర్మముల్ సేసినయెడ
మీకు సౌఖ్యోన్నతులు గల్గు లోకమందు.

ప్రజ్వలింపఁ జేయఁబడిన వహ్నియందు
దక్షిణోత్తరదిశల శ్రద్ధాసభక్తి
కముల హోమంబు గావింపఁ గర్మచయము

పరమపావనతాతి విస్తరత లారయు.

పౌర్ణమాసియు దర్శయు వైశ్వదేవ
వర్జిత మతిథిసోమమహస్యంబు వీని
యూర్ధ్వలోకంబు లేడింటి నూడ్చివేయు.

ఘనకరాళి మనోజవ కాళి విశ్వ
రూపియును ధూమ్రవర్ణ సులోహిత స్ఫు
లింగినియు నన్నయట్టి సుశీలమైన
సప్తజిహ్వలు గల హుతాశనుని వ్రేల్వ
నమ్మహాహుతు లర్కబింబాంశులగుచు
రమ్ము రమ్మని యాదరణమ్ముతోడ
జేరి పూజించి స్వర్గంబుc జేర్చుచుండు.

వితతమైన యష్టాదశ స్మృతుల నదృఢ
మైన కర్మముల్ శ్రేష్ఠంబు లనుచు నెవరు
నలుపనెంతురో వారలు సంతతంబు
దమము లేక జరామరణములc గాంత్రు.

కర్మమున ముక్కుచుండు రజ్ఞానపరతc
బండితులమంచు శేముషీ పరులమంచుc
దలcచుచుండెడిమూఢు లంధత వహించి
జననమరణైకసంసార జలధి యందు.

ప్రకృతిసంబంధమగు నీ ప్రపంచమందు
గర్మములు చేసి బాలిశుల్ జ్ఞానపథము
గాంచcగాలేక మిగుల దుఃఖంబుచేతc
గూలుచుందు రధోలోక కోటియందు.

మూఢమతులు శ్రౌతస్మార్త ముఖవిశేష
కర్మములె మంగళములు మోక్షమున కంచుc
దత్పరత స్వర్గభోగసంస్థవహించి
నరకలోకంబు గాంతు రనంతరంబు.

శాంతయుతులైన మహిత విజ్ఞానమతులు
స్వాశ్రమాపేతవిధులc బ్రశస్తి గాంచి
యర్కముఖమున సత్యలోకాదికముల
కరుగుచుందురు సంతతాహ్లాదములను.

కర్మమున వృద్ధినొందు లోకములc జూచి
యాపరముకన్న శాశ్వతమైనవస్తు
వెఱుcగరాదని తద్జ్ఞానపరత గురుని
కడకుc జనవలె ద్విజుcడు యోగ్యత వహించి.

ప్రవిమలాత్ముండు వేదపారంగతుండు
పృథుకశాఖ్యుండు నతత జితేంద్రియుండు
నై సదాశిష్యతతికి విజ్ఞానమహిమ
మెఱుcగcజేసెడినాతcడే గురువరుండు.

ద్వితీయముండకము - ప్రథమఖండము

క. ఓ శౌనకుండా! వినుము ప్ర
కాశించెడునగ్నియందుcగణమిణుcగురులు
ద్భాసిల్లెడు క్రియ నీజగ
మాశశ్వన్మూర్తివలన నఖిలం బలరెన్.

అపరబ్రహ్మ మప్రాణ మజ మమూర్త
మఖిలపరిపూర్ణ మమరంబు నక్షరంబు
నై ప్రకాశించుచుండు బాహ్యాంతరముల
నతనికన్నను నింక నన్యంబుగలదె?

వినుము యామూర్తివలన నా విర్భవించె
బ్రాణము మనంబు నింద్రియ వర్గములును
భూజలానలముఖపంచ భూతములును.

రహి ద్యులోకంబు శిరము నేత్రములు సోమ
భానులు దిశలు కర్ణముల్ వాగ్వివృతులు
శ్రుతులు ప్రాణంబు వాయువు క్షోణి పాద
ములు జగంబు మనము సర్వభూతసంత
తాంతరాత్ముండతనికి సత్యంబు లరయ.

అగ్నివలనను సూర్యుండు నతనివలనc
జంద్రుc డాతనివలనc బర్జన్యుc డతని

వలన నోషధు లద్దాని వలన నిక్క
మందుచేతను బహుప్రజ లైరి సుమ్మి.

కలిగె నాపరబ్రహ్మంబువలన నాగ
మములుగ్రతువులగ్నులుయజమానియు నియ
మములుసూర్యేందుమహితలోకములు ధనము
నరసురాంశజ పశుపరంపరలు మిగుల
ప్రాణము నపానమును వ్రీహి యవలు తపము
శ్రద్ధయును సత్యమును బ్రహ్మచర్యము విధి.

హృదయగుహాంతరంబునఁ బొదలియున్న
యేడుప్రాణంబులును మఱి యేడులోక
ములును జ్వాలనుని యేడు జిహ్వాలును నేడు
విషయసమిధలు నిందె యావిర్భవించె.

సకలగిరులును నదులును సంద్రములును
సస్యసముదాయములు షడ్రసములు జీవ
తతులు సంతతపంచభూతమయమైన
విశ్వమంతయుఁ గల్గె నా విభునివలన.

సర్వపరిపూర్ణకుఁడు జగత్సాక్షియాట
దపము లమృతంబు వ్రతము నతండె వాని,
హృదయగుహాయందు నలరు పరేశ్వరు నమృ
తస్వరూపంబు గాంచెడి తత్త్వవిదులు
ప్రకృతిసంబంధ మంటరు ప్రవిమలాత్మ!

ద్వితీయముండకము - ద్వితీయఖండము

సర్వపరిపూర్ణమై మహో ఖర్వమై ప్ర
సిద్ధమై పూజనీయమై చెలఁగునట్టి
సదమలాచారమహిత తేజంబు మదినిఁ
దెలిసికొనుమయ్య! ప్రియతమా! ధృతివహించి.

శుద్ధతేజంబు గలదేదొ సూక్ష్మసూక్ష్మ
మేదొ లోకంబులున్ లోకు లెందునుందు
రదియె యక్షరమున్ బ్రహ్మమదియె యమృత
మాత్మ సత్యము వేద్ధవ్య మనియెఱుంగు.
ఓ మునీశ్వర! ఉపనిషత్ప్రోక్తమైన

సుమచిరోంకార మను ధనుస్సుఁగొని ధ్యాన
మానసాన నుపాసనాఖ్యాన బాణ
మెక్కిడి పరంబు లక్ష్యంబు దక్కు మిక.

ఇట్లు వచియించు నోంకారమే ధనుస్సు
శరమె యాత్మంబు లక్ష్యమే పరుఁడు గాన
స్థిరతరాత్మను డప్రమాదపరము నరయఁ
దన్మయంబగు బ్రహ్మంబు దానె యగును.

ఏమహాత్మునియందు సంహృతము లయ్యె
మహిత భూమ్యంతరిక్షాది బహుజగంబు
లట్టి సర్వేశు నాత్మను నక్షరునిగఁ
దెలియనగు సుమ్మి సంసారజలధి తరణి.

బండిచక్రముకం దాకు లుండునట్లు
లుండు నాడులు మనమున నుండు జీవుఁ
బ్రణవమనియెంచి ధ్యానింపఁ బరమశుభము
లొదవుచుండెడి మీకు మహోన్నతముగ.

ఎవనిమహిమను భాసిల్లె నీజగంబు
విపులజ్యోతిర్మయుఁడు సర్వవిదుఁ డెవండు
అట్టి సర్వజ్ఞుఁ డీశ్వరుఁ డంతరాత్ముఁ
డై ప్రకాశించు హృదయపద్మాంతరమున.

ప్రాణదేహ మనోమయుం డైనవాని
నమృతమయుని సదానందు నాత్మదృష్టి
హృత్సరోజంబునను జేర్చి మెలఁగి గాంతు
రనయమును బ్రహ్మవిదులైన యట్టిమునులు.

కార్యకారణరూప విఖ్యాతమైన
యాపరబ్రహ్మ మారయ నలఘుమతిని
సకలబంధంబు లెడఁబాసి సంగరహితుఁ
డై ప్రకాశించి జ్ఞాని విజ్ఞానరూఢి.

విమలమై యమృతమయి హృత్కమలమందు
ఘనత జ్యోతిర్మయాకారమునఁ జరించు
నట్టియవ్యయ బ్రహ్మతేజోంశకుని ని
రంతరము గాంతు రెలమి బ్రహ్మైకవిదులు.

రవిశశాంకాగ్ని విద్యుత్స్వరంపరాక్ష
తతి వెలుంగఁగ నేర దెంతయును నెవని
యతులతేజంబు ముందట నతనిచేత
సర్వము వెలుంగు నతఁడె తేజఃప్రదుండు.

ప్రాక్ప్రతీచియామ్యోత్తర భాగములను
మఱియు నూర్ధ్వాధరాది సమస్తగతుల
విపులతేజస్వియగుచు వ్యాపించియుండె.

తృతీయముండకము - ప్రథమఖండము

క్షరము గలయట్టిదేహ వృక్షంబునందు
వరలుజీవేశ్వరులలోనఁ గరము జీవుఁ
డంధత వహించి కర్మఫలాదికములఁ
గాంచు నీశుఁ డయ్యవి యంటకయె మెలంగు.

అజ్ఞత శరీరమే యాత్మ యనుచు జీవుఁ
డందు దుఃఖించుచుండు మోహమున నెప్పు
డవ్యయబ్రహ్మసామర్థ్య మాత్మఁ దానె
యని యెఱుంగునో యప్పుడే కను సుఖంబు.

కర్తయై బ్రహ్మమై రుక్ప్రకాశమైన
వరము నెప్పుడు విజ్ఞాని యరయఁగలుగు
నప్పుడే కాంచుఁ బాపపుణ్యములు లేని
పరమసామ్యంబు దుఃఖసంకరుఁడు గాక.

ఎవఁడు ప్రాణస్వరూపకుం డెవఁడు సర్వ
భూతమయుఁ డట్టిపరమాత్మ బుద్ధియందు
నాత్మరూపునిఁగా నెంచు నట్టిజ్ఞాని
యాత్మరతిఁ గల్గి శ్రేష్ఠుఁడై యలరుచుండు.

శీతభవులైన ధీరు లేనిమ తేజ
మాత్మరూపంబుగా నెంచి యలరుచుంద్రో
యట్టిజ్యోతిర్మయాకార మైనబ్రహ్మ
మెఱుఁగఁబడు జ్ఞానదీప్తిని హృన్నభమున.

సత్యము జయించు నన్నృతంబు చక్కఁగాదు
సత్యమున దేవయానంబు సవిరళమగు
జ్ఞాన మే బ్రహ్మమున నాప్తకాములైన
మునులు గాంతురయ్యదె సత్యమునకు మేలు.

దివ్యమై సూక్ష్మసూక్ష్మమై భవ్యమై య
చింత్యమై స్వప్రకాశమై శ్రేష్ఠమైన
యాపరం బజ్ఞులకు దూరమై మనీషు
లకు సమీపమై హృత్కమలమున మెఱయు.

బలసి నిజచక్షురాదికములను గాని
తతవచోర్భటిచేఁగాని తపముఖాది
విధులచేఁ గాని యామహావిభుని జనుఁడు
గాంచఁగా లేఁడు జ్ఞానసంగతినె కాంచు.

ప్రాణవాయువు లైదుగాఁ బరిణమించి
యొనరు దేహంబునను సూక్ష్మమునఁ జరించు
నట్టిబ్రహ్మంబు మహితశుద్ధాత్మచేతఁ
దెలియవలెనుమ్మి; హృదయమింద్రియగతంబు,
విమలవిజ్ఞాని తనమానసమున నెట్టి
వాంఛలను లోకములు సదా వలయునను నె
యట్టివన్నియు బ్రహ్మమం దలరుఁ గాన
భూతికాముని కాతని పూజ వలయు.

తృతీయముండకము - ద్వితీయఖండము

ఏపరబ్రహ్మమున నొప్పె నీప్రపంచ
మట్టిబ్రహ్మంబు గాంచెడి నాత్మవిదులు
గడఁగి నిష్కాములై గుర్వుగా నుపాస
నములు సేతురో వారె బ్రహ్మమును గాంత్రు.

ఎవఁడు బహుకామ్యములు గోరు హృదయ
నతఁడు పుట్టెడివాని నందందఁ బెలుచ [మందు
నాత్మవిజ్ఞాని యగువాని కాప్తకామ్య
మున శరీరంబు నశియించు మునివరేణ్య!

వినుము బ్రహ్మంబు వాక్కుచే వినుటచేత
నలఘుమేధను బొంద శక్యంబుగాదు
యాత్మవిదులకుఁ దత్తేజ మభిలషించు
నిచ్ఛచేతనె విపులమై యెఱుఁగఁబడెడి.

అలవి గానిది దృష్టి కయ్యాత్మతేజ
మబలుఁ గావున జ్ఞాని విజ్ఞానజనిత
నియమితాలింగుఁడై మహా నిష్ఠతోడ
సాధనముసేయఁ దత్ప్రకాశమును గాంచు.

అత్మదర్శనులౌ మును లాత్మవిదులు
జ్ఞానతృప్తిని బహుళ కృతార్థు లగుచు
సర్వమయమైన యాత్మసంస్థత వహించి
బ్రహ్మమునుగాంచుచుందు రో ప్రవిమలాత్మ!

శౌనకమహర్షి! ఉపనిషద్ జ్ఞానవిపుల
మహితరార్థాద్యులౌ మహామహులు మునులు
విమలమతి యోగరూఢి బ్రహ్మమునఁ జేరి
బ్రహ్మతేజస్కులై ముక్తిఁ బడయుచుంద్రు

కళలు గర్మము లింద్రియంబులును స్థితులు
జ్ఞానరూపౌఘజీవాది కములు మిగుల
నమృత మజ మప్రమేయ మవ్యయ మనంత
మైన బ్రహ్మంబునం దైక్యమై వెలుంగు.

నదులు లహరీనియుక్తి సంద్రములఁ జొచ్చి
నామరూపంబులను విడనాడుపగిది
బ్రహ్మవిదుఁడును నామరూపములు వీడి
యద్వితీయపరబ్రహ్మ మందు మెఱయు.

ఆపరబ్రహ్మమెవఁడు ప్రత్యక్షలీల
నాత్మఁ దెలియునో వాఁడె బ్రహ్మైకనిరతి
నమృతమయుఁడై భవాదుల నంటఁ డట్టి
వంశమున బ్రహ్మవేత్తలే వరలుచుంద్రు.

సతతశాస్త్రోక్తకర్మానుసారు లెవరు
విపులమోక్షార్థులై యగ్ని వ్రేల్తు రెవ్వ
రల యథర్వణవేద విద్యాప్రకాశు
లైనవారికి వచియింపు మాత్మవిద్య.
మున్ను వచియించె సత్యమై వన్నెకెక్కు
నక్షరబ్రహ్మవిద్యామహత్త్వ మాంగి
రసుఁడు శౌనకునకు నిట్లు బ్రహ్మవేత్త
లైన ఋషులకు వందన మాచరింతు.

ఇది ద్వితీయఖండము సమాప్తము.

వానప్రస్థులు

"సునీతిశ్రమణుఁడు"

హైందవ ధర్మశాస్త్రములన్నియు, వర్ణాశ్రమములను ధర్మమూలములుగఁ బాటింపుచున్నవి. శ్రుతియందును మూలవర్ణములు పేర్కొనఁబడినవి. ధర్మశాస్త్రములును బురాణములును సత్యధికముగ వర్ణోత్పత్తిభేదములంగూర్చి తెల్పుచున్నవి. పాశ్చాత్యపండితులు సంస్కృతవాఙ్మయపరిచయముఁ గావించిననాఁటనుండియు వర్ణవిషయికములైన సిద్ధాంతము లెన్నియో వెలువడినవి. అందు నాశ్చర్యము లేదు. మఱి యేదేశమున జనులీరీతిగ విభజింపఁబడకుండుటంబట్టి భారతవర్షపరిచయముగలవి దేశీయులకు వర్ణవిభాగము వింతగఁ గన్పట్టకమానదు. కొంతవఱకు వృత్తులు జాతుల ననుసరించియుండుటంబట్టి యీవింత హెచ్చినది. యవన మెగాస్థనీసు క్రీస్తుజననమునకు మూఁడుశతాబ్దములకుఁ బూర్వము భారతవర్షమునఁ దా నుండి చూచినవిషయములంగూర్చి వ్రాసినపత్త్రములలో హైందవసంఘమున నుండువర్ణముల నేడింటిగఁ బేర్కొనెను.

వృత్తులే కాక యాశ్రమములుగూడ వర్ణములంబట్టి నియమింపంబడినట్లు ధర్మశాస్త్రములవలన దెలియవచ్చుచున్నది. మన్వాది ధర్మశాస్త్రములు ద్విజులకుఁ జతురాశ్రమములఁ బేర్కొనుచున్నవి. శూద్రులంగూర్చిమాత్ర మేమియుఁ గాన్పింపదు. వారలకు ద్విజులసేవయే నియమింపంబడినది. తపము నాచరించెడిశూద్రు లెట్టులు వధ్యులుగఁ బాటింపంబడిరో శంబూకునికథవలనఁ దెలియవచ్చుచున్నది. కాని భవమందైన నిడుమల సహింపనోపక సంసారవిముఖతం జెందిన శూద్రులు వనవాసమునకుం జనినవారలను ద్విజన్ములు బాధించియుండరని మానమ్మకము. విఖనసాది ధర్మశాస్త్రకారులు బ్రాహ్మణులకు బ్రహ్మచర్యగృహస్థవానప్రస్థయత్యాశ్రమముల నాల్గింటిని, క్షత్త్రియులకు నందు మొదటి మూఁడింటిని, వైశ్యులకు నందు మొదటి రెండింటినిమాత్రమే చెప్పిరి. రామాయణంబునను లక్ష్మణుఁడు శ్రీరామునితో ముచ్చటించుచుఁ బుత్త్రులు యుక్తవయస్కులైనతరి రాజ్యభారంబు వారలపై నిడి వానప్రస్థాశ్రమమును స్వీకరించుట తమ కులాచారమని నుడివినట్లున్నది. శ్రీరాముఁ డీరీతిగనే తన పూర్వులాచరించినటులఁ జెప్పెను. ఇక్ష్వాకువంశస్థులఁ గూర్చి కాళిదాసుఁ డిటుల వ్రాసెను.

శ్లో. శైశవే ఽభ్యస్తవిద్యానాం
యౌవనే విషయైషిణామ్,
వార్ధకే మునివృత్తీనాం
యోగే నాంతే తనుత్యజామ్.

ఏతన్మహాకావ్యంబుననే రఘుమహారాజైహికభోగవిముఖుండయి తరుణవయస్కుండగు పుత్త్రునకు సామ్రాజ్యచిహ్నమగు శ్వేతఛత్త్రంబు నొసంగి భార్యాయుక్తుండయి

యిక్ష్వాకుకులధర్మానుసారముగఁ దపోవనంబు నకుం జనినట్లు చెప్పఁబడియున్నది. మహాభారతంబునను దుర్యోధనుండు మడుగున దాగి యుండి యుధిష్ఠిరదూరితుండై యాతనికిటులఁ బ్రత్యుత్తర మిడెను.

క. ఏ నింక సమర మొల్లను
హీనాయక! నీవు రాజ్య మిచ్ఛితి శాంతిం
గానకుఁ జని వల్కలపరి
ధానుఁడనై తపము సలిపెదను మునులకడన్.

పుత్రవినాశానంతరము, ధృతరాష్ట్రుండు భార్యాసమేతుండై వనవాసంబుఁ గావించుటకుం జని దావానలదగ్ధుండైనటులఁ జెప్పంబడియున్నది. ధ్రువుండు పితృనిరాకృతుండై బాల్యముననే తపోవనమునకుం జనినట్లు భాగవతము నుడువుచున్నది. యుధిష్ఠిరుఁడు కర్ణవృత్తాంత మెఱిఁగి యర్జునునితో నిటుల విలపించెను.

క. "మన కేటిరాజ్య మొండొకొ,
జనపదమున వేఁగి భైక్షచర్యావిధ జీ
వనము నడిపికొని యుండుచ,
మనఘా! యట్లయిన సుఖుల మవుదము సుమ్మీ."

ఆచార్యభిక్కు- వానప్రస్థాశ్రమమును గూర్చి వ్రాయుచు నీయది బ్రాహ్మణవాఙ్మయమునఁ గొంత యసాధారణముగఁ గన్పట్టినను బ్రాహ్మణదేశంబుల రాజవృద్ధుండైన రాజ్యభారము జ్యేష్ఠపుత్రునిపైఁ బడవేసి కాంతారవాసమునకుం జనుట కన్పట్టక పోలేదని వ్రాసెరి. వానప్రస్థాశ్రమంబు బ్రాహ్మణునికివలె క్షత్రియునకును బ్రతిధర్మశాస్త్రమును ద్వితీయగ్రహణీయాశ్రమమని యుద్ఘోషింపుచుండఁ బురాణాదులయం దెన్నియో మన కీ సంబంధమయినగాథలు గన్పించుచుండ భిక్కు-దొరవా రెందుల కటుల వ్రాసిరో తెలియరాకున్నది.

వానప్రస్థుం డెటులు జీవింపవలయును? వానివ్యాపార మెద్ది? భార్యాయుక్తుండై కాని యద్వితీయుండై కాని, వల్కలంబుల ధరియించి, గ్రామంబుఁ బరిత్యజించి, వనంబుఁ జేరి, పర్ణశాల నిర్మించుకొని, గ్రామభోజనంబు విసర్జించి, ధరాశాయియై, కందమూలఫలనీవారాదుల భుజింపుచు బ్రహ్మచర్యమునఁ దపము సల్పుచుఁ గాలముఁ గడుపవలయును. అహింస, శమదమాదిగుణములు, తపశ్చర్యము, బ్రహ్మచర్యము, బ్రహ్మజిజ్ఞాసఁ గలిగి జీవించుటయే యీయాశ్రమికి ముఖ్యములు. వానప్రస్థులలో ననేకశాఖలవార లున్నారని వైఖానస ధర్మప్రశ్నవలనఁ దెలియవచ్చుచున్నది. అట్టివార లెవ్వరనిన:—

1. ఔదుంబరులు
2. వైరించులు
3. వాలఖిల్యులు
4. ఫేనపులు
5. కాలశికులు
6. ఉద్దండ సంవృత్తులు
7. అశ్మకుట్టులు
8. ఉదగ్రఫలినులు
9. దంతోలూఖలికులు
10. ఉంఛవృత్తులు
11. సందశనవృత్తులు
12. కపోతవృత్తులు
13. మృగచారికులు

14. హస్తాదాయినులు
15. శైలఫలకాదినులు
16. అర్కదుగ్ధాశనులు
17. బైల్వాశనులు
18. కుసుమాశనులు
19. పాండుపత్రాశనులు
20. కాలాంతరభోజనులు
21. ఏకకాలికులు
22. చతుష్కాలికులు
23. కంటకశాయినులు
24. వీరాసనశాయినులు
25. మౌనులు
26. పంచాగ్నిమధ్యశాయినులు
27. ధూమాశనులు
28. పాషాణశాయినులు
29. అభ్యవగాహినులు
30. ఉదకుంభవాసినులు
31. అవాక్శిరస్కులు
32. సూర్యప్రతిముఖులు
33. ఊర్ధ్వబాహుకులు
34. అధోబాహుకులు
35. ఏకపాదస్థితులు

ఈ పదములయర్థంబులఁ బట్టియే వివిధ శాఖలవారి వ్యాపారములం గుర్తెరుఁగవచ్చును. ఇప్పటికిని మనము దేశమునందుఁ గంటకశాయినులను పంచాగ్నిమధ్యశాయినులను గనుంగొనఁగలముగాని యట్టివారలు భేషజమున కీవ్యాపారముఁ గలవారలై, ధనము నార్జించి జీవింపుచున్నారు.

బుద్ధుఁడు జాతిభేదము లేక యందఱును నీయాశ్రమమును స్వీకరింపవచ్చునని బోధించెను. మనుజుం డేజాతివాఁడైనను జాతిని గోల్పోయి బౌద్ధసంఘమును జేరిన బౌద్ధశ్రమణుం డగును. మఱియు సంసారవిముఖతం జెందిన ముదుసలులే కాక రాజ్యవిభవౌన్నత్యముల ననుభవించురాజులు, అపారసౌఖ్యంబుల నోలలాడుచుండు తరుణవయస్కులగు నృపకుమారులు, అధికైశ్వర్యయుక్తులగు వైశ్యులు, దారాపుత్రాదులను సకలైశ్వర్యములను విడనాడి హిమవత్ప్రాంతకాంతారప్రదేశములకుం జని, కందమూలఫలాశనులై, శాంతిమయంబగు జీవనమును సల్పుచుండిరని బౌద్ధవాఙ్మయమునుబట్టి తెలియవచ్చుచున్నది. బుద్ధుఁడు శాక్యులకు యువరాజై యుండియు యౌవనముననే ప్రియురాలినిబుత్త్రునివిడనాడి శాంతిం బొందుటకు విపినంబులకుం బోయిన సంగతి జగద్విఖ్యాతంబు. జాతకకథలలో నీసంబంధమగు విషయము లెన్నియో యున్నవి. "యుధంజయజాతకము" అట్టి యొకకథ. ఒకదినమున యువరాజు ప్రాతఃకాలముననే రథముపైఁ బ్రభావశీలురగు ననుచరులతోఁ, గూడ నారామంబునకుం జని యందు నతిరమ్యంబగు ప్రదేశమును జేరెను. తుషారబిందువులు గ్రాసదళంబులపైని యూర్ణనాభితంతుజాలంబులపైని సరములయందైన ముత్యముల మాడ్కి మెఱయంజూచి సూతుని 'నవి యేమి' యని ప్రశ్నించెను. ఆతఁడు 'హేమంతఋతువునం గనంబడు తుషారబిందువు'లని ప్రత్యుత్తరమిడెను. సాయంసమయమునఁ గుమారుండు

తిరిగి యచటకుం జని బిందువులను గాంచి 'యవి యేమయిన' వని యడిగెను.

సూతుఁడు:—'ఓరాజా! సూర్యుం డుదయింప నవి భూమిపై నంతరించును.' కుమారుం డిది విని యధికదుఃఖంబున నిటుల విలపించెను.

"ఈజీవనంబును గ్రాసదళంబున నీటిరుగ నుండు మంచుబొట్టువంటిది. రోగజరామరణంబులు నన్నధిగమింపక పూర్వము, జననీజనకులయాజ్ఞ వడసి నే శ్రమణుండ నయ్యెదను"

పురమునకుం జని పేరోలగమున వైభవముతో నాసీనుండై యున్న జనకునిం గని భక్తిపురస్సరముగ యాతని నభివందించి నిర్నికేతనస్థితి నవలంబించుటకు నాతనియనుజ్ఞ వేఁడుచు నిట్టు లనియెను.

"మిత్రామాత్యపరివృతుం డైన రథ నియంతృ ప్రభువగువాని నమస్కరించుచున్నాఁడను. ఓమహారాజా! నేను నిర్మానుష్య ప్రదేశమును బ్రవేశింప నున్నాఁడ. కాన నందులకు భవదాజ్ఞను వేఁడుచున్నాఁడను." రా జాతని నాయుద్దేశమునుండి మరలింపంబూని యిటులఁ జెప్పెను.

"నీకు సంతోషము లేకున్న నేను నీ కది యొసఁగూర్చెద. నీకు వ్యథఁ గలుగఁ జేయువాని నే నాశనం బొనర్చెద. కాంతారములకుం జనకుము, ఓయువరాజా! చనకుము."

యువరాజు:—"నాకు సంతోషవిరామంబు లేదు. నాకు దుఃఖంబుఁ గలుగఁ జేయువాని నే నెఱుంగను. కాని జరావినాశంబుఁ జేయనేరని జ్యోతిని నేఁ బ్రజ్వాలంబుగ నొనర్పఁ గోరుచున్నాఁడను". ఇది విని రాజు ప్రియపుత్రుని యట్టికార్యంబునుండి మరలింపం బూనఁ బ్రయత్నించెను గాని కుమారుండు వనవాసమునకుం జనఁ గృతనిశ్చయుండై యుండెను. సంసారపరిత్యాగంబుఁ గావింపవలదని ప్రార్థించుజననితో నాతఁ డిట్టులనియె "ప్రభాతంబున గ్రాసదళంబమానంబగుతుపారబిందువును బోలియున్నది మనుష్యజీవనంబు. కాన నోప్రియజననీ! న న్నిప్పిత కార్యంబునుండి నివర్తింపఁ జేయకుము."

పైఁ జెప్పంబడిన కథయం దెట్టు తుపారబిందువు, సంసారవిముఖతను, జీవితానిత్యవిషయికంబగుజ్ఞానమును గలుగఁ జేసెనో యటులనే యింకొకనికిఁ బలితకేశంబు సంసారపరిత్యాగంబును, వనవాసంబును సమకూర్చెను. 'కుల్లసుతసోమజాతకం'బున నాపితుఁడు సుతసోముని శిరమునుండి ధవళకేశంబుం దీసి యతనికిం గనుపఱుప సుతసోముఁడు తృతీయాశ్రమమునం బ్రవేశింపఁ గృతనిశ్చయుం డాయెను. జనకుం డెన్నిరీతుల బోధఁ గావించినను నాతఁడు వినఁడాయెను. తుదకు "వత్సా! సుతసోమా! నీజననీజనకులయందు నీకుఁ బ్రేమ లేకుండినను త్వదీయసంరక్షణవిరామంబున జీవింప లేని యీ లేబ్రాయంపుభర్త్రికా పుత్రులను గనుము. వారియుక్తవయస్కులైనపిదప నీవు నిర్నికేతనుండవగుము." కాని జనకుని బోధలు, గర్భవతియగు భార్యయొక్క ప్రార్థనలు నిజకంఠలంబమానుండగు సప్తవర్షీయుండైన పుత్రునిప్రార్థనలు కృతనిశ్చయుం

డగునాసుతసోముని నీప్సితకార్యమునుండి మరలింపఁ జాలకుండెను.

ఫీక్కుదొరవారు రాజాశ్రితులగుబ్రాహ్మణులు వానప్రస్థాశ్రమంబునఁ బ్రవేశింపం బూనిన రాజాజ్ఞఁ గైకొని యటులఁ జేయవలసియుండెడిదేమోయని యూహింపుచున్నారు. అందుల కనుగుణంబుగ దొరవారొక జాతకకథను గనుపఱచిరి. అందుఁ గశ్యపుండను రాజపురోహితపుత్త్రుం డిటులఁ జింతించుకొనెను "నామిత్త్రుఁడు రాజైనవాఁడు నిశ్చయముగ నాకాతఁడు ప్రబలసాహాయ్యం బొనర్పఁగలఁడు. కాని నాకెందుల కాతనిసాహాయ్యంబు? మాతాపితృలయు, నృపునియొక్కయు ననుజ్ఞవడసి నిర్నికేతనస్థితిని జెందెద." ఈకథ దొరవారి యూహ కంత ప్రమాణమైనటులఁ గాన్పింపదు

మిత్త్రాదులచేఁ గావింపఁబడిన ద్రోహమో, లేక దుఃఖపరంపరలచేఁ గలిగిన సంసారవిముఖతయో, లేక ప్రపంచంబునఁ బ్రతిదినమున దృష్టంబులగు క్రౌర్యధర్మంబులో, ఇతరుల యన్యాయచర్యలో, తఱచుగ మనుజుని దృతీయాశ్రమమునఁ బ్రవేశింపఁ జేయును. సవతితల్లి వెక్కిరింపులును, పితృప్రదర్శితంబగు నిరపేక్షయు, లేఁబ్రాయంపుధ్రువుని సకలసౌఖ్యస్థానంబులగు రాజప్రాసాదంబులనుండి కష్టభూయిష్ఠంబులగు కాంతారంబులకుం బంపివేసినవి, చిరకాల మిడుములఁ బడిపడి యకుంఠితసామ్రాజ్యముఁ బొందియు నజాతశత్రుండు శాంతిఁ గానక బంధునాశనంబున సంపరితప్తమనస్కుండై యడవులం జేరెను.

ఇటులనే జాతకకథలలోఁ గొన్నికథలు పైఁజెప్పంబడిన కారణములచే సంసారవిముఖతం జెంది తృతీయాశ్రమప్రవేశముం గావించిన వారింగూర్చి యున్నవి. బ్రాహ్మణబ్రహ్మచారి యొక్కరుఁడు, ఆచార్యుని "ప్రపంచమున సంపదలఁ బొందుమార్గం బెద్ది?" అని ప్రశ్నింప, "లోకజ్ఞానము గలయాతఁడు దుష్టమార్గావలంబనను, కపటప్రబంధంబునను, పొందనోపు"నని ప్రత్యుత్తరమిడ; "భిక్షాపాత్రహస్తంబునఁ బూని మనుజుండు నిర్నికేతనుండయి సంచరించిన నీపాపచరిత్రంబుకంటెను" మేలని నుడువుచు సన్న్యాసి యయ్యెను. సుఖములుగాని, కష్టములుగాని ద్విజన్ముల నేకాధికారముననే యుంపక, అన్యసాధారణంబులై ప్రతిమనుజుని జాతిభేదంబు లేక యల్లలాడించుచున్నవి. వ్యథావిరామంబును బ్రతిమనుజుండును గోరుచుండును. సంసారమందు దైనదుఃఖములు మిక్కుటములై దుర్భరంబులైన యట్టివాఁడే జాతివాఁడైనను, సంసారవిముఖుండగుననుటలో వింత యేమియుఁ గన్పడదు. ప్రపంచమున నధికారస్థానముల నధిష్ఠించువారలు గావించు నన్యాయకార్యములు, బలవంతుల దుష్టప్రవర్తనలు, జనులలోఁ గన్పట్టు బీదరికము మొదలగునవి భూతానుకంపఁ గలిగిన సువిచారునకు, ఖేదంబుఁ గలుగఁ జేయును. అట్టివానికిఁ గాంతారవాసంబె శ్రేష్ఠతమం బని తోఁచిన నాశ్చర్యం బేమియును లేదు. కాని సంసారపరిత్యాగముఁ గావించునపుఁడు దుఃఖితాప్తబాంధవులు నిరోధముఁ గావింతురు. "బంధనగరజాతకం" బిందునకుఁ తార్కా

ణంబు. పూర్వము బ్రహ్మదత్తుఁడు వారాణసిని బాలించుచుండినపుడు, బోధిసత్త్వుఁ డొకబీద గృహస్థునికుటుంబమున జన్మించెను. కుమారుండు పెద్దవాఁడగునప్పటికి జనకుఁడు మృతింజెందెను. పుత్త్రుండును వేతనమునకై కొలువు సేయుచు మాతృసంరక్షణఁ గావించుచుండెను. వానిజననియు వానికయిష్టముగనె సువంశజాతయగు నొకకన్నియను వానికి వివాహముఁగావించెను. వివాహమైనకొలఁదికాలములో నాతనిజననిమృతిం జెందెను. ఆతనిపత్నియు గర్భమును దాల్చెను. భార్యగర్భవతియని గుర్తెరుంగక నాతం డొకదినమున నామెతో నిట్లు లనియెను.

భర్త: "దేవీ! ఉద్యోగంబువలన నీ యంతట నీవు జీవించుటకుఁ బ్రయత్నముఁ గావింపవలయు; ఏలనన నేను సన్న్యసింప నున్నాఁడను.

భార్య: "నాథా! నేనుగర్భవతిని. శిశుజననానంతరము వలయును మీరుండి వానిం జూచినతరి సన్న్యసింపుఁడు".

అటులనే యాతఁడు భార్యసుఖప్రసవిని యగువఱకు నుండి శిశుజననానంతరమున నామెతో నిటులఁ జెప్పెను.

"నీవు సుఖప్రసవినివైతివి. కాన నేను సన్న్యసించెదను.

భార్య: "ఓ దేవా! శిశువు పాలుఁద్రాగుట విడుచువఱకును మాత్రమె మీరుండుఁడు"

కొలదికాలములోనె యామె రెండవసారిగర్భముఁదాల్చెను. "నే నామె యంగీకారమునుఁ బడయువఱకును వేచియుండిన నెన్నండును సన్న్యసింపనేరను. కాన నే నామెతో నేమియును జెప్పకుండగనే సంసారమును బరిత్యజించి సన్న్యసించెదను" అని చింతించుకొనుచు, గృహము విడచి చనెను.

విప్రలబ్ధ

కొత్తపల్లి సుబ్బరాయాచార్యులు (సాహిత్యసఖుఁడు)

మలయానిలములు చెలువుగ నొలయఁగ
నలరులనెత్తావులు చెలఁగఁగ
భవనాగ్రోద్యత్ప్రదేశమందునఁ
బ్రవితతముత్సంభ్రమ మెసఁగఁగ.
వెన్నెలవేళను నిన్నాతోటకుఁ
గ్రన్నన రమ్మని కడకిటులఁగ

మోసమొనర్చెను మోహనాంగి! నీ
యాసలు వృథాలౌనటు సేసెఁగ
వయసుదాన! యిఁక వ్యాకుల మేలా?
ప్రియునిం దూఱుట నయమొక్కొ?
రమ్మా! ముద్దులగుమ్మా! యింటికి
వమ్మగ నుండుట వల దచటఁగ.

కాలరథము

కుందూరి ఈశ్వరదత్తు గారు, బి. ఏ.,

['విశ్వభారతి' మాఘమాససంచికయందుఁ బ్రకటింపఁబడిన రవీంద్రుని 'కాలరథము' అను ఏకాంకనాటకమునకు భాషాంతరీకరణము]

నాటకమునందలి పాత్రలు

రాజు	క్షత్రియయోధులు	శూద్రనాయకుఁడు	చారుఁడు
పురోహితుఁడు	ధనపతి-వైశ్యశిఖామణి	శూద్రసంఘము	కవి
మంత్రి	ధనపతి పరివారము	పౌరులు	

(కాలరథము సభికులకు దృష్టిగోచరము కాదు)

రంగము: రాజమార్గము

(ప్రవేశము-కొందఱు పౌరులు)

మొదటి పౌరుఁడు:—(రథము నవలోకించుచు) వృద్ధకాల పిత్రుని రథోత్సవము సమీపించినది. కాని యతని తేరు కదలక స్తంభించినట్లు కనఁబడుచున్నది. కదలనని ప్రతినఁ గైకొనినదా యేమి? అది యేరితప్పిదమో దైవజ్ఞునివలన నా కిదివఱకే తెలిసినది.

రెండవ పౌరుఁడు:—అది యెవ్వరితప్పును గాదు. వృద్ధకాల పిత్రుఁ డలసియుండవచ్చును. అతనికి విశ్రాంతి కావలెను.

మొ-పౌ:—అసందర్భ ప్రలాపము లేల? కాలము తిరుగకున్నచో మనము బ్రదుకు టెట్లు? అదిగో, క్రిందబడి యున్న రజ్జువు నీక్షింపుము. ఏనాఁటి త్రాడు! అసంఖ్యాకులైన జనులు దానిని లాగియుందురు సుమీ! కాని, యెప్పుడు నీవిధముగా నది ధూళియందుఁ బడి యుండలేదే!

మూఁడవ పౌరుఁడు:—తేరు కదలకయుండి, త్రాడు పడియున్న తావుననే యున్నచో నదిమన రాజ్యము యొక్క కంఠము చుట్టును నురిత్రాడు కాఁగలదు.

రెం. పౌ:—అయ్యో భగవంతుఁడా! గుణము చూపఱ కెంత భయంకరముగా నున్నది! చుట్టచుట్టుకొని భుజంగమువలె శిరము పైకెత్తునట్లు తోఁచుచున్నది.

మూ. పౌ:—మూఁడుము. చూడుము. అది కదలుచున్నట్లు కనఁబడుచున్నది.

మొ. పౌ:—రథమును గదల్పకయుంచి దానిగతికి దానిని మనము వదలినచో మన కిక్కట్లు తప్పవని నేను రూఢిగాఁ జెప్పఁగలను.

మూ. పౌ:—అట్లయినచోఁ బ్రపంచకమునందలి పాశము లన్నియు విప్పఁబడుటయే కదా! అప్పుడు రథము మనశరీరములపైనుండియే పోవును. దాని నీడ్చుటకు మనము సహాయము చేయుచున్నాము. కాఁబట్టి యేమనము దానిచక్రముల క్రిందఁ బడుటకు వీలుకలుగుట లేదు. ప్రస్తుతకర్తవ్యాంశ మేమి?

మొ. పౌ:—పురోహితుఁడు రథముపై నాసీనుఁడై మంత్రోచ్చారణము సల్పుచున్నాఁడు. చూడుము.

రెం. పౌ:—అతనిమంత్రములకు స్యందనము కదలదు. పూర్వకాలమునందు సర్వమును బురోహితాధీనమైన యపుడు, ఆచార్యుఁడే ప్రథమమున రథమును లాగవలసియుండెను. ప్రస్తుత మతనిమంత్రములచే నాకార్యము ఫలించునా? మంత్రములకుఁ జింతకాయలు రాలుకాలము గతించినది.

మొ. పౌ:—స్నేహితుఁడా? లాగుట కిదివఱకే వారు ప్రయత్నించిరి. కాని విఫలమనోరథులు కావలసినవారైరి. ప్రత్యూషముననే పురోహితు లందఱి కన్న ముందుగ మేలుకొని, పెందలకడనే పోయి, దానిని

లాగుటకు వారిశక్తిసామర్థ్యములన్నియు వినియోగించిరి. వెలుతురువచ్చి జనులు లేచువేళ కాపనిని జాలించుకొని మంత్రపఠన కారంభించిరి. కలియుగమునందు విప్రులకు బలమున్నదని నీవు తలంతువా?

మూ. పౌ:—సరి సరి, రజ్జువు యుగాంతరరక్తనాళమువలె కొట్టుకొనుచున్న దేమి?

మొ. పౌ:—ఒకఘనపుణ్యమూర్తిహస్తస్పర్శముచేఁగాని స్యందనము కదలుజాడ నాకుఁ గనఁబడదు.

రెం. పౌ:—అట్టి ఘనపుణ్యమూర్తి యవతారమునకై మనము వేచియుంటిమా పుణ్యకాలము గడచిపోవును. అల్లుఁడు వచ్చువఱకు నమావాస్య యాఁగునా? ఇఁకఁ బాపాత్ములమైన మనబోఁటిసామాన్యజనులగతి యేమి?

మూ. పౌ:—భగవంతునకుఁ బాపాత్ములజోలి యవసరము లేదు.

రెం. పౌ—ఏమీ? ప్రపంచము పుణ్యజనులకుమాత్రమే నిర్దేశింపఁబడినదా? అట్లయినచో మన మేగంగలో గలియవలెను? సృష్టి సామాన్యజననికాయముకొఱకే యని యెఱుంగుము. పుణ్యజను లప్పుడప్పుడు జన్మించి పోవుచుందురు. మనయొత్తిడిఁ దాళఁజాలక గగనగహ్వరములకుఁ బాఱిపోదురు.

మొ. పౌ:— వృద్ధుఁడా? నీవు రథమును లాగుటకు యత్నింపఁ గూడదా? అది కదలునో, నీముక్కుచితుకునో చూచెదము.

నాం. పౌ:—పుణ్యమూర్తులకును మనకును గలవ్యత్యాసమేమియన: వార లొకరిద్దఱు, మనము బహుసంఖ్యాకులము. మనము సంఘీభావము కలిగి పౌరుషముతోఁ బనికిఁ గడంగితిమా, రథము శీఘ్రముగాఁ బఱుగెత్తఁగలదు. మన కైకమత్యము లేనిచో దానిని కదల్చు టెట్లు? అప్పుడు మనము నివ్వెఱగందె, వింత పురుషునియొక్కనికై నిరీక్షింతుము.

మూ. పౌ:—త్రాడు కదలుచున్నది, మీరు బహుజాగ్రతతో మాట్లాడవలెను.

మొ. పౌ:-ప్రభాతసమయమున నొక్కసుముహూర్తమునందుఁ బురోహితుఁడు లాగవలెననియు, పిమ్మట నృపతి లాగవలెననియు శ్రుతులయందు వ్రాయఁబడినది. వారిరువురు నపజయము గాంచిరి. ఇఁక మూఁడవవా రెవ్వరు?

(ప్రవేశము: క్షత్త్రియయోధులు)

మొదటియోధుఁడు:—సిగ్గు! సిగ్గు! ప్రభువు స్వయముగా వటిని లాగుటయు, మనమందఱము వేలకొలఁది వచ్చి తోడ్పడుటయు, రథాంగములు కొంచెమైనను కదలకుండుటయు నా?

రెండవయోధుఁడు:— సఖా! మనము క్షత్త్రియులము కామా? శూద్రులవలె పశువులము కాము. మనము స్యందనారోహులము. రథమును లాగుట మనవృత్తి కాదు.

మూఁడవయోధుఁడు:— లేక పోయినచో మనవృత్తి శతాంగమును బగులఁగొట్టుట కాబోలు! గండ్రగొడ్డలిని గైకొని దానిని ముక్కముక్కలుగఁ జేయుటకు నాహస్తము తొందఱపడుచున్నది. వృద్ధకాలపిత్రుఁ డేమిచేయఁగలఁడో చూచెదను!

మొ. పౌ:—శూరుఁడా! నీవుధరించు ప్రహరణములు రథమును గదల్పుటకుఁగాని, ఛిద్రము చేయుటకుఁగాని వినియోగపడవు. దైవజ్ఞుఁ డేమివచించెనో నీవు వినియుంటివా?

మొ. యో:—ఏమిచెప్పెను?

మొ. పౌ:—మఱల నీకలికాలమందుఁ ద్రేతాయుగమునందలికథ నడచుచున్నదని.

మొ. యో:— త్రేతాయుగమునందు మర్కటములు లంకను బరశురామప్రీతి గావించుటయా?

మొ. పౌ:—అది కాదు.

రెం. యో—శ్రీరాముఁడు వాలిని జంపుటయా?

మొ. పౌ:—సరికి బారెఁ డెచ్చుతక్కువగఁ జెప్పితివి. ముక్తిని బడయుటకై శూద్రుఁ డొక్కఁడు ఘోరతపమును గావించెనన్నసంగతి జ్ఞాపకమున్నదా? రఘురాముఁ డాశూద్రుని శిరమును ద్రుంచిన తరువాతనే కదా వృద్ధకాలపిత్రుని కోపానలము చల్లారినది?

మూ. యో:—ఇప్పు డాభయము లేదు. మహీసురులే జపతపసంధ్యానుష్ఠానముల వదలివేసి నప్పుడు, శూద్రులమాట తలపెట్టు టెందులకు?

మొ. పౌ:—మనశూద్రసోదరులలోఁ గొందఱు రహస్యముగా బురాణేతిహాసములఁ బఠించుట కారంభించిరి, అది కనిపట్టి 'ఇదియేమి పాప?' మని యడిగినచో, 'మేమమాత్రము మనుష్యులము కామా?' యని ప్రత్యుత్తర మిత్తురు. ఈనాస్తిక యుగము నందలి దుర్బుద్ధిదయ్యమే వారల నింతపనికిఁ దెచ్చినది. కాలపురుషుఁడు మతిమంతుఁడు కాఁబట్టియే రథమును గదల్పకున్నాఁడు. కర్మముచాలక యది కదలినచో సూర్యచంద్రులు, భూమి దానిచక్రముల క్రిందఁ బిండిపిండి కావలసినదే! ఒక్కటిచూడుము. శూద్రుఁడు తన యురముపైఁ గరముపైచి నేనుగూడ 'నరుఁడ' నని చాటుచున్నాఁడు. ఈశ్వరా! ముందేమి విపరీతములు కలుగనున్నవో?

మొ. యో:—ఈదినమున శూద్రుఁడు వేదమును జదువుట కారంభించును. మఱునాఁడు బ్రాహ్మణుఁడు కృషీవలుఁడు కావచ్చును. అప్పుడు వినాశము సంభవించును.

రెం. యో:—రా, రమ్ము. యుద్ధసన్నద్ధులమై శూద్రనివాసస్థలికిఁ బోదము. ఎవ్వరు బలవంతులో వారికిఁ దెల్పెదము.

మూ. యో:—ఎవ్వరో భూపతిసన్నిధికిఁ జని, కలియుగమునందు శాస్త్రములుగాని శస్త్రములుగాని పని చేయవనియు, నంతయు ధనమూలమనియుఁ జెప్పిరి. కావున నృపతియు వణిగ్వరుఁడైన ధనపతికి వర్తమాన మంపెను. వారందఱికిని ధనపతివల్లఁ గాని రథము కదలదని నమ్మకము.

మొ. యో:—స్యందన మొక్కవైశ్యునిశక్తిచేఁ గదలినచో మనశాస్త్రాస్త్రములన్నింటిని గంతములకుఁ బగిలించుకొని గంగలో దిగవలసినదే.

రెం. యో:—ప్రస్తుతము మనము రోషావేశులమైనచోఁ గార్యమేమైనఁ గలదా? వైశ్యుల కిప్పుడు గురుఁడు పదునొకటవస్థానమున నున్నాఁడు. సమస్తనిశ్శింజినియైనను అతనిహస్తస్పర్శమునకు టంకారధ్వని నిచ్చును.

మూ. యో:—అదిసత్యమే. క్ష్మాపతిసలితము ముందు నతనివెనుక వైశ్యుఁడు నెప్పుడు నున్నవిషయమే.

మొ. యో:—సరియే. ఆర్యుని వెనుకనే యుండనిమ్ము. మనము భూపతి కిరుప్రక్కల వరుసలుదీరి నిలువఁబడియుండెదము. అప్పుడు ఈజయభేరీమృదంగాది మంగళతూర్యారావంబులు మనకే చెల్లునుగదా?

మూ. యో:—కావచ్చును. కావచ్చును. కాని వెనుక నున్నవాఁడే సుతియిచ్చువాఁడు.

ప్రవేశము: ధనపతి పరివారము

మొ. యో:—ఎవ్వరో దయ్యములవలెఁ దోఁచుచున్నది!

రెం. యో:—వారి రత్నద్యుతులు మిడుతలవలె నెగిరి మనకండ్లలోఁ బడుచున్నవి!

మూ. యో:—వారి కంఠముల వ్రేలాడు ప్రాలంబికములఁ గనుము. సంకెళ్లవలె నున్నవి.

మొ. పౌ:—వారు ధనపతిపరివారము. వారు మనకాలపురుషుని దమ సువర్ణశృంఖలములచే బంధించిరి. అందుచేతనే కదా తేరు కదలుటలేదు!

మొ. యో:—(భృత్యులతో) ఎందునిమిత్తము మిటకు వచ్చిరి?

మొదటిభృత్యుఁడు:— రాజుగారు మాప్రభువైన ధనపతికొఱకు వర్తమాన మంపిరి. ఎవ్వఁడును రథమును గదల్పకుండుటచే నతనివలన నాపని యౌనని యందఱును దలంచుచున్నారు.

రెం. యో:—'వారందఱు' ఎవ్వరు? వారట్లు తలపోయుట కవసర మేమివచ్చినది?

రెండవభృత్యుఁడు:— ఈదినములలో నడచువ్యాపారమంతయు మాయజమానుని హస్తముమీఁదుగనే కదా సాగుచున్నది?

రెం. యో:—ఖడ్గము మాత్రము, మాకరములందే తిరుగుననియు, నతనిహస్తమునందుఁ దిరుగదనియుఁ జూపెదను.

మూఁడవభృత్యుఁడు:—నీవేయి త్రిప్పెదువా రెవ్వరో నీకుఁ దోయనట్లు పలికెద వేమి?

మొ. యో:—అనాగరికుఁడా! నోరు మూయుము.

రెం. భృ:— నోరుమూయవలసివచ్చినచో మూసెదను. మాయధికారస్వరమే ప్రస్తుతము పంచభూతముల యందును బ్రతిధ్వనించుచున్నదని నీవెఱుఁగవా?

మొ. యో:—ఏమీ మీస్వరమా? మాశతపనశతఘ్నిగర్జించునప్పుడో?

రెం. భృ:—ఆగర్జనమే మాయాజ్ఞ నొకపణ్యస్థలమునుండి మఱియొకపణ్యస్థలమునకుఁ గొనిపోవుచున్నది.

మొ. పౌ:—వానితో వృథా కలహమేల? మీరు వారిని గెల్వలేరు.

మొ. యో:—ఏమీ? మఱియొకసారి పల్కుము.

మొ. పౌ:—మీకృపాణముల మీయొరలో నుండి తీసిన వెంటనే, వానిలోఁ గొన్నింటిని వారిలంచములఁ దిన్నవానిని, కొన్ని వారితిండితినినవానిని జూతువు.

మొ. భృ:— నర్మదాతీరమునుండి యొక యతిపుంగవుని దీసికొనివచ్చిరనియు, నతఁడే యీశతాంగమును గదల్చుటకుఁ బ్రయత్నమొనర్చెననియు విని యున్నాము. దానిఫల మేమైనదో యేరికైనను దెలియునా?

రెం. భృ:—నాకుఁ దెలియును. వారతనిగుహకుఁబోవువేళ నతఁడు పద్మాసనము వైచికొని కూర్చుండి సమాధిలో నుండెనట. అంతట వారతనికిఁ దెలివి వచ్చునట్లు చేయుటకై, యతనిఁ ద్రోసియు గుంజియు విఫలమనోరథులైరి.

మూ. భృ:—అరువదియైదేండ్లనుండి దీక్షగా గాలికదల్పక కూర్చుండుటచేతఁ గాబోలు' కాని యతఁడేమి చెప్పెను?

రెం. భృ:—అతఁడేమియుఁ జెప్పనులేదు; చేయనులేదు. అతఁడు మాట్లాడు పాపము కట్టుకొనవలసియుండునని నాలుకను గోసికొనెనట. అతఁడు మూల్గుటనుమాత్రము ప్రారంభించెను. ప్రతివారును నొక్కొకమూల్గునకుఁ బ్రతియొక యర్థమును గ్రహించిరి.

మొ. భృ:—తరువాత?

రెం. భృ:—వారతనిని పైకెత్తి మోసికొని వచ్చిరి. అతఁడును స్యందన శల్యమును స్పృశించినంతనే తేరు భూమిలోఁ గ్రుంక నారంభించెను.

మూ. భృ:—అయ్యో, తనమనమునువలెనే కాలరథమును గూడఁ బాతాళములోనికిఁ గొంపోవ నుంకించెనా?

మొ. భృ:—కాదు. అరువదియైదేండ్ల నిరంతరోపవాసభారము రథాంగములకుఁ గష్టముగఁ దోఁచెనేమో! అంతదూరమెందులకు? మన మొక్కనాఁడుపవాస ముండినఁ గాలు కదల్పలేముకదా.

మూ. పౌ:—భారములసంగతి మాట్లాడెదవు. మీ గర్వభారము మాత్రము వికృతముగా నున్నది.

రెం. పౌ:—ఆగర్వభారమే తనంతట తానఁగఁద్రొక్కఁగనునది. (భృత్యులతో) మీరు తొందరపడెం దుకుఁడు. మీధనపతికి గర్వభంగము కాఁగలదు.

మొ. భృ:—సరియే, మూచెదము; కాలపితృని భోజనసామగ్రి యెవ్వరు సమకూర్తురో? సమకూర్పనిచో రథము నిలుచుండినను బరుగెత్తినను నొక్కటియే. కడుపునిండినఁ గదా దినములు గడచుట!

ప్రవేశము.

మంత్రి - ధనపతి.

ధన:—మంత్రివర్యా! ఏల నన్నిటకు రమ్మని యానతిచ్చిరి?

మంత్రి:—రాజ్యమున క్షేమిక మంత వచ్చినను విముక్తుల నేకదా ప్రప్రథమమునఁ బిలువవలసియున్నది?

ధన:—వలయుసామగ్రి యేదియైన నున్నచో సెలవిచ్చిన యెడల సిద్ధపఱచెదము. ప్రస్తుతమున్న విపత్తు తొలంగునెట్లు?

మంత్రి:—రథము కదలలేదని నీవెఱుఁగుదువుగదా?

ధన:—వినియున్నాను; కాని ఆవిషయము చాలకాలమునుండి.

మంత్రి:—పురోహితులయధీనమునం దున్నవిషయమే నెఱుంగుదును. పూర్వకాలమునందు వారు స్వసామర్థ్యముచేతను స్వకాయకష్టముచేతను నభివృద్ధిగాంచుటయేకాక దేశవర్ధనమునకై గూడఁ దోడ్పడిరి. ప్రస్తుతము వారు నిద్వారముకడ సుస్థిరముగా గూరుచుండిరి. పోమన్నఁ బోరు; వారు పోరు సరిగదా, ఇతరులను బోవునట్లు చేయరు.

ధన:—అదిగాక భూపతియు, నతనిమంత్రులు, సైనికవర్గముకూడ నుండిరి వారలు ఒక్కొకనివంతుగఁ ద్రాళ్లను లాగెడివారు. కావుననే దినములు సుఖముగఁ గడచుచుండెను. మేముమాత్రము చక్రములను శుభ్రపఱచెడివారము. నన్నే పనియందైనను నియోగించుట కిదియే ప్రథమతరుణము.

మంత్రి:—ఆర్యవర్యా! మాడుము. ఈరథము కదలుటయే మనలనందఱిని శోధించుటకు ముఖ్యప్రమాణము.

దాని నాక్రమములు కదలుటయే ప్రపంచ మిప్పుడు ఎవ్వరి ప్రాజాపత్యముక్రింద నున్నదో విశదము చేయును. పురోహితుఁడు నాయకుఁడుగా నున్నపుడు రాజు నాయకుఁడుగా నుండెను. అప్పుడు తేరు వారు చెప్పినట్లు నడచుటయే కాక నిద్రనుండి మేల్కొలుపఁబడిన మృగరాజువలె దుముకుచుండెను. ప్రస్తుతము వారి వల్ల నేమియుఁ గాకుండెను. అనఁగాఁ గలమును, ఖడ్గమునుగూడ త్రుప్పుపట్టెను. నాయకత్వము మీచేతికి వచ్చెను. ఆహస్తములే త్రాళ్లను బలపఱచవలెను.

ధన:—సరెయే. ముందుగ నాపరివారము ప్రయత్నించును. రథ మేమాత్రమైనను చలనము చూపినయెడల, నేను వారికిఁ దోడ్పడెదను. కానియడల నింతమందిలో నా కప్రతిష్ఠ చేకూరఁగలదు.

మంత్రి:—ఆర్యవర్యా! అట్లయినచో వేగముగా వారిని దొందఱ పెట్టవలెను. రాజ్యమంతయుఁ గటికోపవాస ముండి, నీకొఱకు కాతురతతో వేచియున్నది. స్యందనము దేవసదనమును సమీపించినఁగాని యెవ్వరును భోజనములు చేయరు. అదియుఁగాక, నీవుకూడ యత్నమొనర్పుము. జయముఁగాంచనిచో వచ్చిన యపకీర్తి యేమి? భూపతికిని బురోహితునకును వచ్చిన యవమానముకంటె నెక్కువలో నిది కాదు.

ధన:—వారు మాకుఁ బైవారు. మేము వారికిఁ గ్రిందివారము. లోకము మమ్మొకరీతిగను, వారల వేఱొకరీతిగను విమర్శించును. రథము కదలకున్నచో నన్నవమానింతురు. కర్మము చాలక నది కదలనిచో నా పని మట్టమయినట్లే. నాయపృష్టమును ఎవ్వరును సహింపరు. ప్రతివాఁడును దాని నెట్లయినను సంగ్రహించుటకుఁ బన్నుగడలు పన్నుచుండును.

మంత్రి:—నీవు వచించినదంతయు సత్యమే. రథ మెట్లయినను గదలునట్లు చేయవలెను. ఆలస్యము చేసినచోఁ బ్రజలు మనపై దాడి వెడలుదురు.

ధన:—సరియే ప్రయత్నింతముగాక! అదృష్టవశమున జయముఁగాంచినచో నది నాకు విషాదమూలముగాకుండుఁగాక!

(పరివారముతో) భృత్యులారా! మనము కార్యసిద్ధికై మనఃపూర్వకమైన ఉత్సాహమును బ్రకటింతము, రండు.

పరివారము:—జయసిద్ధి! జయసిద్ధి!

ధన:—మన కులదేవత, సిద్ధి!

పరివారము:—జయసిద్ధి! మన కులదేవత!

ధన:—ఆఁగుఁ డాఁగుఁడు. ఈ త్రాటని లాగుటయటుంచి నిచ్చి, దానిని బైకెత్త లేకపోతిని. ఆగ రథమంతి బరువుగానున్నది. ఇది మనుష్యమాత్రునిచే నయ్యెడు కార్యముగాదు.

(భృత్యులతో) రండు; మీరందఱును రండు; ధనాగారాధిపతి యెచ్చటనున్నాఁడు? మీరందఱునుగలసి మఱియొక్కసారి ప్రయత్నింపుఁడు. జయసిద్ధి! జయసిద్ధి! భృత్యవరులారా! హుషార్- ఇఁకఁ గార్యము లేదు. త్రాడు నిమిషనిమిషమునకు బిగిసిపోవుచున్నది.

(అందఱును 'సిగ్గు'. 'సిగ్గు' అని కేకలు వేయుదురు)

మొ.యో:—బ్రతికిపోతిమి. మన మర్యాద దక్కినది.

ధన:—కాలపిత్రుఁడా! నీకువందనము. నీవు నిజముగా మాయందు కరుణార్ద్రచిత్తుఁడవు. కనుకనే నీవు కదలలేదు. నీవు మాహస్తములవలననే కదలనిచో నీవు మా వక్షములపై నుండిపోయి మమ్ముల పిండిచేసియుండెడి వాఁడవు.

భృత్యులు:—అయ్యో! యజమానుఁడా! నేఁటివఱకును దినదినప్రవర్ధమానమగుచున్న మన గౌరవము నేఁటితోఁ దగ్గిపోయెనుగదా!

ధన:—మూఢులు; ఇంతవఱకును ప్రజాబాహుళ్యము కంటఁబడకుండ, నీచంచలరథచ్ఛాయక్రిందఁ గ్రమక్రమముగా ముందునకు వచ్చి యభివృద్ధిగాంచుచుంటిమి. ప్రస్తుతము రథమున కెదురుగా వచ్చుటచేత మన మందఱకండ్లఁ బడితిమి. అప్పుడే పండ్లఁ బటపటఁ గొఱుకుచున్నారు. ఇఁక రథము నే నడపుభాగ్యము పట్టినచో మనకు దినములు చెల్లెనని యెఱుంగవలెను.

మొ. యో:—(ధనపతితో) పూర్వకాలమునం దీపరాజయమునకు మీతలలు మీభుజములపైనుండక పోవలసినదే.

ధన:—అనఁగా మీచేతులకుఁ బని తగిలియుండెడిది. ఖండించుటకు శిరఃప్రకరంబులు లేకపోయినను, వృథా మృషావాక్యము లేలయాడెదరు?

మొ. యో:—ప్రభువుమాట యటు లుండనుంచి, కాలపిత్రుఁడే మీ ప్రియభృత్యుఁడు గాకుండనిచో నీకుఁ దగిన ప్రత్యుత్తర మిచ్చియుండును.

ధన:—పరికించి చూచినయెడల మే మింతపవిత్రశరీరులము కాకపూర్వమే మా కెక్కుడు సుఖముండెడిది. ప్రస్తుతము మనకెత్తిపెట్టఁబడిన యీసేవకావృత్తియే మనమరణమునకుఁ గారణము గాఁగలదు. అమాత్యవర్యా! ఏల విషాదాయత్తచిత్తుండ వైతివి?

మంత్రి:—మనము కడపటి యత్నముఁగూడ నొనర్చి పరాజయము గాంచితిమి. పునఃప్రయత్నమునకే మార్గమును లేకుండుటచే నేమియుఁ దోఁచుట లేదు.

ధన:—విచారపడకుఁడు. ప్రస్తుతము మీరు ప్రయత్నాంతరములన్నియు వినియోగించి విఫలమనోరథు లగుటచే, కాలపురుషుఁడే తనప్రయత్నముఁ దానుజేసుకొనును. అయినఁగాక, మన కొఱకై కాదుగదా యాతఁడు కదలుచుండుట? అతని స్వప్రయోజనముకే యాతఁడు కదలుచున్నాఁడు. కాలపురుషుని యుచితాశ్వములే, యతని యాజ్ఞాపించినను నలుదిక్కుల ప్రవాహ నప్పుడు పరుగెత్తికొని వచ్చును. ప్రస్తుతము తెరమఱుగుననున్నవారే యప్పుడు ముందునకు వత్తురు. ఇంతలో ధనాగారమునకుఁ బోయి దానిని సరియైన క్రమమునం దుంచెదను. ధనాగారాధ్యక్షా! రమ్ము పోదము. మొదట గదికి రెండుతాళములు బిగింతము. ఆలస్యము చేయఁగూడదు.

(ధనపతి, పరివారము నిష్క్రమింతురు)

ప్రవేశము: చారుఁడు.

చారు:— మంత్రిపుంగవా? శూద్రనివాసస్థలమునందు గొప్ప సంక్షోభము కల్గినది.

మంత్రి:—సంక్షోభమునకుఁ గారణమేమి?

చారు:—వారలందొక కోకటి యుబుకు వచ్చుచున్నది. కాలపిత్రునిరథము మేమీడ్చెదమని పల్కుచున్నారు.

అందఱును:—ఏమీ? వారలను మోఁకులను ముట్టకొన నిచ్చువా రెవ్వరు?

చారు:—వారల నడ్డుపెట్టువా రెవ్వరని పల్కుఁడు.

యోధులు:—భయము లేదు. మేము కాపాడెదము.

చారు:—మీ రల్పసంఖ్యాకులు. వారలఖండించునప్పటికి మీకరవాలములవాఁడిమి పోఁగొట్టుకొనియెదరు. ఇంకను వేలకొలఁది యుందురు. మీరు రథముసమీపమున నిలుచుటకైనను తావు లేకపోవును. మంత్రిపుంగవా! ఏల మీశరీరము కంపించుచున్నది?

మంత్రి:—వారేమిరైనఁ జేతురని కాదు నాకుఁ గల్గుచున్న భయము.

చారు:—ఇఁక భయమేల?

మంత్రి:—వారలు జయము గాంతురని.

యోధులు:—అమాత్యవర్యా! ఏమని పల్కుచున్నారు? వారలు రథమును లాగెదరనియా! ఘనపాషాణము వారినిధిపైఁ దేలునా!

మంత్రి:—కాని వారు జయమే కాంచినచోఁ బరమేశ్వరుఁ డొక్కనూతనవిధానమును లోకమునందుఁ బ్రవేశపెట్టుచున్నాఁడని ప్రస్ఫుటము కాదా? నట్టిల్లు (Ground floor) గృహోపరిభాగ(Top floor)మైనచో మహాప్రళయ సూచకము కాదా? మహాభయంకరభూకంపమనఁగా నేమి? భూగర్భమునందు జరుగు విషయమే కదా? కాలచక్రమునం దొకనూతనయుగము ప్రారంభమయ్యె ననఁగా, ఏది యిదివఱకు గూఢమై, ప్రచ్ఛన్నమై యుండెనో, యది బహిర్గతమై ప్రకాశమాన మగుటయే కదా?

యోధులు:—మనుష్యుల నేమియొనర్పఁడని యానతిచ్చెదరు? సెలవిండు. ప్రపంచమునందు మాకడ్డువచ్చునది యేదియును లేదు.

మంత్రి:—ఇట్టి మననిర్భయాడంబర ప్రకటనమోహమే, మన మహాభయంకర సమస్యలఁ గల్పించుచున్నది. ప్రాణపరిత్యాగమునకైనను సిద్ధపడి వచ్చిన యిట్టిసైనికసమూహమైనను గాలప్రవాహమును నిరోధింపఁగలదే?

చారు:—అమాత్యా! అట్లయినచో మీయుపదేశమేమి?

మంత్రి:—నిరోధము గల్పకుండుటయే యుత్తమపద్ధతి. ప్రతిబంధము లెప్పుడు నంతర్గత మహాశక్తిని బ్రజ్వలింపఁజేయును. అట్టి మహాశక్తియే తనయునికియుఁ జనబలమును దానుపత్తించినచో నిఁక మనము గంగలోఁ గలయవలసినదే.

యోధులు:—అట్లయినచో మేము ప్రక్కల నిలువుండి, వారిని రానియ్యవలసినదేనా?

చారు:—అదిగో, వారప్పుడే సమీపించుచున్నారు.

మంత్రి:—మీరేమియుం జేయవలదు. నిశ్శబ్దముగా నుండుఁడు.

ప్రవేశము : శూద్రవర్గము

మంత్రి:—(శూద్రనాయకునితో) నాయకుఁడా! మిమ్ముల నందఱిని జూచుటకు నాకు సంతోషముగా నున్నది.

శూ. నా:—సచివపుంగవా! మేము కాలపిత్రుని స్యందనమును నడపించుటకు వచ్చితిమి.

మంత్రి:—అదియే మీరెప్పుడును జేయుచున్నారు. వ్యవహారమునకు మాత్రము మే మిచ్చట నుందుము. అది నాకుఁ దెలియదా?

శూ. నా:—ఇదివఱకును మేము రథాంగముల క్రింపఁబడి పనిచేయుచుంటిమి. దానిగమన మెప్పుడును మాఖండిత శరీరములపై నుండినే. ప్రస్తుత వేళలో కాలపిత్రుఁడు మాపూర్వస్వార్థత్యాగమునకు సమ్మతించుటలేదు.

మంత్రి:—ఓహో! తెలిసినది. ప్రభాతకాలమున వందలకొలఁది మీరందఱును రథము క్రిందనున్న ధూళియందు పొర్లాడుచుంటిరి. సంతోషధ్వానములతోఁ జక్రములు పూర్వమువలె మీపైనుండి పోలేదు. చక్రముల యాఁకలి చచ్చెనుకాబోలు. అట్టియశుభసూచకమైన మౌనమే మమ్ముల భయపెట్టుచున్నది.

శూ. నా:—మార్గమును జక్కపఱచుటకుఁ గాలపిత్రుఁడు మమ్ముల నీదినమునఁ బిలువలేదు. అతనిరథగణములను లాగుటకుఁ బిల్చెను.

పురోహితుఁడు:—ఓహో! అది నీ కెట్లు తెలిసెనో చెప్పఁగలవా?

శూ. నా:—ఈసంగతు లెట్లు తెలియునో యెవ్వరికిని దెలియదు. కాలపిత్రుఁ డాబాలగోపాలమును రమ్మని యాజ్ఞాపించెనని సూర్యోదయము నుండియు జనప్రవాద మొక్కటి పుట్టినది.

ఒకయోధుఁడు:—మీరక్తమును జీల్చుటకు రమ్మనెనా?

శూ. నా:—కాదు; రథమును నడపుటకు.

పురో:—కుమారా! ఒక్కసంగతి యాలోచింపుము. కాలపిత్రునిరథశుల్బములు ప్రపంచము నుద్ధరించెడి వారిహస్తగతము చేయఁగూడదా?

శూ. నా:—స్వామీ! ప్రపంచమును నడపువారు మీరే యని మీరు నిజముగా నూహింతురా?

పురో:—కాలము విపరీతముగా నున్నదని నాకుఁ దెలియును. ఎవ రెట్లుచెప్పినను, ఏవి యెట్లుజరిగినను, మేము బ్రాహ్మణులము కామా?

శూ. నా:—(మంత్రితో) గౌరవనీయులైన మీరా ప్రపంచమును నడపుటకు హక్కుకలవారు?

మంత్రి:—ప్రపంచము మీతో నున్నది. మీగమనమునకు మీరలే కారకులు. మేము బుద్ధిమంతులము కాఁబట్టి మిమ్ముల నడపుచున్నామని మేము నటింతుము. మీరు లేకుండినచో నల్పసంఖ్యాకులమైన మేము బ్రదుకఁగలమా?

శూ. నా:—మీసంఖ్య యటులుండనిచ్చి, మేము లేకుండ మీరు జీవించఁగలరా?

మంత్రి:—అవునవును.

శూ. నా:—మే ముత్పత్తిని జేయుచున్న యాహారమును దిని మీశరీరములఁ బోషించుకొనుచున్నారు. మేము నేయుచున్న బట్టలను గట్టుకొని మీహోదాను నిలువఁబెట్టుకొనుచున్నారు.

ఒకయోధుఁడు:—ఏమీ, యీసాగరుఁ బోతుతనము! ఇది వఱకును జేతులు మోడ్చి 'అయ్యా! మీరే మాకుఁ దినుటకుఁ గూడును, కట్టుటకు గుడ్డయు నిచ్చుచున్నారు' అని పలుకుచుండి, యిప్పుడీవేషముఁ దాల్చుచున్నారా? ఇట్టి చర్యలు మాదగ్గఱ పనికిరావు.

మంత్రి:—(యోధులతో) మాట్లాడకుఁడు (శూద్రనాయకునితో) అవును నిజమే నీకొఱకై మే మిచట వేచియున్నాము. మీరే కాలోచితతురంగములని యూహింపకొన లేనంతటి మూర్ఖుల మనుకొంటివా? పోయి నీపని నీవుచేయుము. అప్పుడు మేము చేయునది మేము చేసెదము

శూ-నా: సోదరులారా! రండు, మనఃపూర్వకముగ కార్య మొనర్పుఁడు. మనము చచ్చినను, బ్రతికినను, రథమును గదల్పవలెను.

మంత్రి:—నాప్రియ నాయకుఁడా! మార్గమును వదలిపోకుఁడు. రథము పూర్వమువలె రాజమార్గముమీఁదుగనే ప్రయాణము చేయవలెను. మీరు కుడిప్రక్కకు మఱలిన ట్లున్నది. చూడుము.

శూ. నా:—మేము గట్టివారలము. కుడిప్రక్కయు నెడమప్రక్కయు మాకుఁ దెలియదు. అది సారథిపని. మీరందఱును రండు. రథముపై ధ్వజ మెట్లు కదలుచున్నదో చూచితిరా? అదియే కాలపిత్రుఁడొసఁగిన సంకేతము. రండు. బలముతో నీడ్చుఁడు.

పురో:—అయ్యో! త్రాటిని స్పృశించిరే! ఎంత పాప కర్మము పట్టినది!

పౌరులు:—అయ్యో!. ఎంతటి గర్హ్యమైన కార్యము.

పురో:—బిడ్డలారా? మీరు కన్నుల మూసికొనుఁడు. కాలపిత్రుఁడు కోపానలమును గ్రక్కుచు వారిపైఁ బడునప్పుడు, మీదృష్టి యతనిపైఁ బ్రసరించెనేని, మీరుఁగూడ దగ్ధము కాఁగలరు.

ఒకయోధుఁడు:—ఏమి? చక్రములు గర్జించుచున్నవా? లేక యాకాశము నిరాశచే మూల్గుచున్నదా?

పురో:—అది కాదు.

పౌరుఁడు:—అవునవును. రథము కదలుచున్నది.

యోధులు:—అదిగో ధూళి పై కెగయుచున్నది! ఎంత దోష మెంత దోషము! రథము కదలుచున్నది! ఎంతపాప మెంతపాపము!!

శూద్రులు:—జయము! జయము! కాలపిత్రునికి జయము!!

పురో:—నాపాపము బ్రద్దలుకాను! రథము నిజముగా నడచుచున్నది.

యోధులు:—అయ్యా! మీరు మాకాజ్ఞ నీయుఁడు. అల్లరిమూక పైఁబడి వారొనర్చుపాపకార్యమును దుడమట్టించెదము.

పురో:—నేను సాహసింపను. కాలపిత్రుఁడే, వర్ణభేదమును బాటింపనప్పుడు, మనయాజ్ఞ లేమియు నతని పశ్చాత్తాపచిత్తుని జేయఁజాలవు.

యోధులు:—అట్లయినచో మనయుద్ధపరికరములఁ బాఱవేయుదము.

పురో:—నేనుగూడ నావేదములను బాఱవేసెదను.

పౌరులు:—మనము రాజ్యమును విడచి వలసపోవుదము. మంత్రివర్యా! నీ వెక్కడికిఁ బోయెదవు?

మంత్రి:—నేను వారికి సాయము చేయఁబోయెద.

పౌరులు:—నీవా? వారలతోఁ గలిసెదవా?

మంత్రి:—అప్పుడు కాలపిత్రుని కనుగ్రహముకల్గును. శూద్రులతనిదయకుఁ బాత్రులైరని మీకు స్పష్టము కాలేదా? ప్రస్తుతము జరిగినవిషయము కలగాని కల్లగాని కాదు. నేఁడు మనగౌరవము వారితో నున్నది. కాకపోయినచో మన కగౌరవము నిశ్చయము.

యోధులు:—వారిస్పర్శచే నపవిత్రమైన త్రాటిని మీరు స్పృశించుదురా? అది యెప్పుడును భగవదుద్దేశ్యము కాదు. మనము వారిని దండించవలెను. మాపై న్యాయమునంతటిని సమకూర్చుటకు మేము పోయెదము. రథము నాఁపనిచో నది రక్తప్రవాహములోనుండి తప్పక నడచును.

పురో:—నేను మీతో వచ్చెదను. మీకాలోచనచెప్పుటకైన నుపయోగపడెదను.

మంత్రి:—మీరు వారల నడ్డుపెట్టలేరు. రథాంగముల క్రిందఁ బడి ప్రమగ్గుటకు మీవంతు వచ్చినది.

యోధులు:—పోనిండు చాలకాలమునుండి నీచులరుధిరముచేఁ గాలపిత్రుని రథాంగములు అపవిత్రము కావింపఁబడినవి.

పురో:—మంత్రివర్యా! చూడుము, చూడుము. రథము రాజమార్గమును వదలి సౌధములలోనికిఁ బరుగెత్తుచున్నది. ఏగ్రామము ధ్వంసముకానున్నదో ఆపరమాత్మునికిఁ దెలియవలెను.

యోధులు:—ధనపతి పరివారము కేకలువేయుచున్నట్లున్నది. మన సాహాయ్యమునకై పిల్చుచున్నట్లు తోఁచుచున్నది. (ఈ)రథ ధనాగారమున కెదురుగఁ బోవుచున్నట్లు కనఁబడుచున్నది. తప్పించుఁడు, తప్పించుఁడు.

మంత్రి:—మీ తనువుల మీరు రక్షించుకొనుఁడు. తరువాత నితరుల రక్షించుట యాలోచింపుకొనవచ్చును. రథమాయుధశాలవైపు పోవుచున్నదేమో యని నాకనుమానము. అట్లయినచో దానిలో మిగులునదేదియు నుండదు. అటు చూడుఁడు.

యోధులు:—ఏమిచేయవలెను?

మంత్రి:—త్రాళ్ళను గట్టిగా పట్టుకొనుఁడు. అదియే రథమును సురక్షితముగా నడపుమార్గము. ఆలోచనకిది సమయము కాదు. నేను బోవుచున్నాను.

(మంత్రి నిష్క్రమించును)

యోధులు:— (ఒకరితో నొకరు) ఏమిచేయుదము? (పురోహితునితో) అయ్యా! మీయభిప్రాయ మేమి?

పురో:—శూరులారా! మీ రేమినిశ్చయించుకొంటిరి?

యోధులు:—యుద్ధముచేయుటయా? లాగుటయా? మా కాలోచన తుదముట్టలేదు. అయ్యా! మీయభిప్రాయ మేమియో సెలవీయుఁడు.

పురో:—మోఁకులను లాగుటయా? లేక వేదపారాయణ మొనర్చుటయా? యేమిచెప్పుటకును గోఁచకున్నది.

మొ.యో:—ముక్కముక్కలై పోవునో యనునట్లు పుడమి యెట్లు కంపించుచున్నదో మీకుఁ దెలియుట లేదా?

రెం.యో:—నీ వటుచూడుము. వారు రథమును లాగు చున్నట్లు కనఁబడదు. రథమే తనంతటఁ దాను ముందుకుఁ బోవుచున్నది.

మూ. యో:—రథమునకుఁ బ్రాణము వచ్చినట్లున్నది. అది యెట్లు ఘోషించుచున్నదో పరికింపుము. ప్రతి రథోత్సవ సమయమునందు నే నిక్కడనుంటిని గాని రథ మింత యుల్లాసకరముగా నున్నట్లు నే నెప్పుడును జూడలేదు. అందుచేతనే యది రాజమార్గమున నడవక నూతన పథమునఁ బోవుచున్నది.

రెం. యో:—అది చేయఁబోవు విధ్వంసమమాటయేమి? అదిగో కవివరుఁడు వచ్చుచున్నాఁడు. అతని నడిగి దీనియర్థ మేమియో తెలిసికొందము.

పురో:—మూర్ఖుఁడా! మాకుఁ దెలియని విషయము కవులకుఁ దెలియునని నీవు తలంచుచున్నావా? కథల నల్లుమనినచో నల్లెదరు, వేదములలో నేమియున్నదో వారి కేమి తెలియును?

మొ. యో:—అయ్యా! వేదగ్రంథములు చాలాకాలము క్రిందటనే నశించినవి. తత్కారణముచేతనే మీవాక్కులయందుఁ గల గురుత్వము పోయినది. కవులు సజీవభాషయే పల్కుచుందురు. సత్యమే వారికావ్యములందుఁ బ్రకాశించునది.

ప్రవేశము - కవి.

రెం. యో:— కవీ! ఏల రథోత్సవ మీసంవత్సరమున తాఱుమాఱైనదో చెప్పఁగలవా?

కవి:—నేను జెప్పఁగలను.

మొ. యో:—రథము పురోహితునివలనఁగాని, భూపతి వలనఁగాని కదలలేదనఁగా నర్థమేమి?

కవి:—ఒక్కకాలరథమునుమాత్రమే విశ్వసింపఁగూడఁ దనువిషయము వారు మఱచిపోయిరి. దానిగుణముల విషయముఁ గూడఁ దలపోయవలెను.

మొ. యో:—కవీ! మీవాక్కులయం దర్థమున్నట్లు ధ్వనించుచున్నది. కాని మాకు బోధపడలేదు.

కవి:—వారికి గమనమునందే నమ్మకమున్నదిగాని న్యాయమైన పురోవృద్ధికి నిమిత్తములైన బంధములయందు నమ్మకము లేదు. కావుననే యీబంధములు రోషపూరితలోదనములై వారిని బ్రదికియుండఁగనే చీల్చి వేయుటకు భయపెట్టుచున్నవి.

పురో:—అయినచో మీశూద్రు లీబంధములయర్థము తెలిసికొని వానిబాధ్యత గుర్తింతురా?

కవి:—వారి కాతెల్వి లేదు. వారివాహనమునందే, వారియందే నమ్మక ముంచి, సర్వవస్తుసంచలనము (పురోవృద్ధి)నకుఁ గారణమైన ముఖ్యజీవమును ద్వరలో మఱచిపోదురు. దీనికై మీ రెంతోకాల మాఁగ నక్కఱలేదు; తరువాత వారు, 'హలమునకు జయ, రాటమునకు జయ, మగ్గమునకు జయ' అని కేకలువేయుదురు. అప్పుడు వారి ప్రమత్తతయే వారి విధ్వంసమునకుఁ గారణమౌను. అప్పుడు ప్రపంచమంతయుఁ దలక్రిందుఁ గాఁగలదు.

పురో:—అప్పుడు రథమాఁగినచోఁ గవివరుని బిలువవలెను కాఁబోలు!

కవి:— నీవు పల్కునది హాస్యము కాదు. సత్యమే. కాలపిత్రుఁ డనేకపర్యాయములు కవులను బిల్చుచుండెను. కాని వారు జనబాహుళ్యమునుండి త్రోసికొని పోవఁ జాలక యూరకుండిరి.

పురో:—రథమును లాగుటకు వారికి సత్త్వ మెక్కడిది?

కవి:—అది స్నాయువులసత్త్వము కాదు. మృదుమధుర కావ్యరచనాశక్తి గల మాకు ప్రాసయమకాదులయందు నమ్మక మున్నది. ఎక్కడ విరామ ముండవలెనో యక్కడ విరామము లేకున్నచోఁ గాలాతిక్రమణమే! ఆదియనుగాక పద్యములు శృంగారహస్తగతమైనప్పుడే, సత్యము సరళమార్గముఁ బట్టును. మాకు దౌర్జన్యమునందు నమ్మకము. అది బలహీనుని

యొక్కయు, భీరునియొక్కయు, జడునియొక్క మతము.

మొ.యో:—కవివరుఁడా! రాజ్యము వినాశము చెందుచుండె నీ వుపన్యసించుచున్నావు.

కవి:—ప్రతియుగమునందు నారాజ్యములు వినాశమును జెందినవి. కాని యేది జీవించవలసియుండెనో యదే మిగిలియుండెను.

రెం.యో:—కవీ! నీ వేమిచేయ నిశ్చయించుకొంటివి?

కవి:—ఆశ, ధైర్యోద్రేకములఁ బుట్టించు నొకపాటను బాడెదను.

మూ. యో:—దాని వలన నేమి ప్రయోజనము?

కవి:—అది, ప్రజలు రథమును లాగనప్పుడు, వారేయే కాలములందుఁ గార్యసాధనమునకుఁబూనుకొనవలెనో ఆయాకాలములను సూచించును. ఆకాలములందు లాగుటయే ప్రపంచమునందలి సర్వబాధలకు మూలకారణము.

యోధులు:—మే మేమి చేయవలెను?

ప్రశ్న:—నే నేమి చేయవలసి యున్నది?

కవి:—తొందరపడకుఁడు. మఱల మీకాజ్ఞ యయ్యెడి వఱకుఁ గనిపెట్టుము, నాలోచించుచుఁ గార్యముల నొనర్పుఁడు.

(తెలపడును.)

అనురాగమా - విరాగమా?

జంధ్యాల వేంకట శివరావులు ('పూఁదేనె' నుండి)

కుసుమముం గాంచి నంత నీగుణగణమ్ము
గానముం జేయఁ బూను నామానసమ్ము
ఔర! యెంతటి సౌందర్యసార మిందు
నించితివి! జీవకళయు నర్పించి తెంత!
చిన్నికుసుమమ్ము నీ విన్నవన్నె లొలుక
ఎంత ప్రేమను దీని నిర్మించినావో?
ఱెప్ప లార్పక విస్మయదృష్టి దీనిఁ
గాంచుచునె కాంచుచునె మేను గగురు లెత్త
దానినిన్ నన్ను మఱచెదఁ గాన నింక
వేఱువస్తువు నినుఁ దక్క విశ్వమందు
అదిర! నీపను లెంతటియద్భుతములు
నిను గడున్ సులభమ్ముగఁ గనుట పొంటె
ద్వారముల నెన్ని తెఱచి తవ్యాజకృపను!

* * * *

ఎవ్వ రీవంక నాగుండె చివ్వుమనఁగ
నన్ను నవతలికిని నెట్టుచున్నవారు?
"తొలఁగి పొమ్ము మాయాజాలకలితమైన
యీప్రపంచరతిన్ జిక్కితేని యింక
వృథగ నశియించి పోదు తప్పించుకొనుము
ఈప్రతారిక యెల్లెడ నెసఁగువాని
నెడము సేయుచు నినుఁ గొని యేగుచుండ"
అనుచు వచియించుచున్నమహాత్ము లెవరు?

* * * *

పరివిపరీత మియ్యది యెల్లెడలను
నీవ యుండిన నిన్ బాసి పోవు టెట్లు?
అసలు జగము మాయాజాలమగును గాక
దీని విడిచి బైటకుఁ బోవుతెరువు గలదె?
నాథ! యేయీ ప్రసూనవనమున కీవు
తోటమాలివై వాత్సల్యపాటవమున
దీని సర్వాంగశుభముల నీపైన వైచి
కొనుచు దీనికై శంకరతను వహింతు
పట్టి కీనిపై దుష్టభావనలు గనుట
పాపమును, నీచమును నశుభమును గాదె?

* * * *

తత్త్వ మింతయు నెఱఁదను దరిచి చూడ
ఎవని కెల్లెడలను గోచరించు మాయ
వాఁడె నిజముగఁ దా మాయపాశమందు
కట్టఁబడె నేమొ యనుశంక గలుగు నాకు.

ప్రాచీన హైందవ గణితములు

దర్భా యజ్ఞేశ్వర సోమయాజిగారు. బి. యే., యల్. టి.

క. పలుసందియములఁ దొలఁచును, వెలయించు నగోచరార్థ విజ్ఞానము లో
కుల కక్షిశాస్త్ర మయ్యది, యలవడ దెవ్వనికి వాఁడె యంధుఁడు జగతిన్. —చిన్నయసూరి.

ఆంధ్రవపసరదనను సృజించి, యాబాలగోపాలము నీతి విద్యాపారంగతులగునట్లు, నన్నయసరణి నవలంబించి, నీతిచంద్రికను వ్రాసి, వన్నెకెక్కిన సూరిశేఖరుఁడౌ చిన్నయసూరి యీపద్యమునే విష్ణుశర్మచే కవిమండలికి వెల్లడింపజేసె నన్న సంగతి యెల్ల తెఱిగినవిషయమే. ఇందు శాస్త్రవిజ్ఞానావశ్యకతనుగూర్చి యే యాతడు ప్రశంసించియున్నాడు. ఈత డొక్క నీతిశాస్త్రప్రాశస్త్యమునుగూర్చియే యిందు వచించెననుట యంత సమంజసము గాదు. అన్నిశాస్త్రములను సమదృష్టినే చూచి, వానివాని ప్రత్యేక ప్రాధాన్యములను సమగ్రముగ గ్రహించి విశేషార్థమును స్ఫురింపజేయు "శాస్త్ర" శబ్దమునే భావగర్భితముగ బ్రయోగించియున్నారు. వీ రీపద్యమున నుడివినవిషయములన్నియు గణితశాస్త్రజ్ఞానమునకు గూడ వర్తించును.

౨. గణితశాస్త్రమన నేమియో, దాని ప్రాశస్త్యమెట్టిదో, దానితో దనదేశస్థుల కెట్టి యనుబంధముండెడిదో, రానురా నాబాంధవ్యము మననాఁటి కెట్లుపరిణమించినదో, తిఱిగి యిపుడు దానితో సాంగత్యపురస్సరంబుగ వియ్యమందు టెంతయావశ్యకమో, యను సంగతులనుగూర్చి యీదిగువ నానేర్చినకొలది నుగ్గడించెదను.

3. గణితమన నేమి? గణితమనుపదము "గణ్" అనుసంస్కృత క్రియనుండి సేకరింపఁబడినది. గణనమనఁగా లెక్కించుట. గణనమే ప్రధానముగాఁ గలవిజ్ఞానవిభాగమును గణితమందురు. శుద్ధగణితమని ప్రయుక్తగణితమని గణితము ద్వివిధము. శుద్ధగణితము నంకగణితము, బీజగణితము, జ్యామితి (రేఖాగణితము), త్రికోణమితి (Trigonometry), క్షేత్రగణితము (Mensuration), కలనము (Calculus), బీజజ్యామితి (Analytical Geometry), మున్నగువిభాగములుగ విభజించి వ్యవహరించుచున్నారు. ప్రయుక్తగణితము శుద్ధగణితఫలితముల నూతగగైకొని పంచభూతమయప్రపంచవిషయికవికారాదులతత్త్వముల నెక్కసరశికి దెచ్చుచున్నది. ప్రయుక్తగణితమును ఖగోళశాస్త్రము (Astronomy), గతివిద్య (Dynamics), స్థితివిద్య (Statics), జలస్థితివిద్య (Hydrostatics), తదితర భౌతికశాస్త్రగణితభాగములుగను విభజించియున్నారు. ఈగణితభాగములన్నియు గూడ మానవుల

కావశ్యకములే. గణితజ్ఞానంబునం జేసి మానవుల కెట్టిలాభములు గల్గుచున్నవో యరయుదము.

౪. మాతృభాష మానవుల కెంతయుపయోగకరమో గణితజ్ఞానముకూడ వారి కంతయుపయోగకరమనుట యతిశయోక్తిగాదు. వర్తక వ్యాపారముల కెల్ల నాయువుపట్టైనదియేది? రాజకీయవిషయములకు మూలాధారమైనది యేది? గ్రహసంచారముల నిర్ణయింప సామర్థ్యముగలది యేది? ప్రకృతిశాస్త్రమునకు జీవగఱ్ఱయైనది యేది? "రాల్గరగించువిమలగాంధర్వ"విద్య కట్టిసాహాయ్యము నొసగినది యేది? శిల్పనిర్మాణములకు స్థైర్యము గూర్చిచిరస్థాయిగ నొనర్పగల్గు విజ్ఞానమేది? ఇట్టి ప్రశ్నాపటలజటిలంబగు శాస్త్రము గణితమే.

౫. ఇక మనదేశమున గణితశాస్త్రమెట్లు పెంపొందినదో యరయుదము. మన వీలునుబట్టి దీనిచరిత్రమును మూడుభాగములుగ విభజింపవచ్చును.

౧. శుల్వసూత్రముల కాలమునాటిగణితము. క్రీ. శ. 200కు పూర్వకాలమునాటివి.

౨. ఖగోళశాస్త్రములకాలము. క్రీ. శ. 400-600.

3. హైందవగణితముల యుచ్ఛదశ. క్రీ. శ. 600-1200. విషయములను యథార్థముగ బ్రకటింపకున్నను, యీవిభజన మనకు విషయవ్యక్తీకరణమునందు జాలవఱకు దోడ్పడి, దానిని తగు వాస్తవముగ బ్రకటించుచున్నది.

౬. వేదములకాలము: మిక్కిలి ప్రాచీనమగు వేదములకాలమునే గణితములకు బ్రారంభకాలముగ జేయుదమన్న, వేదములకాలమునాటి సారస్వతమునందు దాత్కాలికముగ బేర్కొన్న యొకకొన్ని కొలతలు, సంఖ్యలు తక్క, గట్టిగ గణితభాగములుగ వ్యవహరింప దగిన విషయజాల మెందును గానరాదు. పైన పేర్కొన్న మూడుకాలభాగములలో శుల్వసూత్రములకాలపు గణితభాగములకును, దక్కటి రెండుకాలములం దభివృద్ధినందిన గణితములకును, నెట్టిసంబంధము లేదనుసంగతి కడుంగడుశోచనీయము. తరువాతకాలమునాటి వారలందరును, శుల్వసూత్రగర్భితగణితవిజ్ఞానము నెఱుగనట్లే తేటపడుచున్నది. ఈగణితభాగములనుగూర్చి వారెన్నడును బ్రశంసింపకుండుటయేకాక, వానియందున్న విజ్ఞానఫలితములను గూడ వాడుకచేసిన ట్లగపడదు. ౧౯ వ శతాబ్దమునకు బూర్వముననున్న హిందువు లెవ్వరునుగూడ శుల్వసూత్రములలో నెట్టిప్రాశస్త్యమేని గల గణితభాగము లున్నట్లు చెప్పుటకూడ నెఱుగరు. మూడవవిభాగకాలమునాటి గణితము రెండవవిభాగకాలగణితము నుండియే పెంపొందినట్లు పొడకట్టుచున్నది.

౭. శుల్వసూత్రములు: బలిపీఠముల నిర్మాణములనుగూర్చి చెప్పుకల్పసూత్రములకు తోడై వానిని సంపూర్ణముగ నొనర్చుచున్నవి యీశుల్వసూత్రములే! ఈ "శుల్వసూత్రము" లనునామమునకు "త్రాళ్లకొలతలను గూర్చిన విధు"లని యర్థము. శుల్వసూత్రములను వ్రాసి

న కాలమునుగూర్చి పండితోత్తములు భిన్నాభిప్రాయములను వెల్లడించియున్నారు. శుల్వసూత్రములు యాగాదివైదికకర్మలందు దోడ్పాటుగ నుండుటకై నియోగింపబడినవి. గణితవిభజన ప్రకర్ష వీనిముఖ్యోద్యమముమాత్రము కాదు. దీనంజేసి వీనియందు మతోద్యమప్రసక్తియే కాని గణితోద్యమప్రసక్తియంత మెండుగ నున్నట్లగపడదు. వీనియందు గణితఫలములనుమాత్రమే పేర్కొనిరికాని వానికేవిధమైన యుపపత్తులనుగాని యొప్పిప్రతిపాదనములను (Demonstrations) గాని ప్రకటించియుండలేదు. ఈఫలితములను గణితాచారవిధినిగూడ రూపించియుండలేదు.

౬. శుల్వసూత్రములలోనిగణితము:జ్యామితిభాగము:—

౧. ఆయతములను వర్గములను గల్పించుట.

౨. కర్ణమునకును భుజములకును గలసంబంధము.

3. ఆయతములయు వర్గములయు తుల్యతలు.

౪. వృత్తములయు వర్గములయు తుల్యతలు.

ఈ నాల్గువిషయములగూర్చి గణితభాగమునకు సంబంధించిన సూత్రములు కొంతవఱకు ప్రశంసించుచున్నవి. మొదటి రెండు భాగములసందర్భమున, పైథాగరసు ప్రమేయముయొక్క సాధారణవిధిని ప్రకటించియున్నారు. బౌధాయన కాత్యాయనములందు ఈ సూత్రమున్నది.

"దైర్ఘ్యచతురశ్రస్యాక్ష్ణయా రజ్జుః
పార్శ్వమానీ
తిర్యఙ్మానీ చ యత్ పృథగ్భూతే
కురుత స్తదుభయం కరోతి".

"ఒకయాయతముయొక్క కర్ణము పొడుగు నడిమిపట్టినత్రాడు కల్పించు వైశాల్యము, దానిదీర్ఘహ్రస్వభుజముల నేర్పరించు త్రాళ్లురెంటను విడివిడిగా కల్పించు వైశాల్యములరెంటిని గూడ బ్రకటించును. అనగా ఆయతపు కర్ణోపరివర్గము తక్కటి రెండుభుజములమీది వర్గముల మొత్తమునకు సమానము" అని యీసూత్రమునకర్థము. ఆపస్తంబము "చతురశ్ర" మనుపదమును వదలివేసి యీసూత్రమునే నివేదించుచున్నది. ఈసూత్రము నీదిగు యుదాహరణములచే స్పష్టీకరించియున్నారు.

$$3^2+4^2=5^2$$
$$5^2+12^2=13^2$$
$$8^2+15^2=17^2$$

మున్నగునవి. ఆపస్తంబ బౌధాయనములందట్లుకాక, కాత్యాయనమునందు వర్గముయొక్క భుజకర్ణములతో దుల్యములగు భుజములుగల సమకోణ త్రిభుజముయొక్క కర్ణముల నవ్యక్తగణితవిధిని (algebraically) సంకేతముగ బ్రకటించిరి. అనగా సమకోణ త్రిభుజపు భుజపరిమాణములు. క్రమముగా "భు, $\sqrt{2}$ భు, $\sqrt{3}$ భు" లని ప్రకటించిరి. దీనియందు మాత్రమే "$1^2+3^2=10$" అనియు, "$2^2+6^2=40$" అనునట్టియు సంబంధములను గూడ పేర్కొనియున్నారు. ఏదో యొకయు

త్సర్గము (Generalrule) నుండి వీనినన్నిటిని గ్రహించినట్లు సూచించుచున్నాము లేవియు సీశుల్వసూత్రములందు గానరావు.

౯. తాత్కాలికముగ వర్గకర్ణప్రమాణమును బ్రకటించిరి.

$$\sqrt{2}=1+\frac{1}{3}+\frac{1}{3\cdot4}-\frac{1}{3\cdot4\cdot34}$$

ఒకటిలవముగగల భిన్నముల ప్రయోగిమే యీయనుబంధమునుండి మనము గ్రహింపవలసినవిషయము. ఈఫలముగాని, యీరూపము గలభిన్నములుగాని, దీనితరువాతి హైందవగ్రంథములందు గానరావు.

౧౦. తుల్యవర్గములను నాయతములను గూర్చిన ప్రశ్నలు నియమములగు యజ్ఞవేదికలకల్పనములందు సంభవించుచుండుకతమున శుల్వసూత్రములు పైభాగారసుప్రమేయసహాయమువలన సాధింపగల్గు నెకకొన్నిన్యాసములను బ్రకటించుచున్నవి.

౧. ఒకవర్గమును రెండువర్గములయోగమునకు సమానమగునట్లొనర్చుట.

$$క^2=బ^2+భు^2.$$

౨. ఒకవర్గమును రెండువర్గములవ్యత్యాసమునకు సమానముగ నొనర్చుట.

$$భు^2=క^2-బ^2$$

3. నియతవర్గమునకు సమానముగ నెకయాయతమును గల్పించుట.

$$భు^2=\sqrt{2}\,భు.\frac{\sqrt{2}భు}{2}$$

౪. నియతాయతమునకు సమానముగ నెకవర్గమును గల్పించుట.

$$క.చ=\left(\frac{క+చ}{2}\right)^2-\left(\frac{క-చ}{2}\right)^2$$

౫. ఒకవర్గన్యూనమును (Decrease)వ ఉటియొకవర్గముగఁ జేయుట ఈయైదవసూత్రమంతవిపులముగా లేదు.

౧౧. వృత్తము. బలికీతములనిర్మాణములందు గొన్నిటవృత్తతుల్యములగు వర్గముల గల్పించు టావశ్యకముగానుండెడిది. ఈసమస్యయొక్క వివరణము శుల్వసూత్రములందుగూడ గాన్పించుచున్నది. ఈవివరణము లసంపూర్ణస్థితి (crude form) నున్నను వీనిలో నెకయంశము మాత్రమించుమించు రూపముగానే యున్నది. వర్గముయొక్క భుజమును (భు) చేతను, వృత్తముయొక్క వ్యాసమును (వ్యా)చేతను, ఆవర్గవైశాల్యమును ($భు^2$) చేతను ప్రదర్శించినచో శుల్వసూత్రములందున్న యీసమస్యఫలముల నీదిగువరీతిగ వివరింపవచ్చును.

$$(1)\ వ్యా=భు+\frac{1}{3}(\sqrt{2}భు-భు)$$

$$(2)\ భు=వ్యా-\frac{2}{15}వ్యా$$

$$(3)\ భు=వ్యా\left(\frac{1}{8}+\frac{1}{8.29}-\frac{1}{8.29.6}+\frac{1}{3.968}\right)$$

ఈఫలములలో మొదటిరెండును బౌధాయనాపస్తంబములందున్నవి. మూడవది ప్రత్యేకముగా బౌధాయనమునందే కాన్పించుచున్నది. ఇది $\sqrt{2}$ యొక్క పరిమాణముగ (౯) ను యోగించి (1) నుండి గ్రహించినట్లు గపడుచున్నది. అది యెట్లనిన

$$\frac{\text{భూ}}{\text{వ్యా}}=\frac{3}{2\sqrt{2}}=\frac{3}{2+\frac{577}{408}}=\frac{1224}{1393}=$$

$$1-\frac{1}{8}+\frac{1}{8.29}-\frac{1}{8.29.6}+\frac{1}{8.29.6.8}-\frac{41}{8.29.6.8.1393}$$

ఇదియు (3) నందలిఫలితము నొక్కటే. దీనినిబట్టిచూడగా శుల్వసూత్రముల కాలము నందే భిన్నముల నొకటి లవముగాగల పాక్షికభిన్నములుగ (Partial fractions) ప్రకటించువిధుల నెఱిగినట్లే గోచరించుచున్నది. కాని దీనిని ధ్రువపరచుట కెట్టియాధారములును గానరావు. ఇంతియకాక తరువాత వారెవ్వరు నీపాక్షికభిన్నప్రక్రియ నవలంబించి యుండలేదు. తరువాత కాలమునందలి హైందవగణితజ్ఞు లెవ్వరు నీవృత్తవర్గీకరణ (squaring the circle) సమస్య వివరణను గూర్చి చర్చించినట్లుకాని, శుల్వసూత్రములం దీవిషయవివరణ మున్నదనిగాని వారి వారిగ్రంథములలో వాడియుండలే దనుసంగతిని జ్ఞప్తియందుంచుకొనుట యుత్తమము.

II ఖగోళశాస్త్రములకాలము. (క్రీ. శ. 400-600

౧౨. శుల్వసూత్రముల కాలమునాటి గణితమునకును నటుతరువాత పెంపొందిన హైందవగణితమునకును నేవిధమైన సంబంధముగాని యున్నట్లగపడదు. గ్రీసునందు గణితప్రసక్తి (research) క్షీణించిన వెంటనే హిందువులు తమగణితవిజ్ఞాన కౌముదిని బ్రపంచమునంతటను వ్యాప్తముచేయ నారంభించిరి. అంకగణిత, బీజగణితములందు మాత్రమే వారు ప్రఖ్యాతిగాంచిరి. రేఖాగణిత విజ్ఞానమునందు వారు చాల వెనుకబడియున్నారు. అవ్యక్తవిశ్లేషణ మనుగణితశాఖను జక్కగా బెంపొందించి యుచ్చదశకు దెచ్చిరి. 19 వ శతాబ్దమువరకు నీవిషయము పాశ్చాత్యులకు దెలియకుండిన కతమున నానాటి (క్రీ. శ. 400-600) పాశ్చాత్యగణితవేత్త లీవిషయమును గూర్చి యేమియు నెఱుగరు.

౧౩. హిందువులలో ప్రత్యేకగణితశాస్త్రజ్ఞులమని కంకణము గట్టుకొనినవా రెవ్వరును లేరు. మనము వ్రాయ సమకట్టిన గణితజ్ఞులందరును కేవలసిద్ధాంతుల మనియే వ్యవహరించికొనిరి. సిద్ధాంతవిద్యాభ్యాసమునందు వారు గణితమును కేలూతగా జేసికొనిరి. అప్రధానముగ గైకొనిన గణితవిజ్ఞానప్రకరణ యందే వారు ప్రఖ్యాతిగాంచి తమ కభిరుచిగల్గి యప్రమత్తులై ఖగోళశాస్త్రమున నవలోకనములు సల్పి, తటస్థాంశములను బ్రోవుచేసి, యనుగమపరిశోధనముల (inductive inferences) నొనర్చి విజ్ఞానసంస్కరణము నొనరింపజాలకపోయిరని వచించుటంతయు నాశ్చర్యకరముగా నున్నది.

౧౪. హిందువుల గణితములో గొంత, గ్రీకుగణితజన్యమనుసంగతి నిశ్చయమైనవిషయమే. హిందువులయొక్కయు, గ్రీకులయొక్కయు నాలోచనవిధుల యనుబంధక్రమములు నిదమిత్థమని నిరూపించుట కష్టతరమైనదయ్యును హృద్యమైనవిషయమే.

౧౫. హైందవగణితముల యభివృద్ధిని గూర్చి ప్రస్తుతము మనకు దెలిసినది మిక్కిలి స్వల్పము. తరతరంబులనుండియు వచ్చుచున్న యీస్వల్పసంఖ్యగల గణితములన్నియు గూడ

నీశాస్త్రముయొక్క సంపూర్ణస్థితినే ప్రకటించుచున్నవి. వీనిలో మొదటిగ్రంథపుకాలముతప్ప దక్కినవానిని వ్రాసినకాలములను శాస్త్రవేత్తలు నిర్ణయించియున్నారు. హిందూదేశము యొక్క వాయవ్యదిశయందున్న తక్షశిలానగరమున క్రీ. శ. ౧౮౮౧ సం. నందు భూస్థాపితమైన యొకప్రాచ్య లిఖితాంకగణితమొకటి దొరికినది. దానిని వ్రాసినవారిపేరందు లేదు. దానిలోని శ్లోకములవికారవిశేషములనుబట్టి యది క్రీ. శ. మూడవశతాబ్దముననో లేక నాల్గవశతాబ్దముననో వ్రాసినట్లు తోచుచున్నది. ఇది భూర్జపుపట్టమీద వ్రాసిన గ్రంథప్రతునక. ఇది యెనిమిదవశతాబ్దమున లిఖించిన మఱియొకప్రాతప్రతికి ప్రతికగా దోచుచున్నది.

౧౬. మనకు దెలిసినగణితశాస్త్రజ్ఞులలో ప్రాచీను డార్యభట్టాచార్యుడు. గంగానదికుత్తరతీరముననున్న పాటలీపుత్రమున క్రీ.శ. ౪౭౬ సం. మున నీతడు జన్మించెను. ఈత డార్యభట్టీయమను గ్రంథమును వ్రాసెను. దీని తృతీయాధ్యాయము గణితమునుగురించి వ్రాసినదే. సుమారు నూఱేండ్లైనతరువాత, ననగా క్రీ. శ. ౫౯౮ సం. మున బ్రహ్మగుప్తుడు పుట్టెను. ఇతడు క్రీ. శ. 628 సం. మున "బ్రహ్మస్ఫుట సిద్ధాంత" మనుగ్రంథమును వ్రాసి వాసికెక్కెను. ఈగ్రంథముయొక్క పండ్రెండవ యధ్యాయమును, పదునెనిమిదవ యధ్యాయమును, గణితమునకు జెందినభాగములు. తరువాత శతాబ్దములందు లెక్కకు వచ్చెడివా రిరువురుమాత్రమే పుట్టిరి. వీరిలో శ్రీధరుడు గణితసారమును, పద్మనాభుడు బీజగణితమును వ్రాసిరి. బ్రహ్మగుప్తుని తరువాత నీగణితశాస్త్ర మంతగా వృద్ధిజెందినట్లు కాన్పింపదు. క్రీ. శ. 1150 ప్రాంతమున భాస్కరాచార్యుడు వ్రాసిన సిద్ధాంతశిరోమణి మాత్రము, దాని కైదువందల సంవత్సరములకు క్రిందటనే వ్రాసిన బ్రహ్మగుప్తుని సిద్ధాంతముకంటె కొంచము మిన్నయై వర్తించుచున్నది. భాస్కరుని గ్రంథమునందు, లీలావతి, (అంకగణితము) బీజగణితము, లనబడు రెండుప్రకరణములుమాత్రమే మిక్కిలి ప్రశస్తములైన గణితభాగములు. రానురాను శోధనప్రసక్తి (Spirit of research) క్షీణించినది. తరువాతికాలమున పేరగడ్తకెక్కిన గణితజ్ఞు డెవ్వడును లేడు.

౧౭ అంకెలకు స్థానికమూల్యము (Place value)ను గల్పించి, గణితవ్యాపారములందు సున్నయొక్క ప్రయోగము నాచరించి, యాచారములోనికి దెచ్చినది హిందువులే. గణితశాస్త్రమున కాయువుపట్టనదగు వీని నాచరింపక పూర్వ మీశాస్త్ర మంతబాగుగ నభివృద్ధిజెందలేదు. వీనిని బురస్కరించికొనుటచేతనే గణితము లత్యద్భుతముగ నలతికాలముననే పెంపొందినవి.

౧౮ 'తక్షశిల' ప్రాచ్యలిఖిత పుస్తకము: తక్షశిల ప్రతినుకను పయోగించువారు, లెక్కపెట్టుట తెలిసినవారుగా నుందురను నుద్దేశము మనస్సున నుంచుకొని వ్రాసినట్లు, కాన్పించుచున్నది. దీనియందు మధ్యగీత లేకయే లవముక్రింద హారమును

వ్రాసి భిన్నములను బ్రకటించియున్నారు. పూర్ణాంకములను నొకటి హారముగాగల భిన్నములుగా రూపించిరి. మిశ్రసంఖ్యలలో పూర్ణాంకమును భిన్నముకుపైననే వ్రాసియున్నారు. ఉ. "$\frac{2}{3}=2\frac{1}{3}$". మన మిపు డుపయోగించుసమీకరణ చిహ్నమునకు (=) బదులు "ఫల"మనుపదమును "ఫ" యనునక్షరసంకేతముచే బ్రదర్శించి వాడియున్నారు. సంకలనమును "యు" అను "యుత" శబ్దసంకేతముచే సూచించిరి. సంకలనమును జేయవలసిన సంఖ్యల నొక యాయతమునందే వ్రాసి ప్రకటించియున్నారు. ఉ. "ఫ. 12 $\left[\frac{7}{1}\frac{5}{1}\right.$ యు$\left.\right]$" యన్నది "5 + 7=12"ను ప్రదర్శించుచున్నది. అవ్యక్త పరిమాణమును (Unknown quantity) శూన్యమని వ్యవహరించుచు దాని నొకస్ఫుటమగుచుక్కచే(•)సూచించిరి. శూన్యశబ్దమునకు వట్టిదని (ఏమియులేనిదని) యర్థము. ఇచ్చట పెద్దబొట్టుచే ప్రకటింపబడ్డ సున్నకుం గూడ నీపదమునే పర్యాయపదముగ వాడుచున్నారు. ఈపదముయొక్కద్వ్యర్థిప్రయోగమును, చుక్క ప్రకటనయును, నాస్థానము పూరింపబడక వట్టిదిగా నున్నదని తెలుపుచున్నట్లు గ్రహించుచున్నాము. ఇంతియకాక యాస్థానము నాక్రమించికొనవలసిన సంఖ్య నిర్ణీతము కానంతవఱకు నది వట్టిదిగనే యుండవలెననుసంగతినిగూడ నిది సూచించుచున్నది.

౧౯ తక్షశిలయంకగణితమునందు నొకటిని భావనయందు సంకల్పించుకొని వాస్తవఫలితమును నిర్ణయించుట యనుమిథ్యావిధి (False position) నుపయోగించి చేసెడిప్రశ్నలు గలవు. ఈమిథ్యావిధిప్రయోగమును ప్రత్యేకగణితకర్మముగ గ్రహించి భాస్కరుడు విశేషించి వాడియున్నాడు. తక్షశిలప్రతి యొకటినే యవ్యక్తపరిమాణముగ గ్రహించుచున్నను, భాస్కరు డొకటికి బదులుగా మూడు నుపయోగించి వ్యవహరించియున్నాడు.

ఆర్యభట్టు

౨౦ ఈతడు క్రీ. శ. 476. సం. మున జన్మించెను. దేశాచారమునుబట్టి యార్యభట్టు గణితశాస్త్రజ్ఞులలో మొట్టమొదటివాడుగ నెన్నబడుచున్నాడు. గణితశాస్త్రమునుగూర్చి ప్రత్యేకముగా వ్రాసినవారిలో దొల్తటివాడీతడే. ఈతడు ప్రఖ్యాతసిద్ధాంతి యగుటచే సిద్ధాంతభాగములలోనికి గణితశాస్త్రసమ్మతములై యామూలాగ్రములైన మార్పులను జేయ నుంకించెనుగాని ఛాందసులగునితరసిద్ధాంతులు దీనిని నిరోధించిరి. ఈత డార్యభటీయమను గ్రంథమును వ్రాసెను. దీనియందు సూత్రములయు, ప్రమేయములయు తత్త్వములను సాంకేతికశ్లోకములలో నీతడు వ్రాసెను. దీనిలో నుపపత్తులుగాని యభ్యాసములుగాని కానరావు. దీనియందలి భాష క్లిష్టముగను సంగ్రహముగను నుండి చాల దురవగాహముగా నున్నది. బీజగణిత విశ్లేషణమును(Algberaical analysis) గల్పించిన దీతడేయని పెక్కండ్ర యభిప్రాయము. ఈగ్రంథముయొక్క నాల్గధ్యాయములలో మూడుభాగములు ఖగోళశాస్త్రమునుగూర్చియు, గోళీయత్రికోణమితిక

ప్రాథమికాంశములను (Elementary portions of Spherical Trigonometry) గూర్చియు బ్రకటించుచున్నది. చతుర్భాగమునందలి ముప్పది మూడుద్విపదలలో నంకగణిత బీజగణిత, సరళ త్రికోణమితులందలిసూత్రములను వ్రాసియున్నాడు. కేవలసిద్ధాంతియగు నీతడు తన సిద్ధాంతమునకు వినియోగించుగణితభాగములనుమాత్రమే యభ్యసించెను.

౨౧ అంకగణితము సంఖ్యానీకముతో బ్రారంభించి సంఖ్యలవర్గములను వర్గమూలములను గనిపెట్టురీతులను గూర్చి చెప్పి, వైశాల్యములను గూర్చియు, ఘనఫలములనుగూర్చియు కూడ చర్చించుచున్నది. ఘనఫలములను గూర్చి చెప్పుసూత్రములు చాలవఱకు దోషభూయిష్ఠములుగ నున్నవి.

"సూచీఘనఫలము (Vol. of a pyramid) $=\frac{1}{2}$ భూమి $\times$ లంబము" అని యీగ్రంథమున నున్నది. దీనితరువాత ఖగోళశాస్త్ర సాంప్రదాయము గల గణితభాగ (Semi-astronomical section) మున్నది. దీనియందు వృత్తమునుగూర్చియు, ఛాయలనుగూర్చిన ప్రశ్నలనుగూర్చియు, నిట్టి మఱికొన్నివిషయములను గూర్చియు ప్రకటించియున్నాడు.

౨౨ బీజగణితవిభాగమునందు మొదటి "న" సహజాంకములయొక్క ప్రథమ, ద్వితీయ, తృతీయ ఘాతములమొత్తములను గనుగొనువిధులను దెల్పియున్నాడు. వర్గాత్మక సమీకరణపు సాధారణవివరణమును (The general solution of a quadratic equation) ప్రథమఘాతసమకాలిక సమీకరణముల (Simultaneons equations of the first degree) వివరణముల నొకకొన్నిటిని దెలిపియున్నాడు. సమకాలికసమీకరణముల సాధారణవివరణమును పరంపరాభిన్నముల (Continued fraction) విధి నుపయోగించి ఫలముల గనుంగనుగొనుటకు యత్నముచేసినవారిలో నీతడే ప్రథముడు. ఈతడు గ్రంథమున వ్రాసిన సూత్ర మంతయధార్థమైన ట్లగపడదు. కాని వీరియాశయముమాత్రము శ్లాఘనీయము. ఈవిధినిగూర్చి మిక్కిలి విస్తరించి వ్రాసి, చదువరుల నాశ్చర్యమగ్నులుగ నొనర్చు సామర్థ్యమును బ్రకటించిన బ్రహ్మగుప్త భాస్కరులకల్పనలకు మార్గదర్శకముగ వర్తించిన దీయార్యభట్టీయవిభాగమే యని వేరె చెప్పనక్కఱలేదు. దీనియందుగల యంకెలతో గూడిన సమీకరణవ్యాపారముల నరసి చూచిన దశాంకకలనవిధిని యీతడెఱిగియే యున్నట్లు ద్యోతకమగుచున్నది.

వానప్రస్థుని విభ్రమము

శ్రీ శివశంకర శాస్త్రిగారు, (సాహితీసమితి సభాపతి)

౫

దేవి, యీనేత్రములకు యాదృచ్ఛికముగఁ
ద్వన్మనోహర రూప సందర్శనాభి
సిద్ధికయి యెన్నిసార్లు నిల్చితినో తెలియ
దహహా! వాతాయనమ్ముల కభిముఖముగ.

విమలకమనీయ వదనారవిందదివ్య
వీక్షణాకాంక్షరక్తి దేవీ, త్వదీయ
సౌధసవిధమ్మునకు నెన్నిసార్లు తీర్థ
యాత్ర సల్పితినో తెల్ప నలవి కాదు!

అమలసంజీవనౌషధం బైననీదు
శాంతరమ్యకృపాకటాక్షంబు కొఱకు
చెలగి హర్మ్యమునకుఁ బ్రదక్షిణము లెన్ని
చేసితినొ దేవి, లెక్కించి చెప్పలేను!

హృదయభారఘనధ్వాంతవిదళనాచ్ఛ
చంద్రికా కాంతిపూరయుష్మన్మనోజ్ఞ
దివ్యదరహాసమునకు మందిరములోని
కెన్నిసారులు వచ్చితి నెఱుక లేదు!

౬

వీతరాగులు సంత్యక్తవివిధసుఖులు
శూన్యవాదులు బుద్ధభిక్షుకులు దేవి!
కలరు వారల కెల్ల సంఘమ్ము బుద్ధ
దేవుఁడును ధర్మ మనియెడి "త్రిశరణములు."

సతతహృదయాంతరాళజాజ్వల్యమాన
దివ్యవిమలానురాగసందీప్తిశాలి,
నఖిలభుజమార్గకలితభోగాభిరతుఁడ:
దేవి, ఉన్నవి నాకును త్రిశరణములు!

నిన్ను వర్ణించి నీమెడ నిరుపమాను
రాగ ముదయింపఁ జేసిన రమ్యమూర్తి
ఆర్ద్రహృదయుఁడు మామకప్రాణసఖుని
యమృతనిష్యంది వాక్కుల నాశ్రయింతు!

అఖిలశృంగారనిధి జగదాశ్రయుండు
భక్తవాంఛితనిఖిలసంపత్ప్రదుండు
నన్ను నినుఁ గూర్చు రాధికానాథదేవు
నంఘ్రిపంకేరుహంబుల నాశ్రయింతు!

నావిలోచనతారవు నాదుహృదయ
రాజ్యలక్ష్మివి శృంగారరససరసివి
నాతపఃఫలనిధివి ప్రాణమవు దేవి!
అట్టి నీదుకటాక్షంబు నాశ్రయింతు!

౯

మినుకు మినుకని చుక్కలు మెఱయుచుండె
నావరించెను జిలుగుమబ్బు లోకసమ్ము
నెదురుగాఁ దోచుచుండె మహీధరమ్ము
పార్శ్వములఁ బాదపశ్రేణి పరగుచుండె.

కలరవంబున బందరుకాల్వ మిగుల
నింపు లొల్కెడిగతిఁ బ్రవహించుచుండె
నీరరేఖను బ్రేకించి కూరుచుంటిఁ
బ్రాణసఖుతోడ సందలి పడవ మీద.

తన్మధురరాత్రి వేళఁ దత్ప్రాంత మెల్ల
నిర్జనమనోహరంబయి నెగడుచుండె
శ్రవణగోచరమగుచుండె శాంతరీతిఁ
గృష్ణవేణీస్రవంతికాగీతరవము.

మందపవనకుమారుఁడు మధురగతిని
కోమలములైన మాదు ముంగురులతోడ
లలితమౌ నుత్తరీయాంచలములతోడ
నాడుచుండెను సయ్యాటలను పదమ్ము.

నిన్ను వర్ణించె నప్పుడు నిస్తులముగ
భావభరమున నాగిరాందేవి దివ్య
స్తన్యబిందుకదంబకాస్వాదవిమల
మంజులకవిత్వధోరణి మత్సఖుండు!

శ్రవణయుగళమార్గంబున సర్వగాత్ర
మాక్రమించితి వల్లన నపుడు దేవి!
అఖిలభువనమ్ము విస్మృతమయ్యె, నెదుట
నీమనోహరరూపంబు నిలుచు కతన!

హంసపల్కులచే నిషధాధిపతికి
భీమభూపాలపుత్త్రిపైఁ బ్రేమవోలె
ఆప్తువాక్యము లాలించినంత నాకుఁ
బ్రణయ ముదయించి నీయెడఁ బరిఢవిల్లె.

విజయవాడ పురమ్మును విడిచి యవలఁ
గృష్ణవేణీమహోత్తరంగిణిఁ దరించి
తూర్పు కనుమల దాటుచుఁ దుదకు నాదు
మానసము చేరె గుంటూరు మండలమ్ము!

౧౦

విరహసంతాపభరమున వేగివేగి
త్వన్ముఖసుధాంశుబింబసందర్శనాభి
రతిని నిల్చితి మీహర్మ్యరమ్యపట్ట
భంగపాళీలసత్పురోభాగమందు.

అంగణవిరాజమాననవ్యామ్రవిటపి
లలితకుసుమపరిమళలహరిఁ దెచ్చి
గంధవాహకుమారుఁడు కరుణతోడ
నాకు నామోద మొనగూర్చినాఁడు దేవి!

నీపికల్ సదనాంతర దేశమందు
వెలుఁగుచున్నది తారకావిలసనమున;
మురువు గుల్కెడి భవదీయముఖసుధాంశు
బింబ ముదయింపలేదు సంప్రీతి నెఱప!

నిష్ఫలం బింక నిచ్చట నిలుచు టనుచు
మది నిరాశను వ్యథ చెంది మరల నుండ
అంబువాహతిరస్కరిణ్యంతరోది
తేందుమండల మట్లు కాన్పించినావు!

దుస్సహవిరహభారదోధూయమాన
మానసము చల్లబడియె నమందలీల
భవ్యమందారకల్పకపారిజాత
పల్లవరసాభిషేకంబు భంగి నపుడు.

ధవళకౌశేయపరిధానధారిణివయి
దేహలత హేమదీధితిఁ దేజరిల్ల
వెలుఁగమనంబుతో నీవు వచ్చునపుడు
కేవలము లక్ష్మివనియెడి భావ మొదవె!

అమృతబిందుకదంబకస్యంది హృదయ
హారివిస్ఫారితవిలోచనాబ్జయుగళి
నిండుగా నీవు నామీద నిల్పినపుడు
లయము నొందితి మాధుర్యలహరిలోన

ద్వారదేశమునుండి తత్పార్శ్వసీమ
కతిమృదుమనోజ్ఞగతిని నీ వరిగి దేవి
ఇంతలో రత్నపుత్రిక హేలతోడఁ
గ్రమ్మరిలినావు ద్వారోపకంఠమునకే!

అలసవలితములై యీషదార్ద్రములయి
ముగ్ధహరిణీవిలోకనస్నిగ్ధము లయి
యలరునీనేత్రకోణనిర్యత్కటాక్ష
పంక్తులకు నైతిఁ బాత్రము ప్రణయమూర్తి!

మధురభావావశీలసన్మతిని నేను
మధురిమముకన్న మధురమౌ మధురమూర్తి
మధురయామిని వేళ నీమధురిమమునఁ
బూర్ణముగ ముగ్ధభావము పొందినాఁడ!

౧౭

బౌద్ధులకు నాకు బుద్ధిలోఁ బ్రణయమూర్తి!
అరయ నెంతటి తారతమ్యంబు కలదు!
ఉభయులకుఁగూడ సాదృశ్య మున్న దొకట:
నాకు వారలకును "త్రిరత్నములు" కలవు!

నిర్మలం బయి సంస్తవనీయ మగుచు
నుత్సుకోత్క్షిప్తమత్కర్ణయుగ్మమునకు
దివ్యభూషాయమానమై తేజరిల్లు
త్వద్గుణగణంబు ప్రథమరత్నంబు దేవి!

చతురవాణీ లసద్గ్రంథజాత పఠన
సక్తదృఢమత్యనాదృతసమయ మగుచు
నక్కజము గొల్పు నీదు విద్యాభినిరతి
తరళరూపద్వితీయరత్నంబు దేవి!

ధీరగంభీరశాంతమదీయహృదయ
చలన మొనరించి మరల సంసారవాంఛ
పొడమఁ జేసి నీ కమృతంపుఁబూత యైన
రమ్యలావణ్యము తృతీయరత్న మప్సర!

అమలినములైన యీ త్రిరత్నముల దేవి!
స్తవము చేయుచునుందు నస్తందిసంబు
స్వాంతసంస్థితమౌ వ్యథాధ్వాంతపటలి
తెరలుచుండును నీనిదీధితులచేత!

తరుణమార్తండరుచివోలె నరుణమగుచు
జృంభితాంభోరుహముభాతి స్మేరమగుచు
పృషశిరీషసంవర్తికాపేశలమయి
యలరు నీపాదయుగళి ధ్యేయంబు నాకు!

వికసితసరోజనిర్నిద్రవిభ్రమంబు
పూర్ణిమాచంద్రబింబసంస్ఫూర్తిశాలి
ఇందిరామందిరము సుధాహేమకలశ
మగు భవద్వదనంబు ధ్యేయంబు నాకు!

ఫుల్లనీలోత్పలప్రభాపుంజ మగుచు
నమలబాదామఫలరూపహారియగుచు
మంజులాకర్ణవిశ్రాంతిమహితమగుచు
నలరు నీనేత్రయుగళి ధ్యేయంబు నాకు!

వాసవమణిద్యుతిచ్ఛటాభాసురంబు
చిక్కణతమాలదీర్ఘతిస్నిగ్ధముగ్ధ
మాకళిందసుతాతరంగాభిరామ
మగు భవత్కైశికంబు ధ్యేయంబు నాకు!

౧౮

అప్సర! నాకంటె నెంతటియధికవిశద
పుణ్య మొనరించె మీయింటి పొగడ తరువు!
వివిధరీతుల నిన్ను సేవించుచుండు
యోగ్యమైన ఫలమ్ముల నొందుచుండు!

ఆయతగవాక్షపార్శ్వ వేత్రాసనమ్ము
నధివసించి పికాంగనామధురఫణితి
సరసకావ్యముఁ బఠియించు సమయమందుఁ
జల్లదన మిచ్చు వకుళవృక్షంబు నీకు.

క్లాంతిఁ గని నీవు మధ్యాహ్నకాలమందు
మృదులపర్యంకతలమున మేను చేర్ప
సలుపు శీతలమారుతచాలనంబుఁ
దాళవృంతాయమానమై తరువు నీకు.

చారువిమలసాయంతనసమయములను
మధురవిలసనమున నీవు మండనమ్ము
చేసికొనుచుండునపుడు విచిత్రపత్ర
విభ్రమము గొల్పు నీకుఁ బృథ్వీరుహమ్ము.

జాలమార్గమునందు నిషణ్ణవైన
నీకు రజనిని వకుళావనీజ మమల
సౌరభవ్యాప్తిఁ గొల్పు విహారలీల
మధురభావోపవనదివ్యమార్గములను.

నీవు తల్పశయానవై నిదుర వోవఁ
గన్నుఁగవ మూయ వకుళవృక్షంబు నీకు
మందపవనచలత్పర్ణమర్మరంపు
మృదులగానముతో స్వాప మొదవఁ జేయు.

నీవు కరుణాతరంగితనేత్రయుగళి
వేడ్కఁ సారించు వేళల వృక్షరాజు
సమ్మదోదితసంచలనమ్ముఁ గ్రమ్ముఁ
గంపమానపత్రావళీకైతవమున.

కుసుమములు సంగ్రహించెడి కోర్కె నీవు
మృదులహస్తసంస్పర్శచే నుదితమైన
వేపథువు మాటుకొనుచుండు వృక్షరాజు
భూరిసంభ్రమపతయాళుపుష్పమిషను.

అక్కర! నాకంటె నెంతటి యధికవిశద
పుణ్య మొనరించె మీయింటి పొగడతరువు!
వివిధరీతుల నిన్ను సేవించుచుండు
యోగ్యమైన ఫలమ్ముల నొందుచుండు!

([illegible])

229 పుటలు జూడుము.

LIBRARY

ధర్మశాస్త్రము - మహామహేంద్రజాలము

వాసా సూర్యనారాయణ శాస్త్రి గారు

శ్యామావధాని నరసింహశాస్త్రి ప్రవేశింతురు.

రంగము: శ్రీకృష్ణవిలాస గ్రంథాలయము.

శ్యామావధాని:—నరసింహశాస్త్రీ! ధర్మశాస్త్ర మహామహేంద్రజాలమును ఉగాదిసంచికలో చదివినావా? చాలతమాషాగా నున్నది కాదూ!

నరసింహశాస్త్రి:-ధర్మశాస్త్రసంగతి తెలియనివాళ్లకు బాగానే యుంటుంది.

శ్యామా:-మొదటియాక్షేపములన్నీ ప్రారంభోక్తులే కాని ప్రాయశ్చిత్తం తమాషాలోమాత్రం ఊపిరిఆడకుండా కారికలను కురిపించి తమసిద్ధాంతమును గురువుగారు బలపర్చినారు కాదూ!

నర:- అవధాన్లూ! తెయితక్కలపనస, డప్పుడుక్కలపాట వలె, అర్థం పర్థం లేనిమాటలహడావుడికి నీవు మెచ్చుతావు గాని పండితులు మెత్తురా?

శ్యామ:-నీమాటలువింటే నావొళ్లుమండుతున్నది. ఆతప్పు లేదో చూపింపుమీ!

నర:,ఏస్థలంలో చూపించమన్నావు?

శ్యా:-శ్లో. అకామతః కృతే పాపే ప్రాయశ్చిత్తం విదుర్బుధాః; కామకారం కృతే ఒప్యాహు రేకే శ్రుతినిదర్శనాత్. అని మనువు "ఏకే" అనుటలో మతాంతరమందస్వరసతను తెలిపియున్నాడు. కాబట్టి కామకృతంలో ప్రాయశ్చిత్తంలేదు. శాస్త్రుల్లూ! దీనిలో తప్పేమి యున్నది?

నర:-దీనిలో బండతప్పు ఉన్నది చూడు "శ్రుతినిదర్శనాత్" అనే హేతూపన్యాసముయొక్క అర్థమునువిచారిస్తే ఆతప్పు బయలుపడుతుంది. వేదములో కామకృత మహాపాతకములకు ప్రాయశ్చిత్తము స్పష్టముగా చెప్పబడియున్నది. కాబట్టి కామకృతంలో కూడా ప్రాయశ్చిత్తం కలదని కొందరు ఆచార్యులు చెప్పిరి.అని దానితాత్పర్యము. వేదంలో చెప్పబడినదే అస్వరసము, మతాంతరము అప్రమాణము, అంటే మన ఆస్తికత్వము మనశిష్టత్వము మనవైదికత్వము ఏయేట్లో కలుస్తవి? మనువే. శ్లో. ధర్మం జిజ్ఞాసమానానాం ప్రమాణం ప్రథమం శ్రుతిః' అనగా ధర్మనిర్ణయమునకు వేదమే ముఖ్యప్రమాణము అని చెప్పియున్నాడు. "ఏకే" అనుపదము సర్వత్ర అస్వరసతాసూచకము కాదు. ఉజ్వల మస్కరి, మన్నగు భాష్యములలో "ఏకే ఆచార్యాః" అని వ్యాఖ్యానమును చేసియున్నారు.

గౌతమ:-సూ. త్రిరోష్ఠౌ పరిమృజేత్, ద్విరిత్యేకే, సకృదుపస్పృశేత్, ద్విరిత్యేకే; ఈరెండుస్థలములలోను తుల్యవికల్పము. అస్వరసత లేదు.

సూ:-"తిస్ర ఏకే క్రమవికల్పమేక బ్రువతే!"ఇది జాబాలిశ్రుతితము. నేడును మనవారందరున్నూ వికల్పమతమునే ఆశ్రయిస్తూ ఉన్నారు గాని సముచ్చయమును ఆశ్రయించలేదు.

కఠశ్రుతి:-"అస్తీత్యేకే; నాయమస్తీతి చైకే"ఈరెండున్నూ మతాంతరము లేనా?

సూ:-"షడిత్యేకే" ఇది మనుమతము.

ఇట్టివి శ్రుతిస్మృతులలో వేనవేలు గలవు. నాటి పరిచయంగలవారికి "ఏకే"అన్నది సర్వత్ర అస్వరసతాసూచకమని తోచదు. 'ఏకే' అనుపదమునకు ముఖ్య, అన్య, కేవల, అనేఅర్థములే యున్నవి గాని నింద్యార్థము లేదు. మాధవాచార్యులుగారు"గవాంబంధనయోక్త్రేషు" అనుశ్లోకవ్యాఖ్యలో "అకామతః కృతే పాపే" అనే యీవచనమునే ఉదాహరించి మనువును ప్రాయశ్చిత్తసద్భావవాదులలో మొదటివానినిగా పేర్కొన్నాడు. వేదవేదాంగభాష్యకర్తయగుమాధవునకు మనపాటిపాండిత్యం లేక పోలేదు. మనువును అవైదికునిచేయుటకంటే శ్రుతికిన్నీ మనువునకున్నూ, కామకృతములలో ప్రాయశ్చిత్తము ఇష్టమని చెప్పుటే స్వరసము. మనువు దీనిపైశ్లోకము. "కామతస్తు కృతం మోహా త్ప్రాయ

శ్చిత్తైః పృథగ్విధైః" అని విస్పష్టముగా కామకృతము నకు ప్రాయశ్చిత్తమును విధించియున్నారు.

శ్యామ:— శాస్త్రుల్లూ! ఆ శ్రుతియేదో చూపిస్తావా?

నర:— కుల్లూకభట్టుగారే ఆ శ్రుతిని వ్యాఖ్యలో చూపించినారు. శ్లో. ఇంద్రో యతీన్ సాలావృకేభ్యః ప్రాయచ్ఛత్; త మశ్లీలా వాగభ్యవదత్; స ప్రజాపతి ముపాధావత్; తస్మా ఏత ముపహవ్యం ప్రాయచ్ఛత్" ఇతి.

తా. ఇంద్రుడు యతులను కుక్కలచే కరిపించి చంపించినాడు. వానికి బ్రహ్మహత్య చుట్టుకున్నది. బ్రహ్మదేవునిదగ్గరకుపోయి మొరపెట్టగా ఉపహవ్యమనే ప్రాయశ్చిత్తమును విధించినాడు. అని ఈవిధంగా శ్రుతిలో కామకృతమునకు ప్రాయశ్చిత్తం ఉండుటచేత మనువునకున్నూ ప్రాయశ్చిత్తం ఇష్టమే అని సిద్ధాంతము.

శ్యా:— శాస్త్రుల్లూ! నాకొక ప్రశ్న పుట్టినది. ఇంద్రుడు చచ్చిన యతులను కుక్కలకు వేసినాడా? లేక బ్రతికిన యతులను కుక్కలకువేసినాడా? శ్రుతిలో హత్య జ్ఞాపకము లేదుకదా?

నర:— అవధాన్లూ! నీకున్నూ రోగము బాగా ముదిరినదిలే.

ఈకథ వేదంలో మూడునాలుగు స్థలములలో చెప్పబడినది.

"శ్లో. యతీనా మన్యమానానాగ్ం శీర్షాణి పరాపత్య తా ఉత్తరవేద్యా అవన్. ఇతి"

ఇంద్రుడు కర్మపక్షపాతి. యతులు కర్మత్యాగులు. ఆక్షేపించేరను యజ్ఞంలో ఉత్తరవేదిదగ్గరకు కుక్కలచే కరిపించి చంపించినాడు. ఇది బుద్ధిపూర్వకమే. విద్యారణ్యభాష్యమును చూడుము. కుల్లూకభట్టు మనవలెనే వేదవేదార్థజ్ఞానములేని భట్టాచారికాడు. ఇంకనూ అనేక శ్రుతులు కామకృత మహాపాతకములకు ప్రాయశ్చిత్తమును చెప్పుచున్నవి, శ్లో. ఏషా వా సర్వా ప్రాయశ్చిత్తిః తరతి సర్వపాప్మానం తరతి బ్రహ్మహత్యాం యోఽశ్వమేధేన యజతే. బ్రహ్మహత్యాం వా ఏతే ఘ్నంతి. భ్రూణహత్యాం వా ఏతే ఘ్నంతి; వీరహత్యాం వా ఏతే ఘ్నంతి. ఇట్టివి అనేక శ్రుతులు బ్రహ్మహత్యాదిమహాపాతకములకు కామకృతములకు ప్రాయశ్చిత్తమును విధిస్తూ ఉన్నవి. శ్రోత్రియులు నీప్రశ్నను వింటే నవ్వుతారు. పైన యెక్కడా యిట్టిప్రశ్న వేయకుము.

శ్యా:- ఈప్రశ్న మహామహేంద్రజాలవ్యాసంలోనిది కాదుగాని కర్ణాకర్ణికగా విని వేసినాను. సమాధానమును జక్కగానే చెప్పితివిలే.

నర:- ఎన్నిప్రమాణములను, యుక్తులను, చూపి సమాధానమును చెప్పినా నీపల్లవిని నీవు విడుచువాడవు కావు.

శ్యామ:- శ్లో. ప్రాయశ్చిత్తీయతాం ప్రాప్య దైవాత్పూర్వకృతేన వా; న సంసర్గం వ్రజే త్సద్భిః ప్రాయశ్చిత్తే ఽకృతే ద్విజః. దీనిలోకూడా "దైవాత్" అనుపదముచేత అనిచ్ఛాకృతములకే మనువు ప్రాయశ్చిత్తమును చెప్పినాడుగదా!

నర:- పూర్వోత్తరసందర్భముల నెరుగనివారి కట్లే కనపడవచ్చును. అది కేవలము పొరపాటు.

చూ:- శ్లో. అకుర్వ న్విహితం కర్మ నిందితం చ సమాచరన్, ప్రసక్త శ్చేంద్రియార్థేషు ప్రాయశ్చిత్తీయతే నరః.

తా. విహితకర్మలను చేయక పోవుటచేతనున్నూ నిందితకర్మలను చేయుటచేతనున్నూ ఇంద్రియార్థప్రసక్తు (భోగలంపటు) డగుటచేతనున్నూ ప్రాయశ్చిత్తార్హుడగుచున్నాడు. శ్లో. ఇంద్రియార్థేషు సర్వేషు న ప్రసజ్యేత కామతః" అని స్మృత్యంతరవచనముచే కామకృతము లయిన యింద్రియార్థప్రసక్తులే ప్రాయశ్చిత్తనిమిత్తములని స్పష్టమగును. "౪౫ శ్లో. కామకారకృతే ప్యాహు రేకే శ్రుతినిదర్శనాత్. ౪౬ శ్లో. కామతస్తు కృతం మోహా త్ప్రాయశ్చిత్తైః పృథగ్విధైః." అనిన్నీ కామకృతమునకు ప్రాయశ్చిత్తమును చెప్పినమనువు ౪౫ వ శ్లోకములో అనిచ్ఛాకృతములకే ప్రాయశ్చిత్తమని స్వోక్తివిరోధముగా సూచించునా?

శ్యా:— "దైవాత్" అంటే అర్థమేమి?.

నర:— దానికి కుల్లూకభట్టు యొక్కవ్యాఖ్యానమును చూడు "ప్రాయశ్చిత్తీయతామితి దైవాత్ ప్రమాదాత్. అన్యశరీరకృతేన ప్రాగ్జన్మార్జితేన గుప్తకృతేన క్షయరోగాదిభి స్సూచితేన ప్రాయశ్చిత్తీయతాం ప్రాప్య అకృతే ప్రాయశ్చిత్తే సాధుభి స్సహ యాజనాదినా సంసర్గం నగచ్ఛేత్." అని

తా. గతజన్మలలో బ్రహ్మహత్య మొదలయిన పాపములు చేసినవారికి ఈజన్మలో క్షయరోగము, పుప్పిగోళ్లు, పుప్పిపన్ను మొదలయిన చెడులక్షణములు కనపడును. ఆచిహ్నములను బట్టి గతజన్మపాపస్వరూపమును తెలిసికొని వాటికన్నీ విహితప్రాయశ్చిత్తమును చేయించుకొనక సత్పురుషులతో సంసర్గము చేయకూడదని యీ శ్లోకములో నిరూపించినాడుకాని అనిచ్ఛాకృతములకే ప్రాయశ్చిత్తమని నిరూపించలేదు. దీని తరువాయి శ్లోకములను చూడుము. "౪౭. ఇహ దుశ్చరితైః కేచిత్ కేచిత్పూర్వకృతైనచ. ౪౮. సువర్ణచోరః కౌనఖ్యం సురాపః శ్యావ దంతతాం"అని చెప్పినాడు.

శ్యామా:—పూర్వోత్తరసందర్భాలను బాగా కప్పివేసి ఇంద్రజాలం తమాషాగా నే చేసినారు. బోధపడ్డదిలే.

నర:—ఇంద్రజాలమే కాదు. విమర్శనాశక్తి పనకూడా అంతే.

శ్యామా:—శాస్త్రుల్లూ! ఇంకొకముఖ్యప్రశ్నకు సమాధానం చెప్పుము.

శ్లో. ఇయం విశుద్ధి రుదితా ప్రమాప్యా కామతో ద్విజమ్
కామతో బ్రాహ్మణవధే నిష్కృతి ర్నవిధీయతే.

అనియే చెప్పినాడు. 'అవిధీయమానం' అనగా అనిర్దేశ్యం "మరణాంత మనిర్దేశ్యం" అను పరిభాష చేతనున్ను "భృగ్వగ్నిపతనా ద్వృతే" అను నితరమహర్షి వచనముల చేతనున్ను మరణాంతప్రాయశ్చిత్తం సిద్ధిస్తున్నది కాదా!

అవధాన్లూ! వ్యాకరణజ్ఞానము దివ్యచకోరంగా ఉన్నది. శానచ్ప్రత్యయాంతమయినవిధిన్నీ, యప్రత్యయాంతమయిన నిర్దేశమున్నూ తుల్యార్థకములెట్లు అగును? విధినిర్దేశములు భిన్నార్థకములు. కావుననే యేవ్యాఖ్యాతయు నట్లు సమన్వయించలేదు. కుల్లూకభట్టు వ్యాఖ్య "ఇయ మితి: ఏతత్తుప్రాయశ్చిత్తం విశేషతః ఉపదేశమంతరేణ అకామతో బ్రాహ్మణవధే అభిహితం. కామతస్తు బ్రాహ్మణవధేనేయం నిష్కృతిః నైత ప్రాయశ్చిత్తం కిం త్వతో ద్విగుణాధిక మరణాత్మక మితి ప్రాయశ్చిత్త గౌరవార్థం న తు ప్రాయశ్చిత్తాభావార్థం 'కామతస్తు కృతం మోహాత్ప్రాయశ్చిత్తైః పృథగ్విధైః' రితి పూర్వోక్తవిరోధాత్" ఇతి.

తా. పూర్వార్థమందున్న "ఇయం" అను సర్వనామను ఉత్తరవాక్యమందున్న "నిష్కృతి" అను పదమునకు విశేషణముగా సమన్వయించి అకామకృతమునకు ఈపూర్వోక్త ద్వాదశవార్షిక ప్రాయశ్చిత్తము విహితమనిన్నీ, కామకృతమునకు ఈ ద్వాదశవార్షిక వ్రతము విధింపబడదనిన్నీ చెప్పి ద్వైగుణ్యమున్ను, మరణాంతికాదులున్ను కామకృతమునకు విహితప్రాయశ్చిత్తములని చెప్పి ప్రాయశ్చిత్తమే లేదంటే మనువునకు స్వోక్తివిరోధము చూపి సరసంగా సమన్వయించినారు.

శ్యా. 'ఇయం' అంటే ఒక్క ద్వాదశవార్షికమునకు గ్రహణమెట్లు? మనువు దీనికి పూర్వమందు ద్వాదశవార్షికమును, మరణాంతికమును, అశ్వమేధమును, ఇంకను మరికొన్నిటిని చెప్పినాడు కాదా?

నర:—అవును; ఆరుత ప్రకారము సమన్వయముచేసి చూడుము.

శ్యా:—"అకామతః ద్విజం ప్రమాప్య ఇయం విశుద్ధిః ద్వాదశవార్షికం మరణాంతికం అశ్వమేధాదిచ ఉదితా"ఉక్తాఅంటే అకామకృతమునకే మరణాంతికముకూడా సిద్ధిస్తుంది.

నర:—అవధాన్లూ! మహామహేంద్రజాలవ్యాసంలోనే "ప్రాణాంతికం చ యత్ప్రోక్తం...తత్కామకారవిషయం" అని యున్నదిగదా. మరణాంతికప్రాయశ్చిత్తము ను అకామకృతమునకు చెప్పితే స్మృత్యంతరవిరోధము రాదా? ఇంతే కాక యిదివరకే మరణాంతికమును మనువు విధించియుంటే తిరిగీ యిక్కడ "నవిధీయతే" అవిధీయమానం అనిర్దేశ్యం మరణాంతికం" అని ప్రోక్తగా మరణాంతికమును విధించనేల? అకామకృతమునకు కామకృతమునకు రెంటికిన్నీ మరణాంతిక ప్రాయశ్చిత్తము మనువుచే విధింపబడునా? ఆలోచింపుము.

శ్యా:—"ఇయం" అను సర్వనామకు పూర్వోక్త బ్రహ్మహత్యా ప్రాయశ్చిత్తముల నన్నిటినీ గ్రహించుటకు వీలులేదని యిప్పుడు స్పష్టమయినది. కాని ద్వాదశవార్షికమునే గ్రహించుటకు ఉపపత్తి యింకను కుదరలేదు.

నర:—అదెన్నో కుదురుతుంది. "ఇయ విశుద్ధి రుదితా" అనుదానికి పూర్వశ్లోకములయందు ఏ ప్రాయశ్చిత్తమును మనువు విధించినాడో చూడుము.

శ్యా:—"హత్వా గర్భ మవిజ్ఞాత మేత దేవ వ్రతం చరేత్" అని భ్రూణహత్యాదులకు బ్రహ్మహత్యా వ్రతమును విధించినాడు.

నర:—మరణాంతికము వ్రతమగునా? అశ్వమేధాదులు అగునా?

శ్యా:—కావు. కావు. ద్వాదశవార్షికమే వ్రతమగును.

నర:—అవ్యవహితపూర్వ మయిన ద్వాదశవార్షికమునే "ఇయం" అను సర్వనామము గ్రహించును. ఇప్పుడు ఉపపత్తి కుదిరినదా?

శ్యా:—కుల్లూకభట్టు చాల సరసముగానే పూర్వోత్తర సందర్భములను చూచి సమన్వయంచేసినాడు.

నర:—ఆతడే కాదు. విజ్ఞానేశ్వరుడున్నూ "ప్రాయశ్చిత్తై రపైతి" అనే శ్లోకవ్యాఖ్యలో నిట్లు వ్రాసినాడు; చూడు.

"యత్తు మనువచనం ఇయం విశుద్ధి రుది తేత్యాది, తదపి ఇయ మితి సర్వనామపరామృష్టద్వాదశవార్షిక వ్రతచర్యాయా ఏవ. 'కామతో బ్రాహ్మణవధే నిష్కృతి ర్న విధీయతే' ఇత్యనేన ప్రతిషేధః న ప్రాయశ్చిత్తమాత్రస్య మరణాంతికాదేః ప్రాయశ్చిత్తస్య దర్శనాత్" అని 'ఇయం' అనుపదమును నిష్కృతితో నన్వయించి కామకృతంలో ద్వాదశవార్షికము చాలదని స్పష్టముగా చెప్పినాడు.

శ్యా:—శాస్త్రుల్లూ! ఇప్పుడు "ఇయం విశుద్ధిః అను శ్లోకమునకు అర్థము చక్కగా తెలిసినది. నిబంధన కర్తలు న్యాయముగానే సమన్వయించినారు. మహేంద్రజాలవ్యాససమన్వయము కేవల మింద్రజాలమే.

నర:—వారిసమన్వయములను చక్కగా గ్రహించుటే మన పాండిత్యము. మన మెక్కడ! స్మృతులకు క్రొత్త సమన్వయ మెక్కడ? నక్క యెక్కడ? దేవలోక మెక్కడ? సిగ్గు! సిగ్గు! ఈసమన్వయం చూస్తే పండితులు పక్కుమని నవ్వరా?

శ్యామ:—కామకృతంలో ప్రాయశ్చిత్తం లేదని చెప్పిన బోధాయనాది వాక్యములకు వ్యవస్థ ఎట్లు?

నర:—దానికి నేను వేరుగా చెప్పనక్కరలేదు. విజ్ఞానేశ్వరుడు. "ప్రాయశ్చిత్తై రపైత్యేనః" అనుశ్లోకవ్యాఖ్యలోనున్నూ, మాధవాచార్యులు "గవాంబంధనయోక్త్రేషు" అనుశ్లోకవ్యాఖ్యానములోనున్నూ చక్కగా కుండకొట్టి వ్యవస్థను ఏర్పరచియున్నారు. వాటినిచూచిన వారికి సంశయమే కల్గదు.

యాజ్ఞ:—శ్లో. ప్రాయశ్చిత్తై రపైత్యేనః యదజ్ఞాన కృతం భవేత్, కామతో వ్యవహార్యస్తు వచనా దిహ జాయతే.

తా. బుద్ధిపూర్వకమహాపాతకములలో ప్రాయశ్చిత్తములచే వ్యవహార్యత్వము మాత్రమే సిద్ధిస్తుంది. నరకనివృత్తికి స్మృత్యంతరములు మరణాంతిక ప్రాయశ్చిత్తమును విధిస్తున్నవి. అని. విజ్ఞానేశ్వరీయవ్యాఖ్య... "యత్రతు బ్రహ్మహా సురాప...అపతితత్యాగినః పతితాః, పాతకపాతకసంయోజకా శ్చేతి గౌతమోక్తమహాపాతకాదౌ వ్యవహార్యత్వం నిషిద్ధమ్, తస్మిన్ పతనీయే కర్మణి కామతః కృతే వ్యవహార్యత్వమాత్రమ్ న పాపక్షయః......పతనీయేఽపి కర్మణి మరణాంతికప్రాయశ్చిత్తేషు కల్మషక్షయో భవత్యేవ; ఫలాంతరాభావాత్. నాస్యాస్మిన్ లోకే ప్రత్యాపత్తి ర్విద్యతే. కల్మషం తు నిర్హణ్యతే. ఇత్యాపస్తంబవచనాత్."

తా. గౌతమునిచే చెప్పబడిన బ్రహ్మహత్యసురాపానము మొదలయిన కామకృత పతనీయకర్మలయందు వ్యవహార్యత్వము నిషిద్ధమయినది. అట్టి కర్మలయందు ప్రాయశ్చిత్తములచే వ్యవహార్యత్వమే సిద్ధించును గాని పాపక్షయము కాదు. మరణాంతికప్రాయశ్చిత్తము చేసుకుంటే అట్టి పతనీయములయందున్నూ నరకనివృత్తి కలుగుతుంది. ఇతరఫలము లేదుగనుక ఆపస్తంబుడు, "మరణాంతికప్రాయశ్చిత్తం చేసుకున్నవానికి ఈలోకంలో వ్యవహార్యత్వము లేదు. నరకనివృత్తి అవును" అని చెప్పినాడు.

మాధవాచార్యులు: "అతో ద్విగుణప్రాయశ్చిత్తేన ఇహలోకే వ్యవహార స్సిధ్యతి. యస్తు వ్యవహార మనపేక్ష్య పరలోకనిర్వాహమేవ కేవలమపేక్షతే తస్య బుద్ధిపూర్వకేషు మహాపాతకేషు మరణాంతికమేవ ప్రాయశ్చిత్తమ్.

తా. అంగిరోవచనప్రకారము ద్విగుణప్రాయశ్చిత్తం చేస్తే వ్యవహార్యత్వము సిద్ధిస్తుంది. మరణాంతికము చే నరకనివృత్తి అవుతుంది. కాగా కామకృతమహాపాతకములకు ప్రాయశ్చిత్తము లేదనే మునులకు అభిప్రాయ మేమిటి అంటే వ్రతాదులచే నరకనివృత్తి కాదని. ప్రాయశ్చిత్తము ఉన్నదనే మునులయొక్క అభిప్రాయ మేమిటి అంటే వ్రతాదులచే సవ్యవహార్యత్వము కలుగుతుందని. ఇట్లే శూలపాణివైద్యనాథకమలాకరాదులు ఏకగ్రీవముగా వ్యవస్థచేసినారు. ఆవ్యవస్థలను సావకాశముగా చూచినవారియెదుటను ఈ యింద్రజాలం పారదు అని స్పష్టముగా చెప్పగలము.

శ్యా:—ఇంద్రజాలవ్యాసంలో "కామకారంకృతే" "ప్రత్యాసత్తిః" అనేపాఠము లున్నవి. నీసమాధానములలో "కామకారకృతే" "ప్రత్యాపత్తిః" అనే యుచ్చారణ వినబడుచున్నది. వీటిలో ఏపాఠములు సాధువులు?

నర:—'కామకారం'అనుద్వితీయకు దేనితోనన్వయమో నీవే చూచుకొనుము 'ప్రత్యాసత్తిః' అంటే సామీప్యము అర్థము. ఆయర్థము ఇచ్చట సరిపడదు. ఈ గ్రంథములయొక్క తెనుగుఅచ్చుప్రతులలో ఈరెండు తప్పులు ప్రమాదంవల్ల పడ్డవి. వాటిని దిద్దుకొనుటకు శక్తి లేక పప్పులో కాలు వేసినది. ఇంతేమున్నా ఇంద్రజాలమునకు ఒప్పులు తప్పులు చేయుటయే స్వభావంగాని తప్పులను ఒప్పులు చేయుట స్వభావం కాదుగదా:—

నాగరి ప్రతులను ఒకసారి చూడుము.

శ్యా:—ఈమాత్రానకేనా స్మృతులకు నూతన వ్యాఖ్యానములను చేస్తామని బడాయీలు చెప్పుకొనుట?

శ్లో. 'ప్రాయశ్చిత్తై రపై త్యేనః' అను శ్లోకముయొక్క ఉత్తరార్థము ఏల ఉదాహరింపబడలేదు?

నర:—"కామతో వ్యవహార్య స్తు వచనా దిహ జాయతే" అని దానియుత్తరార్థము ఉన్నది. కామకృతపాపసామాన్య మంతమున్నా ప్రాయశ్చిత్తములచే వ్యవహార్యత సిద్ధిస్తుంది. అనిదాని తాత్పర్యము. ఆయర్థము ఇంద్రజాలవ్యాసమునకు గిట్టదు.

శ్యా:—కోడిని కుంపటిని పట్టుకొని కొండ యెక్కిపోతే మరి తెల్లవారదా?

నర:—ఇంకొక్క దానినికూడా చూడుము. "అభిసంధికృతే పాపే సకృ ద్వా సేహ నిష్కృతిః" అనే వచనమునకు సరిగా అర్థం కాలేదు. దీనియుత్తరార్థము "అపరే నిష్కృతిం బ్రూయు రభిసంధికృతేపిచ" అనియున్నది. ఇది ప్రాయశ్చిత్తసద్భావమునే బోధిస్తూయున్నది.

శ్యా:—"శ్లో. విశేః ప్రాథమికా దస్మాత్" ఈప్రమాణము ఏయర్థమును బోధిస్తూ ఉన్నది?

నర:—బుద్ధికృత మహాపాతకాదులు మూడుసారులు చేసినను ప్రాయశ్చిత్తము గలదనిన్నీ నాల్గవసారి తిరిగి చేస్తే లేదనిన్నీ దానితాత్పర్యము.

శ్యా:—అబ్బా! ఋషిహృదయములు ఎంతకరుణామయమయినవి? అయితే ఈవచనము స్వపక్షమునకు బాధకంగాని సాధకంకాదు.

నర:—స్వపక్షసాధకంగా ఏగ్రంథోక్తవ్యాఖ్యానము బయల్పడునో? నేను విజ్ఞానేశ్వరమును బట్టి చెప్పితిని.

శ్యా:—"గురూణా మప్యధిక్షేపః" ఈవచన మెందుకు?

నర:—ఇది మహాపాతకవిషయం కాదు. పాతకవిషయం. ప్రకృతసిద్ధాంతమునకు అదనిన్నీ అసంబద్ధమే. ఉదాహృతప్రమాణములన్నీ కుంభకర్ణయుద్ధమువలె స్వపక్షపరపక్షవిభాగం లేకుండా పామరవ్యామోహకములై యున్నవి.

శ్యా:—మనువు అకామకృతమునకు ద్వాదశవార్షికమునున్నూ, కామకృతమునకు మరణాంతికమునున్నూ విధించినట్లు మొదట సిద్ధాంతముచేసి చివరకు గౌతమాపస్తంబవచనములను పేర్కొని అకామకృతమునకే ద్వాదశవార్షికమున్నూ మరణాంతికమున్నూ తుల్యవికల్పములని సిద్ధాంతితమయినది. అకామకృతమునకు మరణాంతికప్రాయశ్చిత్తమును చెప్పరాదని "ప్రాణాంతికం చ యత్ప్రోక్తం......తత్కామకారవిషయం" అను స్మోదాహృతప్రమాణమే బాధిస్తున్నదే! ఇచట ఇంద్రజాలవ్యాసము ఏవ్యవస్థ చేసినది?

నర:—దానికి సమాధానమును చెప్పుటకు నేనా బాధ్యుడను? వితండవాదమునకు విరోధపరిహారము వ్యవస్థ, ఈషూప లేల!

శ్యా:—అంగిరస్స విజ్ఞానేశ్వరీయంలో "విహితం య దకామానాం" "మ్లేచ్ఛైనాధిగతశ్శూద్రః......జ్ఞానేతుద్విగుణం భవేత్" అను వచనములచే ద్వైగుణ్యము ఇతరపాపవిషయంగాని మహాపాతకవిషయం కాదని స్పష్టంగా చెప్పినాడట. సత్యమేనా?

నర:—పై రెండు వచనములున్నూ అంగిరః కర్తృకములు కావు. మహ్మాటికిన్నీ కావు. సంశయముంటే నా కండ్లు ఎరువుతీసుకొని చూడు. మహాపాతకాదిసర్వపాపములయందున్నూ ద్వైగుణ్యమును విధించేవచనములు స్మృతులలో అనేకములు గలవు. నిబంధన కర్తలు కుల్లూకభట్టు, విజ్ఞానేశ్వరుడు, మాధవుడు, వైద్యనాథుడు, శూలపాణి, మొదలయినవారందరున్నూ ఏకగ్రీవముగా మహాపాతకాదులయందు ద్వైగుణ్యమును జెప్పినారు. స్మృతిపరిచయం కలవారికి ఈద్వైగుణ్యము క్రొత్తది కాదు. చూడుము.

కుల్లూకభట్టు:—మనుస్మృతి 11 అధ్యాయము 72 శ్లో. "బ్రహ్మహా......కామకృతేతు బ్రాహ్మణవధే ద్విగుణం బ్రహ్మవధప్రాయశ్చిత్తం చతుర్వింశతివర్షం;" తదాహాంగిరాః. శ్లో."అకామతః కృతే పాపే ప్రాయశ్చిత్తం నకామతః" ఇత్యాది; యాజ్ఞ ప్రాయశ్చిత్తకాండ ౨౫౯ శ్లో."ద్విగుణం సవనస్థేతు బ్రాహ్మణే వ్రత మాదిశేత్."

అత్ర మితాక్షరా:—తస్మిన్ ద్వాదశవార్షికాదివ్రతం ద్విగుణం సమాదిశేత్.

పరాశరమాధవీయం 8 అధ్యాయము ౧ శ్లో:—"అంగిరాస్తు ద్విగుణం వ్రత మాచష్టే. శ్లో. అకామతః ఇత్యాది......వచనంచ కామకృతానాం ద్విగుణం వ్రతం దర్శయతి. "శ్లో. విహితం య దకామానాం కామాత్తు ద్విగుణం భవేత్." అతో ద్విగుణప్రాయశ్చిత్తేన ఇహ లోకే వ్యవహార స్సిధ్యతి......నిర్ణయసింధువు కలియుగవర్జ్యప్రకరణము "త దన్యాని మహాపాతకాని బ్రహ్మహత్యాసురాపగురుతల్పాని త్రీణి తేషాం కామకృతానాం మరణాంతికం ప్రాయశ్చిత్తం విప్రాణాం కలౌ నేత్యర్థః. మరణాంతికేవా జాతివధనిమిత్తం ద్వాదశాబ్దద్విగుణం బ్రహ్మవధనిమిత్తంచ ద్విగుణం భవతి.

హేమాద్రి:—బ్రహ్మహత్యాప్రాయశ్చిత్తములో: యదాహగౌతమః శ్లో. యోవిప్రో బ్రాహ్మణం హన్యాత్స్వయం భృత్యాదిభి ర్యదా; చతుర్వింశతివర్షాణి వ్రతకృత్ శుద్ధిమాప్నుయాత్" పై నుదాహరించిన ప్రమాణము లన్నిటివల్లను కామకృతమహాపాతకాదులలో ద్వైగుణ్యము గలదని భాషాజ్ఞానం కలవారం దరికిన్నీ నిస్సంశయముగా తెలియగలదు. "శాస్త్రదీపిక"కు సుప్రసిద్ధవ్యాఖ్యానమయిన "యుక్తిస్నేహ ప్రపూరణి" అనే మీమాంసాశాస్త్రగ్రంథమందు "విహితం యదకామానాం" అనువచనమునే ఉదాహరించి బ్రహ్మహత్యాప్రాయశ్చిత్తవిషయము చెప్పబడినది. శబ్దార్థకల్పద్రుమవాచస్పత్యములయందు శూలపాణి మతప్రకారం కామకృతమహాపాతకములలో సర్వత్ర ద్వైగుణ్యవ్రతము విధింపబడ్డది. నిబంధనకర్తలెవ్వరున్నూ అంగిరోవచనమునకు ప్రతిపదవ్యాఖ్యను చేయలేదు. కాని తాత్పర్యమునుమాత్రము వ్రాసియున్నారు. దాని ననుసరించి మన మిట్లే వ్యాఖ్యానము చెయ్యవలసియున్నది.

శ్లో. అకామతః కృతే పాపే ప్రాయశ్చిత్తం నకామతః,
స్యాత్త్వకామకృతే యత్తు ద్విగుణం బుద్ధిపూర్వకే.

సమన్వయము:—"అకామతః కృతే పాపే విహితం ప్రాయశ్చిత్తం కామతః కృతే పాపే నభవతి. కింతు అకామకృతే యత్ప్రాయశ్చిత్తం, తత్ బుద్ధిపూర్వకే ద్విగుణం స్యాత్" అనగా అకామకృతమునకు విహితమయిన ప్రాయశ్చిత్తము కామకృతమునకు చాలదు విశేషమేమంటే ద్విగుణము చేయవలయును. అని ఈసమన్వయంలో పూర్వోత్తరవిరోధం ఉండదు. శాస్త్రీయమయినదోషం లేదు. ఇంద్రజాలవ్యాసం ఈసమన్వయం తప్పని యెంతో ఆర్భాటము చేసినది గాని దోషమును మాత్రము చూపలేక "అంగుష్ఠగ్రాయతే బహిర్వక్తుం నశక్యతే" అన్నట్లు ఒక పేజినిండా తనగాభరాను వెలిబుచ్చినది. దోషములకు లక్షణము, లక్ష్యమందు సమన్వయము చేయక తప్పు తప్పు అనుట కలతగొట్టు పాండిత్యలక్షణము. నేను చేసిన సమన్వయము నిబంధనకర్తలయొక్క తాత్పర్యానుగుణమయినదని ఖండితముగా చెప్పగలను; దానికి సహృదయులే సాక్షులు. సత్యమిట్లుండగా అంగిరస్స "బాబులారా!

ద్వైగుణ్యము మహాపాతకవిషయముకాదని మొఱ పెట్టియుండెను. అంగిరస్సున్నూ, మహర్షులున్నూ ఇట్లు మొఱపెట్టుచున్నారు. ఎలాగంటే "పెద్దనాయన లారా! ఏపాపమునకున్నూ ప్రాయశ్చిత్తం లేదని చెప్ప కండి! అది మాహృదయంకాదు. మాకున్నూ మనుష్య కారుణ్యమున్నది. మామనస్సులు శిలానిర్మితములు కావు. కుటుంబములను కూల్చ్రోయుటను మేము సహింపము. మాకు అసూయామాత్సర్యాదులు లేవు. జగత్కల్యాణమే మాకు సమ్మతిము. ప్రాయశ్చిత్తము నైమిత్తికము. నిత్య నైమిత్తికములను ప్రతిపురుషుడున్నూ చేసియే తీరవల యును. అది సర్వసమ్మతసిద్ధాంతము. జాతిని శక్తిని కా లాదుల నాశ్రయించి పరిషత్తు ప్రాయశ్చిత్తమునువిధింపవ లయునని ఘంటాఘోషమున మొఱపెట్టుచున్నారు. ఆమొఱను వినియే విజ్ఞానేశ్వరుడు "నచ మహాపాతక మను క్తనిష్కృతికం సంభవతి" అనిన్నీ మాధవాచార్యు లు "తదేవ మైహికవ్యవహారాయ పరలోకాయవా కామ కృతానాం మహాపాతకానా ముపపాతకానాం చాస్త్యే వ ప్రాయశ్చిత్తమితి సిద్ధం" అనిన్నీ తమశాస్త్రీయ సిద్ధాంతమును సర్వమహాపాతకములకు కామకృతములకు న్నూ ప్రాయశ్చిత్తంగలదని ఘంటతో చాటిచెప్పినారు.

శ్యామ: అబుద్ధికృత పాపస్థలీయ ప్రాయశ్చిత్తమునకు బుద్ధికృతస్థలమందు ప్రాప్తి యెట్లు? ప్రాప్తిలేక నిషేధముండునా?

నర. అవధాన్లూ! ఒక్కొక్క ప్రశ్నలో పాండిత్యంపస బాగా బయలుపడుచున్నది. "న పరదారాన్ గచ్ఛేత్" "నసురాం పిబేత్." ఇత్యాదిస్థలములలో ప్రాప్తి యెట్లో ఆలోచించు. శృంగగ్రాహికాన్యాయమున ప్రాప్తి రాగాదిమూలకమయి యుండును. ప్రాప్తి న్నీ నిషేధమున్నూ తుల్యబలములే అయితే ఉదితా నుదితహోమములకువలె తుల్యవికల్పమే వస్తుంది. ప్రకృతంలో చంపుట అకామకృతంలోనూ కామ కృతంలోనూ సమానమే కాబట్టి తుల్యయుక్తిచే అకామకృతప్రాయశ్చిత్తమే కామకృతంలో ఆభా సతః ప్రాప్తించగా దానిని నిషేధించి అంగిరోవచన ముచేద్వైగుణ్యము విధింపబడ్డది.

శ్యా:—ఇచట ప్రతియోగితావచ్ఛేదకం ఏది?

నర:—నీప్రశ్న చాలా బాగాఉన్నది. ప్రతియోగి తెలి యక ప్రతియోగితావచ్ఛేదకమును చెప్పుట నాతరం కాదు. "ఘటోన" అనేస్థలంలో ప్రతియోగితావ చ్ఛేదకం "ఘటత్వం"అవుతుంది. ఇచట"ప్రాయశ్చిత్తం న" అనేవాక్యముంటే ప్రతియోగితావచ్ఛేదకం "ప్రా యశ్చిత్తత్వం" అవుతుంది.

శా:—ఇది తెలిసిన లాభమేమి?

నర:—నాకున్నూ తెలియదు. వ్యాసంలో ఒక అవ చ్ఛేదకాన్ని అంగీకరిస్తే పామరులకు పాండిత్యప్రక టన అవుతుందనికాబోలు!

శ్యా:—శాస్త్రుల్లూ! ప్రాయశ్చిత్తం తమపాలో ముఖ్య ప్రశ్న లన్నిటికిన్నీ బాగానే సమాధానమును చెప్పి తివి. కాని పూర్వపక్షక వెక్కిరింపులకుకూడా సమా ధానం చెప్పతావా?

నర: ఇక్కడికే చర్చ పెరిగిపోయినది. ఉదారాశయ ము గల పండితులు నామనిర్దేశమున్నూ విషయనిర్దేశ మున్నూ లేకుంటె కాకిపిల్లిలమీద పెట్టి గోడమీద పిల్లివలె సంగ్రహముగా ఏవిషయములను ఆక్షేపింపరు. ఆక్షేపములన్నీ కళింగవైశ్యశాఖవారు చేసినాను చున్న పౌరాణికోపనయనములను ఉద్దేశించినట్లు కనపడుచున్నవి. ఆవెక్కిరింపులన్నిటికిన్నీ "వైశ్య" అనుపత్రికలలో విశాలసమాధానములు గలవు.

శ్యా:—సరే బాగానేయున్నది. కాని "ఇప్పటిహిందూ పండితుల యజ్ఞప్రాయపుచీట్లు" అనే వెక్కిరింపుకు ఒక్కదానికిమాత్రము సమాధానమును చెప్పుము:

నర:—దీనికి చిన్న గాథ గలదు. పర్లాకిమిడి శ్రీకృష్ణ విలాసగ్రంథాలయములో నేటికి 8 మాసములక్రిందట నుంచి క్రీస్తుమతంలోప్రవేశించిన ఒకబ్రాహ్మణ యువకునకు శ్రీపిఠాపురసంస్థాపితసదాచారనిబంధనీ పరిషత్తుచేనిర్ణయింపబడిన పాదోనబ్రహ్మహత్యావ్రత ప్రాయశ్చిత్తమును చేయించి సంఘంలో చేర్చుటకు వీలుకలదనిన్నీ మతాంతరప్రవేశము బ్రహ్మహత్యా సమమనిన్నీ ఆహత్యాప్రాయశ్చిత్తమునే ప్రత్యా మ్నాయరూపంగా దీనికి చేయింపవచ్చునని నిరూ పింపబడినది. ఈప్రాయశ్చిత్తము ఇంద్రజాలవ్యాస మునకు కిట్టదు. అందుచే బ్రహ్మహత్యకు మరణాంత వ్యతిరిక్తప్రాయశ్చిత్తము లేదని వాదింప ముద

లిడినది. దానిపైని గ్రంథాలయంవారు ఈశర్మ సంశయమును పలుపండితపరిషత్తులను అడుగగా మధుర, పట్టాంబి, ఉడిపి, శ్రీజగన్నాథం, విజయనగరం, పరిషత్తులు ఏకగ్రీవంగా కామకృత ప్రాయశ్చిత్తమున్నా ద్విగుణప్రాయశ్చిత్తంచే వ్యవహార్యత్వము సిద్ధిస్తుందని యథాప్రాయపత్రికలను అంపినారు. ఆపత్రికలనే "ఓట్లు" అని వెక్కిరింపు. పైవిషయము గూర్చియే రావుసాహెబ్ శ్రీ. గిడుగురామమూర్తి పంతులుగారి యధ్యక్షతక్రింద మూడుసభలు జరిగినవి. అశాస్త్రజ్ఞులున్నా ప్రాయశ్చిత్తము గలదనియే తీర్మానించినారు. ఈచర్చ అంతా కొద్దిదినములలోనే ముద్రితమై వెలువడనున్నది. ఇచ్చట యొక్కడనున్నా ఇంద్రజాలం పారనందున నేను ఉగాది సంచికలోనికి వ్రాసిన—

శ్యా:—సగం పసుపు సంతలో పోతే ఉన్నపసుపు పుల్లో పోయింది. సత్య మెన్నటికన్నీ దాగదు.

శ్లో:—ఆర్తానాం మార్గమాణానాం ప్రాయశ్చిత్తాని యే ద్విజాః, జానన్తో న ప్రయచ్ఛన్తి గచ్ఛన్తి సమతాం తు తే.

శాంతిః శాంతిః శాంతిః

అనుచూ ఇద్దరున్నా నిష్క్రమింతును.

"ఏల? ఏల? ఏఁ"

కవికొండల వెంకటరావు గారు

ఏడవగదిలోఁ బండుకొని నే
పఠనమును సేయుచుచు నుండగ
"ఏల ఏల ఏ"
అనెడుపాట హఠాత్తు వినబడె.

ఆవలకు నే తొంగిచూచితి
"నిడదవోలు మడుపు"లోన
పడవపడినది వడివడిగను
పడవవారలు లాగుచుండిరి.

'ఏల ఏల ఏ'
అనెడుపాటను పాడుచుండిరి.

"అట్లపాడు" రేవు రావి
చెట్లకొమ్మలఎత్తు చివురులు
అంతరాళంబందు మాఱన
'ఏల ఏల ఏ'
అనెడుపాట చెలంగె వింతగ.

సన్నసన్న ప్రభాతపవనపు
టున్నమతవీచికిశోరము
లన్నదమ్ములపహాసు జూపెడు
తెన్నునే నిదురించువారికి
నున్నతపు మేల్కొల్పు గొలుపుచు
'ఏల ఏల ఏ'
అనెడుపాట రహించె నెల్లెడ.

చెట్లచాటున తొంగితొంగి
తొగరుప్రొద్దుదయించుశోభలు
సొగసుగను జూపట్టుచాయనె
మొగము జూపనిముద్దుకోయిల
పరవశముగా

'ఏల ఏల ఏ'
అనెడు పాట నిజేచ్ఛ మ్రోసెను.

'ఏల ఏల ఏ
ఏల ఏల ఏ
ఏల ఏల ఏ'
అనెడుపల్లవిమాత్రమే కను
వెల్లడిని విస్పష్టమగుచును
అన్నిరకముల గొంతు లెత్తున
వీనులకు విందగుచు వినబడె.

పల్లవికి వెనుముందు బాడెడు
ఎల్లచరణము లొక్కగొంతుక
వెల్లడించినగాని సుంతయు
తెల్లముగ వినిపించవయ్యెను
'ఏల ఏల ఏ'.

'ఏల ఏల ఏ'
అనెడుఎలుంగొక ప్రశ్న మగుచును
ఆలకించెడు వారి నెవ్వగ
లకునయించెడు అఖిలరుతమో
'ఏల ఏల ఏ'.

వానప్రస్థుని విభ్రమము

శ్రీ శివశంకరశాస్త్రి, సాహితీసమితి సభాపతి

౧

దేహళీపార్శ్వమున నిల్చి దేవి, నీవు
వేడుకం గాంచుచుంటివి వెడలు "ప్రభలు"
చూచుచుంటిని మిగుల నుత్సుకత తోడఁ
బథమున న్నిల్చి నీముఖప్రభలు నేను!

స్తిమితకోమల మైన నీ సితవిలోక
నావళికి సాంద్ర మైన నాయసితనిశిత
దృక్కులకు సంఘటిల్లిన యెదురుకోలు
కుముదనీలాంబుజంబుల కుమివిధాన!

అపుడు నిలువెల్ల రోమాంచ మయ్యె నాకు
హర్షమున మే నెఱుంగఁగానైతి నంత
నిన్ను విడిపోవ బుద్ధి జనింప దయ్యె
కాని ఘంటాపథంబని కదలిపోతి!

తృప్తి దీరక భవదీయదివ్యవదన
మంజులోచిస్సుపై దేవి, మరలమరల
వెనుదిరిగి చూచుచుం బోతి, వెన్గలంపుఁ
దటిని కెదురేగుచుండెడి తరణి పోలె!

రాగము భరింపలేక హర్మ్యమ్ముచుట్టు
శీఘ్రగమనముతోఁ బ్రదక్షిణము చేసి
మరల వచ్చితి వేళాకమార్గమునను
నీముఖాంభోజ దర్శన నిష్ఠ చేత!

అరుగ నుంటివి సౌధాంతరాళమునకు
ఇంతలో నాముఖమ్ము నీదృష్టిపథము
నందుఁ దోఁచుట చే భవదాననంబు
రక్తిమం దాల్చె లజ్జాభిరామ మగుచు!

కోమల మనోజ్ఞ విమల దృక్కోణతరళ
దివ్యశీతల భవదీయ దృష్టు లంతఁ
బిక్కటిల్లి మదానన బింబముపయిఁ
జెలువుగా వ్రాలె వెన్నెలపులుగు లట్లు!

మరలి చనుచుండ నీ వంత మందిరాంగ
ణప్రదేశము వెంట నానయనయుగళి
క్రమసుస్నిగ్ధ భవదీయగండఫలక
భాగమున నాట్యమాడె జృంభణముతోడ!

గ్రీవమును రమ్యముగ వంచి క్రింది చూడ్కి
మోహనమయూరి పోలిక నాహరించి
యేకకాలమునందె మదీక్షణములు
చిత్తమును దేవి, హర్మ్యము చేరినావు!

౨

శాంతశీతలరమణీయసాంధ్యవేళ
నరుగుదెంచుచు విద్యాలయంబునుండి
రమ్యరూపంబు మన్మనోరథము దాల్చి
యెదురుపడినట్లు నీవు కాన్పించినావు!

క్షౌమధారిణివై చతుష్పథము వెంట
ధీరగమనముతో వచ్చు దేవి, నీవు
కమలగర్భుని కంత శృంగాటకమునఁ
జెలఁగు వాగ్దేవి పోల్కిఁ దోఁచితివి నాకు!

పార్శ్వవర్తిను లుంటచేఁ బక్ష్మలముల
నించుక కదల్చి యిటుఁ బ్రసారించినావు
మనసిజుని పుష్పపంచక మార్గణాభ
మైన నిశితేక్షణంబు రహస్యలీల!

ఫాలమున వ్రాలి నాసికాపథము వెంట
నధరబింబముపై జాఱి యవల నీదు
మృదుకపోలతలంబున నొదిగి తుదకు
దివ్యతాటంకసీమ నాదృష్టి నిలిచె!

భావభరమున నీమృదుపదయుగమ్ము
త్రొట్రిలగ సాగిపోతివి త్రోవవెంట
విస్మరింపక యేకాంతవేళలందు
నన్నుఁ దలపోతు వని దేవి, నమ్మువాఁడ!

౯

మొలఁగుచున్నావు నేత్రనిమీలనమున
మొలఁగుచున్నావు వీక్షణోన్మీలనమున
నిన్ను నిరతంబు ధ్యానించుచున్నవాఁడ
దేవి, వీనికి వేఱొండు దిక్కు లేదు!

ముకుళితమ్లాన మైన నాముఖసరోజ
జృంభణము సేయు తరుణార్కబింబ మీవ
యవసిపోయిన నానేత్రకువలయముల
శోషణము వాపు శీతల జ్యోత్స్న వీవ!

గాఢతాపార్త మైన నాగాత్రమునకు
సాంద్రసురభిళ చందన చర్చ వీవ
ఆధిభరమున నిర్జీవ మైనహృదికి
చారుశీతలతరసుధాసార మీవ!

ఇంపు లొలుకగ జంగమహేమవల్లి
భంగిఁ జెలఁగెడి నాబహిఃప్రాణ మీవ
నన్నుఁ బాలింపఁ గమనీయనవ్యగాత్ర
లతిక గైకొన్న నాభాగ్యలక్ష్మి వీవ!

అతివిశాలగభీరభవార్ణవంబు
నన్నుఁ దరియింపఁ జాలిన నౌక వీవ
స్థిర పవిత్రమదీయహృత్పీఠనిహిత
దివ్యవిమలానురాగాధిదేవి వీవ!

౧౦

నిర్మలప్రేమనిష్ఠను నీపదాబ్జ
పీఠమున నిల్పినాను నాస్ఫీతహృదిని
నీయఖండితకారుణ్యనిరతి నిపుడు
నాసమస్తము నర్పించినాను దేవి!

స్వచ్ఛభవదీయలావణ్యసరసిలోన
మజ్జనం బొనరించె మన్మానసంబు
చిత్తమందు వానప్రస్థవృత్తు లెల్ల
క్షాళితములయ్యె నిర్మలచ్ఛవి జనించె!

మహితజీవననిమ్నగామధ్యమందుఁ
బ్రబల నైరాశ్య భీషణావర్తవితతిఁ
బడి యడంగుదునేమొ! సప్రణయదృష్టిఁ
బాణి గ్రహియించి నన్నుఁ గాపాడు దేవి!

ఇంత లోకములోన నీవే మదీయ
మార్గదర్శక దేదీప్యమానతార
యింత సంసారజలధి నీవే మదీయ
దివ్యసంస్థితి కమృతంపు దీవి దేవి!

నాహృదయరాజ్యలక్ష్మి! యనారతమ్ము
నిన్నుఁ బూజించుచుంటి ననింద్యమతిని
ఈయకల్మషభక్తి నహీనవిమల
తావకీనకటాక్షంబు తనుపు నెపుడొ!



శ్లో. వైదేహీసహితం సురద్రుమతలే హైమే మహామంటపే, మధ్యే పుష్పకమాసనే మణిమయే వీరాసనే సంస్థితమ్;
అగ్రే వాచయతి ప్రభంజనసుతే తత్త్వం మునిభ్యః పరం, వ్యాఖ్యాంతం భరతాదిభిః పరివృతం రామం భజే
[శ్యామలమ్.

Lakshmi Art, Bombay, 8.

2 , 3

ఆంధ్రకన్య

తురగా వేంకటరామయ్యగారు

రారా! నందకుమారా!
రాగలోకసంచారా!
గోపీహృదయవిహారా!
కోమలజలదాకారా!

ఆయము నాశ్రేయములే
యందమె? చలి యేటికి! నా
కాటుకకన్నీటియేటి
కెరటముల జలకేళి దేల: రారా!

నేటిదె బృందావన! మే
నాటిదో! సొంపేమి మధుర
హిమశైలఁ బొంగునాంధ్ర
వనవీధుల విహరింపఁగ: రారా!

తుమ్మెద లాననిపూవులు
తోఁటలెల్ల వెదకి తెచ్చి
చేసినరాల్గూర్చితి నీ
తీయనికంఠానఁ దాల్ప: రారా!

కోయని తీయనిమామిడి
గున్నల తోఁపుఁగఁబండిన
తొలిపండులవిందుకు మా
తోఁటకు రావేటికిరా: రారా!

ఆవులఁ బిదికినపొంగే
యారని తీయనిపాలం
గేరుచుఁ ద్రావుచుఁ తాండవ
కేళీలీలలఁ దేలఁగ: రారా!

ప్రాభాతసుమాంబుప్లుతం
బదనగువలపుంగందము
చేతులారఁ బూసెద నా
చెంతకు నీవింతనడల! రారా!

వేణుగానవీథుల నీ
విశ్వము నాడింతువె! నా

వీణానాదసుధాలహ
రీనవడోలల నూఁచెద! రారా!

ప్రేమపుఁదోఁటల బూసిన
యామనిపూవులపానుపు
వలపుఁడరంగాల సుధా
భరితకళలఁ దేలింపదు! రారా!

తెల్లనిచల్లనివెన్నెల
తెన్నులఁ బూఁదేరు నెక్కి
మామోహనపుష్పలతా
మందిరముల కాఁపురిన: రారా!

తెల్లనివెన్నెలకాంతుల
నల్లనయిన నీమూర్తిని
జగమెల్ల గ్రహించునే
సందేహము వలదువలదు: రారా!

పరునాలినిగాను రాచ
పడఁతినిగా నసలె, నింద
పడ నోయీ! నాయంతనె
వలచినకన్నెకు భయమే: రారా!

నినుఁ బూజింపఁగఁ బెంచిన
నిరుపమానరాగసుమము
నంటక ముట్టక నింకే
యంబుధిలోఁ బడవైతువు: రారా!

మాయామర్మము లేక న
మాయికహృదయము నిచ్చిన
తెలుఁగుంగన్నియ నీలా
తెలుఁగులఁ బెట్టుట మేలా: రారా!

అమ్మ నెఱుఁగ నయ్యనెఱుఁగ
ననలే యెఱుఁగను లోకము
కమ్మనైన నీరూపమె
కన్నులఁ దాండవమాడును: రారా!

నేఁటితెలుఁగు కవిత-ఒకమిత్రుని ఆందోళనము

సోమంచి సూర్యనారాయణ శర్మ గారు

కవిత్వతత్త్వము ననేకు లనేకవిధములుగ నిర్వచించియున్నారు. ఎట్లైనఁ గవిత్వము భావావేశజన్యము. రసైకప్రధానము. అద్వైతి పరబ్రహ్మము నగుఁ గాని భావనావశమునఁ గవి సర్వప్రపంచము దా నగును. చిత్రకారుఁడు ప్రకృతినిఁ జిత్రించి ముదముఁ గొల్పినట్లు కవియు స్వభావవర్ణనములఁ బాఠకులఁ దనియించుచును; కోకిల వసంతమును గానముచేసినట్లు పరమేశ్వరునిసృష్టివిలాసములఁ గీర్తించుచుండును; జాతుల నజ్ఞానాంధకారమలముకొని నప్పుడు తన యఖర్వ ప్రతిభాశక్తిచేఁ బ్రబోధించి విజ్ఞానచంద్రికలఁ బర్వఁజేసి ప్రజలనోడుడుపును. ప్రకృతిరహస్యమును వెల్లడించుటయే యాతనిపని. ఒరుల నిందాస్తుతుల నాతఁడు గణింపఁడు. మానవనిర్మితశాసనముల కాతఁడు కట్టువడఁడు. అట్టికవి మానవయత్నమువలనను, అభ్యాసబలమువలనను నగువాఁడు కాఁడనియు నాతనిశక్తు లీశ్వరాపాదితములే యనియు "కవిర్జాయతే న తు క్రియతే" యను సూక్తియే చాటుచున్నది.

తొలుతఁ 'దెలుఁగుకవులు అంతకుమున్నుఁ గల ప్రయోగముల నరసి సంస్కరించియు క్రొత్తవి చేర్చియు రసావేశము నీభాషలోఁ జిల్కరించవలెను. ఈ యీ పద్యముల రూపమునఁ గూర్పవలెను. ఈయక్షరగణబద్ధ మీవృత్తము.' ఇట్లే యేవో భాషానిబంధనలను ఛందోలక్షణములను నేర్పరచిరి. వాని నన్నిటి నానాఁడే పాటింపక కవు లెవరియిచ్చవచ్చిన మచ్చున వారు పలుపోకలఁ బోయిరని యిప్పుడు క్షేమతులగు సోదరులు పరిశోధించి వ్యాసములమూలమునను ఉపన్యాసములమూలమును బోధించుచున్నారు. అట్టి సందర్భముల వాడుకలనేఁ గొన్నిటిని మనవారు కడు మహాకవిప్రయోగములగుట సాధువులనెదరు. అట్లు కొన్నియుద్గ్రంథములు స్వతంత్రరీతుల బయలువెడలి యనేకవిషయముల విజ్ఞానవ్యాపకమునకుఁ గారణము లైనవి. "నిరంకుశాః కవయః" అను లోకోక్తి పుట్టిన దట్టిహేతువుల నేమో? పిన్నకాలికులగు నన్నయ శ్రీనాథాదులితరలక్షణములవలన న్యూనమకవులేయని వారిని భాషాభిజ్ఞు లంగీకరించుచునే యున్నారు. ఆకవులనుబట్టియుఁ గొన్నిలక్షణగ్రంథము లవతరించినవి. తరువాత గొందఱుకవులు ఆయాసంబంధనలను, కల్పనలను, ప్రయోగములనుగూడ నక్షరధర్మములుగా గ్రహించి యనుకరించి యంధపరంపరగఁ గేవలశృంగారరసప్రధానములగు కావ్యములను లిఖించి యొకటిచదివిన నింకొకటి చదువ నక్కఱలే దనిపించిరి. ఆకాలముల బూతులబుంగలగు గ్రంథములును బయలుదేరకపోలేదు. అందులకును

వారిని నిందింపరాదు. అప్పటి మహీపతుల మెప్పించుటకు వా రట్లు చేసియుండవచ్చును. నాఁటివారి కవి రుచించియుండవచ్చును. అది యంతయుఁ గాలమహిమ!

ఇట్టి పరిస్థితులలో మామిత్రులు శ్రీ పాకకులూరి లక్ష్మీనారాయణగారు 'సంసారి... యెట్టినాయొంకి' అనుశీర్షికతో నేటికావ్యరచనను నిరసించుచు గతసంచికలో వ్రాసిన లేఖను జూడ నవ్వు వచ్చినది. ఆంధ్రకవితామతల్లి స్వతంత్రవీథిని విహరించుచున్నదని వీరివిచార మైనట్లున్నది. ముందు చెప్పఁబడినట్లు కవిత యారీతినేగదా విలసిల్లవలసినది! ఆమెను బంధించుఛాందసు లెవరు? కవితకును స్వేచ్ఛ యుండఁగూడదా? కవితయన్న హృదిభావము వెలుగునెడల వీరింత శ్రమపడవలసిన పనియే లేదు. 'యెట్టినాయొంకి' అనుపేరితో నొకరు వ్రాసినపాటను వీరు నిదర్శనముగాఁ గైకొనిరి. దానినే శీర్షికగాఁ జేసిరి. ఛందోనియమాదులు లేవని వీరి యాక్షేపణము. చాఁకలిపద్దును చంపకమాలలో వ్రాసినయెడల వీరు సంతసింతురా? కవిత ఛందస్సు నాధారముచేసికొనదా? ఛందము కవితపై నాధారపడి యున్నదా? కవితవలననే కదా ఛందస్సు బయలువెడలుట! అట్టిచో నొకకవి నవరచనకు ఛందమును దానే యేల నిర్ణయించుకొనఁగూడదు?

అందలిభావమును వివరింపఁ బనిలేదనిరి. భావమే లేదనియో అయ్యది యసభ్యమనియో వీరియభిప్రాయ మైయుండును. కొందఱవిషయములలో నయ్యది కవిత్వ మనిపించుకొనఁజాలదఁట. లక్షణవిషయము ముందే చర్చింపఁబడినది. వీరిని రేచినది భాషయా? కాదు. ఆ సంగతి వీరు చెప్పలేదు. రసమును గురించి యేమో వీరి కసహ్యాము?

వీరివాదమును ఖండించుట కాదిచట కావలసినది. వాదమే లేనిది ఖండించు టెట్లు? ఖండించువా రెవరు? సమరసభావ ముండవలెనుగాని యట్లు చేసి యంతము చేయఁగలరా? తుదకు వ్యక్తిదూషణలలోనికిఁ దిగుటా? ముఖ్యముగా నాకుఁ బ్రసక్తి కల్గించినది వీరి విమర్శనస్వభావము; తన్నిరంకుశత్వము. ఆ శంకరాస్యకర్తగారే భారతి నడిచినను రెండు మాటలలంకరించిరట. రెండుమాటలే కాదు. అనేకసార్లు అలంకరించిరి. భారతిపత్రికలో వారు వ్రాయఁగూడదనియా వీరియభిప్రాయము? కానిచో భాషాయోష నలంకరించుట కవిబాధ్యత కాదా? ఒక్కవారే కాదు. పలువు రలంకరించిరి. పలుతెలుఁగుల భూషణములచే నలంకరించిరి. ఇప్పుడే కాదు. శతాబ్దుల క్రిందటనే బయలువెడలినపాటలను, పదములను, ద్విపదములను, కృతులను వినరో? అట్టి రచనలను కవిత్వమనరో పెద్దవారు?

రసలోలుఁ డగు కవి యొక్కొక్కయెడ నొక్కొక్కరసమును బ్రదర్శించుచుండును. ముక్తిబోధకము సంసుబోధకము కానంత వఱకు నట్టి రచనలను గర్హింపవలసిన పనియేమి? దాస వాఙ్మయమునకు గల్గునష్టమేమి? బండబూతులను బంధపద్యముల నల్లిన నుపయోగమేమి?

'ఇట్టి వెఱ్ఱిశృంగార రసప్రధానఖండ కావ్యములం దలంపకేలొకో' అని వీరు, ఆంధ్ర శృంగార ప్రబంధముల మచ్చునకేని లేకుండ మంటఁబెట్టవలె ననిరట మెవరో, ఆ విమర్శకులను హెచ్చరించుచున్నారు. ఇందలి రసము వీరేవగించుచున్న ట్లిందుమూలమునఁ దెట పడినది. శుద్ధప్రణయరసమును గవియైనవాఁడు చిత్రింపకుండెనా? దీనిని జిత్రపటములు ప్రదర్శింపఁగూడదఁట. వీరు గొప్పసంస్కారమును గోరుచున్నారు. విపరీతమైనసంస్కారమనుట నిజమునకు దూరమా? వీరికోరిక ప్రకారము చాలదూరము పోవలసివచ్చును. అజంతా చిత్తరువులవంటి యనేకప్రాచ్యకళలను నాశము చేయవలసివచ్చును. వాఙ్మయమునుండి చాల గ్రంథములఁ దొలగింపవలసివచ్చును.

ఇంతటితో వీరు తృప్తినొందక కవిగారు యొంకిని, యెంకి భారతిని విడువఁజాలకున్నారు కాఁబోలునని యొకవక్రోక్తిఁ బ్రయోగించిరి. అది కవిగారిమాట యటుండఁ బాఠకులకే కటువుగాఁ దోఁచుచున్నదని నా యభిప్రాయము. నామట్టునకు నాకవి యసభ్యముగఁ దట్టు చున్నది. యెంకిపేరును విడిచిన మాత్రమున వీరికి శాంతిజనించునా? వీరిహాస్యోద్దేశము విని విడువఁదలఁచుకోనిరేమో కవిగారు! వీ రెంత యాగ్రహపడినను కృపావల్లి భారతీమతల్లి యెట్లు తిరస్కరింపఁగలదు?

"కాటుకకంటె నెరు నెమకట్టుపయింబడ నలయేడ్చెదో
కైటభదైత్యమర్దనుని గాదిలి కోడల! యోమదంబ! యో
హాటకగర్భురాణి! నిను నాకటికిం గొనిపోయి యల్ల
కర్ణాటకరాటకీచకుల కమ్ముదు బ్రహ్మము సత్యభారతీ!"

అని పరమభాగవతోత్తముఁడు పోతన యుభయవాక్యము వల్కినటు లట్టి యకృత్య సమయములఁగాని యేపల్కులతోఁ గీర్తించిన నామె యలరదు? తనయునఁగు పెద్దల మృదు వాక్యములను దల్లి త్రోసిపుచ్చునా?

క్రమము దప్పి యట్టిరచన లొనర్చు వారు ముందువెనుకల నక్షరసంకేతములుగల విద్వాంసులు సాహితీవిశారదులు నట! వారు చేయురచనలను—భారతి విడువక చేపట్టుచున్నరచనలను—సక్రమమార్గమునకుఁ దెచ్చుటకు వీరెట్లు విమర్శించుచున్నారో? వారేదో వహించిరన్న స్వేచ్ఛను వీరు సహింపలేక భంగము చేసెదరా?

ఇఁక నొక వాక్యముతో శ్రీలక్ష్మీనారాయణగారి విమర్శనము పూర్తియైనది. "అబ్బబ్బా! కొన్ని కవనంబులు వమనంబులు దెచ్చుచున్నవి". అట్టికవనమున ముఖ్యమైనదానిని గదా విమర్శకులు ముందుంచిరి. అంతకన్న వీరికి వమనంబులు దెచ్చునదియుండదు. పాపము! దానిపై వీరికున్నయసహ్యభావమునంతయు నిందులో వెడలఁగ్రక్కిరి. ఇఁకనైన శాంతింతురా వీరుఁ అనఁగా వీరివ్యాసమున నుదహరింపఁబడిన పాట మీ కంతమోటుగాఁ దోఁచుచున్నదా?— కాదు— వమనములఁ దెచ్చుచున్నదా?

శ్రీవారు లోకానుభవము భాషానుభవము గలవారని వారివ్యాసమే చాటుచుండుటలేదా? పెద్దలగువారికి వేఱ విన్నవింపవలసినది లేదు. అభిప్రాయము భిన్నముగ నున్నప్పుడు వెల్లడింపవచ్చును. దోసములని తోఁచి

నవానిని విమర్శింపవచ్చును. తమకు నచ్చినయెడల నభిప్రాయము మార్చుకొనవచ్చును. కాని యేమిది? విమర్శనవికారమా? సంస్కారమా? సంస్కారతిరస్కారణమా? నిష్కారణనిగర్వాణమా? మొదలు విద్వాంసులు కవనమును గూర్చి వీరికి యేవకలుగుచుండఁ దమలేఖ కట్టి ప్రత్యేకస్వశక్తినిందార్థసూచకమగు నామమిడుటా? భారతిని బెదరించుటా? ఇది యరసికజనసహజధోరణియో? ఎల్లలు నెల్ల విమర్శింపనలసిరకో? మాకాంట్లందఱకు మార్గదర్శనమా యిది? అని నాయట్టివాఁ డనఁ బలసినదా? నారాయణా! నీకోడలు వాగ్దేవియెడఁ బ్రసన్నుఁడవు కమ్ము!

ఇంతదనుక నంటరానివాఁడు నసరానివాఁడు ననఁబడినవాఁడు నేఁడు సంఘమునందు సమానప్రతిపత్తిగౌరవములఁ బడయుచున్నాఁడు. దానికేమి? చుట్టలఁ గాల్చువారు వాతావరణమంతయు పొగధూమముతో నింపుచుండ సహించుట లేదా? మోటరుబండ్ల వలనఁ జెలరేగుపెంటధూళిని భరించుచు పాదచారులు ముక్కుమూసికొని పోవుట లేదా? ఇట్టిపెంపు సయ్యేనను ఆరచనలలో విమర్శకుదృష్టికిఁ దగిలెనా? లోకము స్వాతంత్ర్యవాయుపూరితమైయున్నదని వారే సెలవిచ్చిరే? ఎందుల కీగందరగోళము? వృథాయాసము? భిన్నభిన్నరుచుల కన్నియు నవశ్యములే యగుచున్నవే? సమరసభావమును నవయుగనీతిని బ్రాజ్ఞులనాలంబింపఁజనదా? ఎవరికిఁ బట్టిరాని దేదైన దానియంత నదియే నశింపదా? బుద్ధిమంతులు నసంబద్ధవివాదములతో గాలము గడుపుచున్నందులకు సిగ్గుపడుచు మిత్రులగు లక్ష్మీనారాయణగారియెడఁ గలచనవు పెంపున నిట్టియసంరక్షలేఖనముల విరమించి సావధానమగు భాషాసేవఁ జేయఁబూనుఁడని వేడుకొనుచున్నాఁడ.

పూర్వాపునికపండితకవిశిరోమణులయందలి సంపూర్ణగౌరవముతోనే యియ్యది వ్రాయఁబడినది. ప్రాచీనుల ప్రయోగములను వ్యాకరణాదినియమములను బాటించుచుఁ బద్యములు సెప్ప నేర్చినవారిల నిందింపలేదు. ఛందోబద్ధముగఁ గూర్చినదే కవిత్వమని నూతనపథగాముల నిందించి దూషణలలోనికి దిగువారి దురభిమాన దురహంకారములు పరిత్యాజ్యములని వెల్లడించుటే నాయుద్దేశము. మామిత్రులయాగ్రహమునకుఁ బాత్రమయిన యీఖండకావ్యమునందలి యుత్కృష్ట భావములు నించుకేనియుఁ గాంచునటులఁ జేయగల్గునేమో యనునాసతో 'మెంకి' అనుపేరును గూడ మాని యీపద్యమును వ్రాయ సాహసించితిని. కవిగారును, పాఠకులును దోసఁగులను మన్నింపఁ బ్రార్థన.

చ. వెనుకటి జన్మమందునను ప్రేయసి! యెవ్వరమై చనుంటిమో
యనఁగను వ్రీడచే నగుచు నద్భుతమందెదె; నిఁకెట్టి భావమునం
గనెదము ముందు చెల్వ! యనఁ గ్రక్కునఁ దాఁ దెలఁబోయె; నింతిరో!
మన కిటు లెంతకాలము యమంద సుఖంబుల నందుటన్నఁ గ
న్గొనలను బాష్పతోయమును గొబ్బున రాల్చె నదెట్టి ప్రేమయో. *

నేను

[ఒకరు]

జిలుఁగు వసనాల మణిమయోజ్జ్వలమనోజ్ఞ
కాంచనాంచితభూషణగణముఁ బూని
రాజవీథుల రతనాలరథము నెక్కి
వెడలు నిర్జీవపాషాణవిగ్రహంబ
చిమ్మచీఁకటి పొగల నిశీథమందు
క్షుద్రమందిరాంతర జీర్ణకుడ్యతలము
లందుఁ గన్నులు మూసి, యానందశీత
యోగవిజ్ఞాన మర్పిన యోజ, వెడలు
మఱచి కులుకు దివాంధమా! మెఱుఁగులొ
చలువరాతి మేడల చెఱసాలలందుఁ గులుకు
దళుకు బంగారు సంకెళ్ళఁ దాల్చి, లోక
పాలకుని వోలె మురియు నో బానిసీఁడ!
ఓకుటిలపన్నగమ! చెవి యొగ్గి వినుఁడు!
ఏను స్వేచ్ఛాకుమారుఁడ నేను, గగన
పథవిహారవిహంగమపతిని నేను,
మోహనవిశాలజలధలమూర్తి నేను,
ప్రళయఝంఝూప్రభంజన స్వామి నేను!

*[శ్రీనండూరి వేంకటసుబ్బారావుగారిచే రచింపబడిన "ఎజ్ఞనాయెంకి" పై అనుకూలముగను ప్రతికూలముగనుకూడ వ్రాయబడిన విమర్శనములను ప్రకటించితిమి. వారిపాటలలో భాషసంపదయుండుటవలననే భారతిలో వానిని ప్రకటించితిమి. విమర్శకులును ప్రతివిమర్శకులునుకూడ పాటయందలి భావమును విమర్శింపఁబూనుకొనక అనవసరవిషయములలో తమ వాదకౌశల్యమును ప్రదర్శించిరి. ప్రాకృతజనుల జీవితమును రసవంతముగ వారికి సహజమగు భాషలో గేయరూపమున బ్రదర్శించి వారి కుత్తేజమును పాఠకులకు వినోదమును మానసికానందమును గూడ సమర్పించు శ్రీసుబ్బారావుగారి ప్రయత్నము శ్లాఘ్యము. విమర్శనపాత్రమైన పాటలలో నసభ్యతగాని యనౌచిత్యముగాని లేదని మావిశ్వాసము. ప్రాకృతజనులు ముందువెనుకల జీవితమును పారజూచికొని సంతోషవిచారాదిభావానుభవముల నొందు రసావస్థయే ఇందు యథోచితరీతిని బ్రదర్శింపబడినది. కాని పాఠకులయొక్క రుచిభేదములను ప్రదర్శించు నుత్సాహముతో మాత్రమే అనుకూల ప్రతికూలవిమర్శనముల రెండిటిని బ్రకటించితిమి. ఈపాటను గూర్చిన చర్చను ఈపత్రికయందింతటితో విరమించుచున్నాము.]

సంపాదకుడు.

259
KODANDARAMA LIBRARY
TELAPROLU.

JPLAB4M126



సీ. శ్రీమీఱఁ గల్యాణచిహ్నితయై గౌరి వామాంకమునఁ జేరి వలపుఁగొలుప, పాపనెత్తైపుఁజుట్టపై లేఁతజాబిల్లి చల్ల
వెన్నెల వెదచల్లుచుండ, బహుగణాధీశ్వరుల్ పటహాదివాద్యముల్ వింతరీతుల మేళవించుచుండ, నేత్రోత్సవము
గాఁగ నిఖిలబృందారకుల్ చూచి రాక్షసభీతి ప్రాచికొనఁగ, చక్క వృషభేంద్రుపై నెక్కి సకలజగము,
గొలువ నూరేఁగసాగిన లలితమూర్తి, శంకరుఁడు భక్తలోక శివంకరుండు, మనలఁ గరుణావిధేయుఁడై
మనుచుఁగాత!

Lakshmi Art, Bombay 8.

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	TPLA134M126
పుస్తకం పేరు	భారతి
తారీఖు	31/10/24
ముందు అట్ట	No
వెనక అట్ట	No
మొత్తం పేజీలు	95
పెద్ద సైజు పేజీలు	No
ఖాళీ పేజీలు	232,239,
లేనిపేజీలు	170 147
తయారు చేసినది	Indira
పేజీలు విడదీసినది	Ishanth
	Mounika
పరీక్ష చేసినది	RUKSANA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	

Good